ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నల్లగొండ

: fb.com/vaartha Digital



కపిల్ చిట్స్ తోడుంటే కనక మహాలక్ష్మీ మీ వెంటే
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం



Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam

14-11-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 283 పేజీలు: 8+16 వెల: 6.50




## మరో 32 ప్రాంతాల్లో
# పేలుళ్లకు కుట్ర?

### బాబ్రీ మసీదు కూల్చివేత రోజు డిసెంబరు 6న ఆరు రాష్ట్రాల్లో ఏకకాలంలో పేల్చేందుకు 'ఉగ్ర' ప్రణాళిక



### అల్‌ఫలా సభ్యత్వం రద్దు
అఖిలభారత వర్సిటీల సంఘం నిర్ణయం

2



గురువారం సికింద్రాబాద్ స్టేషన్‌లో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

### మారుతి స్విఫ్ట్, ఫోర్డ్ ఐకాన్ వంటి పాతకార్లు వాడకం!

### ఎన్ఐఎ, ఢిల్లీ పోలీసుల విచారణలో నిందితుల వెల్లడి

### మసూద్ అజార్ సోదరి మహిళా వింగ్‌తో షహీన్ నిత్యం సంప్రదింపులు

**న్యూఢిల్లీ, నవంబరు 13:** ఎర్రకోట వద్ద కారుబాంబు పేలుడు కేసులో మరిన్ని విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. బాబ్రీ మసీదు కూల్చివేత దినం డిసెంబరు ఆరవ తేదీ దేశవ్యాప్తంగా 32 ప్రాంతాల్లో కారుబాంబు పేలుళ్లకు ఉగ్రవాదులు పన్నాగం పన్నారు. ఎన్ఐఎ, ఢిల్లీపోలీసుల విచారణలో అరెస్టు అయిన నిందితులు వివరించిన వివరాలనుచూస్తూంటే దేశంలో భయోత్పాతం సృష్టించాలన్న కుట్రలతోనే ఉన్నట్లు తెలిసింది. బాబ్రీమసీదును డిసెంబరు ఆరవ తేదీనే కూల్చివేసినందున అందుకు ప్రతీకారంగా ఈ పేలుళ్ల >>2



హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు

# 'జూబ్లీ'పై ఏ జెండా?

### నేటి ఉ. 8 గం. నుండి ఓట్ల లెక్కింపు

### సిట్టింగ్ సీటుపై ఆశతో బిఆర్ఎస్

### తమ ఆధిక్యం ఖాయమంటున్న అధికార కాంగ్రెస్

### 42 టేబుళ్లపై 10 రౌండ్లలో పూర్తికి ఏర్పాట్లు

### కోట్ల స్టేడియం వద్ద పటిష్ట భద్రత

**హైదరాబాద్, నవంబర్ 13,ప్రభాతవార్త:** అధికార, విపక్షాల మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం నేడు తేలనుంది. సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవాలని బీఆర్ఎస్, ఎలాగైనా జూబ్లీ హిల్స్‌పై జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డి పోరాడాయి. సుమారు నెలరోజుల పాటు పార్టీలుతమ నాయకత్వాన్ని నియోజకవర్గంలో మోహరించాయి. విమర్శలు, ప్రతివిమర్శలు, సవాళ్లు, ప్రతి సవాళ్లతో రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ రేపిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిచేదెవరో >>2

### బీహార్ కౌంటింగ్‌కు భారీ ఏర్పాట్లు 5



# నేడు టెట్ నోటిఫికేషన్ జారీ

### రేపటి నుంచి 29 దాకా దరఖాస్తుల స్వీకరణ

### జనవరి 3 నుంచి 31 వరకు పరీక్షలు

### పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్

**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 13:** తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్‌ను నేడు(శుక్రవారం) జారీ చేయనున్నారు. రేపటి(శనివారం) నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. దరఖాస్తులను ఈ నెల 29 వరకు స్వీకరించనున్నట్టు పాఠశాల విద్య డైరక్టర్, టిజి టెట్ ఛైర్‌పర్సన్ నవీన్ నికోలస్ గురువారం ప్రకటనలో తెలిపారు. టెట్-2025 రెండో విడత పరీక్షలను 2026, జనవరి 3 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్టు ప్రకటనలో తెలిపారు. 2025 సంవత్సరానికి సంబంధించి తొలి విడత టెట్ నోటిఫికేషన్‌ను ఈ ఏడాది ఏప్రిల్‌లో జారీ చేసి జూన్‌లో పరీక్షలను నిర్వహించారు. జులై 22న ఫలితాలు కూడా వెల్లడించారు. ఇపుడు రెండో విడత నోటిఫికేషన్‌ను నేడు విడుదల చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు కూడా టెట్‌లో అర్హత సాధించాలని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో అందుకు సంబంధించిన సవరణలతో టెట్ నోటిఫికేషన్‌లో జారీ చేసే అవకాశం ఉంది. టెట్‌పై సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో టెట్ జీఓలో సవరణలు చేయాల్సి ఉన్నందున అందుకు సంబంధించిన సవరణలను పాఠశాల విద్య శాఖ అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం ఆమోదం తెలిపిన సవరణలతో నేడు టెట్ నోటిఫికేషన్ వెలువడనుంది. సెప్టెంబరు 1న సుప్రీంకోర్టు వెల్లడించిన >>2

### ఆత్మాహుతి దాడితో శ్రీలంక
# క్రికెటర్లు వెనుకంజ

### తిరిగి వెళ్లేందుకు ఎనిమిది మంది క్రికెటర్లు రిక్వెస్టు

### కాదు ఆడాల్సిందేనని కఠిన ఆంక్షలు విధించిన శ్రీలంక బోర్డు

3

## ప్రపంచ పెట్టుబడులకు
# గమ్యస్థానం హైదరాబాద్



ఢిల్లీలో యుఎస్ఐఎస్‌పిఎఫ్ వార్షిక సమ్మిట్‌లో సిఎం రేవంత్

### యుఎస్ఐఎస్‌పిఎఫ్ వార్షిక సమ్మిట్‌లో సిఎం రేవంత్

### ఢిల్లీలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ ప్రదర్శన

### ట్రెండ్ మారుస్తా.. రోడ్లకు కంపెనీల పేర్లు

### ముఖ్యమంత్రిపై ప్రశంసలు కురిపించిన టెక్ దిగ్గజాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్13:** అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఎటువంటి ఢోకా లేకుండా భౌగోళికంగా కేంద్ర స్థానంలో ఉన్న హైదరాబాద్ ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని ముఖ్యమంత్రి అన్నారు. ఢిల్లీలో గురువారం జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు-భారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో (యుఎస్ఐఎస్‌పిఎఫ్) ముఖ్యమంత్రి ప్రసంగించారు. తెలంగాణలో గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తో పాటు అనేక పార్టీలు ప్రభుత్వాలకు సారథ్యం వహించినా పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలిచారని ముఖ్యమంత్రి వివరించారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖ ద్వారమని సీఎం తెలిపారు. జీసీసీలకు గమ్యస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ భారతదేశంలోనే నూతన నగరంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని సీఎం అన్నారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్, రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్‌ఫ్రా >>2

### నేరచరితుల కట్టడికే పార్లమెంటు జెపిసి

### ఎంపి అపరాజితా సారంగి నేతృత్వంలో 31మందితో కమిటీ

### 130వ రాజ్యాంగ సవరణ బిల్లు అమలులోకి..

5



పెదషాపూర్ వద్ద బియ్యం పట్టుకొన్న అధికారులు

## రూ.20.76 కోట్ల
# ధాన్యం గల్లంతు

### విజిలెన్స్ ఆకస్మికదాడులలో వెలుగులోకి

### పెదషాపూర్ వద్ద రూ.5లక్షల బియ్యం పట్టుకొన్న అధికారులు

### ఓవర్‌లోడ్‌కు రూ.2.80లక్షల జరిమానా

**హైదరాబాద్, నవంబరు 13,ప్రభాతవార్త:** విజిలెన్స్ అధికారులు తెలంగాణలోని నిర్మల్, వనపర్తి, సంగారెడ్డి జిల్లాలోని రైసుమిల్లుపై ఆకస్మిక దాడులు నిర్వహించి 2024-25 రబీ, ఖరీఫ్ సీజన్‌కు చెందిన రూ.20.76కోట్ల కస్టమ్ మిల్లింగ్ ధాన్యం పక్కదారి పట్టించిన అక్రమార్కులపై కేసులు నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు కరీంనగర్ విజిలెన్స్ యూనిట్ నిర్మల్ జిల్లా కడెం మండలం నాచన్‌ఎల్లాపూర్‌లోని కట్ట బాలాజీ రైస్‌మిల్లు పై మంగళవారం ఆకస్మిక తనిఖీ చేయడం మొదలు పెట్టారు. మిల్లు యజమాని 2024-25 రబీ సీజన్‌కు చెందిన రూ. 6.22కోట్ల విలువైన 2648మె.టన్నుల సిఎంఆర్ ధాన్యం దారిమళ్లించాడని ఒక రోజంతా స్టాకు పూర్తిగా లెక్కించాక అధికారులు నిర్ధారణకు రావడంతో పౌరసరఫరాలశాఖ అధికారుకు కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీచేశారు. వనపర్తి జిల్లాలో పెద్దమందడి మండలం మోజర్ల గ్రామంలో వారాహి, చాముండి రైసుమిల్లులపై బుధవారం దాడులు జరిపి స్టాకును లెక్కించడం మొదలు పెట్టారు. విజిలెన్స్ డిఎస్‌పి నేతృత్వంలో విశ్వసనీయ సమాచారంతో తనిఖీలు చేయగా రూ. 13.67లక్షల విలువైన 1,47,375 బస్తాలు ఆరెండు రైస్‌మిల్లుల్లో >>2

### ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు:
# 17న సుప్రీం విచారణ



### నేడు, రేపు స్పీకర్ విచారణకు పోచారం, అరికెపూడి గాంధీ

### పార్టీ ఫిరాయించిన బెంగాల్ ఎమ్మెల్యేపై కలకత్తా హైకోర్టు వేటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్13:** తెలంగాణ రాజకీయాల్లో మరో ఉత్కంఠభరిత ఘట్టం మొదలైంది. పార్టీ మారిన ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన పిటీషన్లన్నిటినీ సోమవారం(17వ తేదీ) విచారిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. కోర్టు నిర్దేశించిన 3 నెలల గడువులోగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోలేదంటూ బిఆర్ఎస్ ఇటీవల స్పీకర్‌పై ధిక్కరణ పిటీషన్‌ను దాఖలు చేయడం తెలిసిందే. వీటిపై నిర్ణయానికి మరో 2 నెలల సమయం కావాలని స్పీకర్ కార్యాలయం అంతకు ముందే సుప్రీంకోర్టును కోరింది. అన్ని పిటీషన్లను కలిపి విచారణ చేస్తామని సుప్రీంకోర్టు తాజాగా స్పష్టం చేసింది. సోమవారం విచారణకు రానున్న ఈకేసులో... ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో భారీ ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా, పార్టీ మారిన పశ్చిమ బెంగాల్ సీనియర్ >>2

### ఎస్ఎల్‌బిసి టన్నెల్ నిర్మాణ సంస్థ
# జెపి ఇన్‌ఫ్రాటెక్ ఎండి అరెస్టు



### దాదాపు రూ. 12 వేల కోట్ల మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు

### హౌసింగ్ కేసులో అరెస్టు చేసిన ఇడి

**హైదరాబాద్,నవంబరు 13,ప్రభాతవార్త:** హెలికాప్టర్‌తో శ్రీశైలం ఎడమగట్టు సొరంగం భూభౌతిక పరిస్థితి అధ్యయనం చేయడానికి చేస్తున్న హెలీబోర్న్ మ్యాగ్నెటిక్ జియో ఫిజికల్ సర్వే దాదాపు తుదిఅంకం చేరుకొంటున్న సమయంలో మనీల్యాండరింగ్ కేసులో జెపి ఇన్‌ఫ్రాటెక్ ఎండి మనోజ్‌గౌర్‌ను గురువారం ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్టు చేయడంతో ఎస్ఎల్‌బిసి నిర్మాణంపై మరోమారు అనిశ్చితి నెలకొంది. జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ సంస్థకు గతంలో మాజీ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్, సిఇఒగా కూడా ఆయన విధులు నిర్వహించారు. జెపి విష్‌టౌన్, జెపి గ్రీన్స్ ప్రాజెక్ట్స్ వద్ద ఇండ్లు ఖరీదు చేసిన వారు ఇచ్చిన ఫిర్యాదుతో ఆర్థిక నేర శాఖ దాఖలు చేసిన కేసు ఆధారంగా ఢిల్లీ, యూపీకి చెందిన జెపి గ్రూపుపై ఇడి తనిఖీలు నిర్వహిస్తున్నది. జై ప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ కంపెనీ చీటింగ్‌కు పాల్పడినట్లు పలు ఆరోపణలు ఉన్నాయి. సుమారు 12 వేల కోట్ల మేర మనీల్యాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. >>2

# లాభాలకోసం ఆర్టీసీ అన్వేషణ

### బస్సు ప్రమాదాలు తగ్గించడానికి డ్రైవర్ మానిటరింగ్ సిస్టం: మంత్రి పొన్నం



**హైదరాబాద్, ప్రభాతవార్త, నవంబరు 13:** నష్టాల్లో ఉన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టిసి) డిపో లపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి .. లాభాల్లోకి వచ్చేలా ఆయా డిపోలకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని, ఆర్‌టిసిలో రెవెన్యూ పెంచుకోవడానికి అవకాశాలను అన్వేషించాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్‌టిసి ఉన్నతాధికారులకు సూచించారు. నగరంలో పెరుగుతున్న కొత్త కాలనీలకు అనుగుణంగా బస్సు రూట్‌లు పెంచేలా అధ్యయనం >>2



### 43 రోజుల షట్‌డౌన్ ముగింపు!

### ప్రభుత్వ ఫండింగ్ బిల్లుపై ట్రంప్ సంతకం

5

# లక్కీడ్రా పేరుతో దోపిడీ

### మంచి విత్తుల్లో నాసిరకం మిక్సింగ్

### హైబ్రిడ్ పేరుతో సాధారణ రకాలు

### అన్నదాతను ముంచుతున్న విత్తన సంస్థలు



**హైదరాబాద్, నవంబరు 13, ప్రభాత వార్త:** రాష్ట్రంలో యాసంగి సీజను ప్రారంభమైన నేపథ్యంలో తెలంగాణలో పలు విత్తన సంస్థలు రైతులను నిలువునా ముంచేస్తున్నాయి. అమాయకులైన రైతులకు ఎరవేసి నకిలీ, నాసి రకం విత్తనాలు అంటగడుతున్నాయి. ఏజెన్సీలే లక్ష్యంగా విత్తన కంపెనీలు మోసాలకు తెగిస్తున్నాయి. >>2



న్యూఢిల్లీలో కలుషితమైన యమునా నది నురగల మధ్య గురువారం పడవలు నడుపుతున్న ప్రజలు

# అల్‌ఫలా సభ్యత్వం రద్దు

## అఖిలభారత వర్సిటీల సంఘం నిర్ణయం

### ఒక డాక్టర్ కోసం ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసులు

**న్యూఢిల్లీ, నవంబరు 13:** ఢిల్లీ కారుబాంబు కేసుల దర్యాప్తులో బయటపడిన అల్‌పలాహ్ యూనివర్సిటీ వ్యవహారంపై దృష్టిపెట్టిన కేంద్రం వైట్‌కాలర్ ఉగ్రవాదులందరికీ ఈ యూనివర్సిటీ కేంద్రంగా మారడంతో నాక్ నోటీసులు జారీచేయడంతోపాటు ఈ యూనివర్సిటీ గుర్తింపును రద్దుచేసే ఆలోచనలో ఉంది. నిందితులందరి పరిచయాలకు ఈ వర్సిటీయే కేంద్రంగా నిలిచిందని దర్యాప్తుసంస్థలు నిర్ధారించాయి. ఇప్పటికే ఈకేసు ఎన్ఐఎ దర్యాప్తుచేస్తోంది అల్‌ఫలాహ్ ఆర్థిక వ్యవహారాలన్నీఈ ఈడీ దర్యాప్తుచేపట్టింది. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఫరీదాబాద్‌లోని అల్‌ఫలాహ్ విశ్వవిద్యాలయం సభ్యత్వాన్ని సస్పెండ్‌చేసింది. అన్ని వర్సిటీలు మంచి స్థితిని కొనసాగించినంతవరకూ మాత్రమే సభ్యులుగా ఉంటాయని ఎఐఎ పేర్కొంది. దీనితో ఎఐఎ విశ్వవిద్యాలయం సభ్యత్వాన్ని తక్షణమే నిలిపివేసింది. ఎఐఎ పేరుకానీ, లోగో కానీ ఉపయోగించడం నిలిపివేయాలని అసోసియేషన్ సంస్థను ఆదేశించింది. సంస్థ అధికారిక వెబ్‌సైట్‌నుంచి ఎఐయు లోగోను వెంటనే తొలగించాలని అల్‌ఫలాహ్ వర్సిటీని ఆదేశించింది.

**ఇంటర్‌పోల్‌సాయం కోరిన ఎన్ఐఎ**

ఢిల్లీ ఎర్రకోట పేలుడు సంఘటనతో సంబంధం ఉన్న జమ్ముకాశ్మీర్‌లోని కాజిగుండ్‌కు చెందిన డా.ముజఫర్‌పై రెడ్‌కార్నర్‌నోటీసులు జారీచేయాలని ఇంటర్‌పోల్‌కు ఎన్ఐఎ లేఖలురాసింది. ఇప్పటికే ముగ్గురు వైద్యులుసహా మొత్తంఎనిమిదిమంది అరెస్టు అయితే వారిలో డా.ఆదిల్‌ఉన్నాడు. ఆతడి సోదరుడే డా.ముజఫ్ఫర్. 201లో తుర్కియేను సందర్శించిన డా.ముజమ్మిల్, డా.ఉమర్‌నబీ తదితరుల వైద్యబృందంలో ఈతడు కూడా ఉన్నాడు. తుర్కియేలో 21రోజులపాటు ఉండి ఎర్రకోటవద్ద పేలుడుకు కారణమైన కారును డా.ఉమర్‌నబీనే నడిపినట్లు గుర్తించినసంగతి తెలిసిందే. ఇపుడు ముజఫ్ఫర్ పేరు బయటికరాగానే ఆతడి ఆచూకీకోసం ప్రయత్నించారు. ఆగస్టులోనే దుబాయికి పారిపోయినట్లు గుర్తించారు. ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్నట్లు తేలడంతో ఆతడిపైరెడ్‌కార్నర్‌నోటీసు జారీచేయాలని ఇంటర్‌పోల్‌ను కోరారు.

# జెపి ఇన్‌ఫ్రాటెక్ ఎండి అరెస్టు

>> పీఎంఎల్‌ఏ చట్ట కింద గౌర్‌ను అరెస్టు చేశారు. ఇండ్లు ఖరీదు చేసిన వారి డబ్బులను దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. ఆ నిధులను దారిమళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎస్ఎల్‌బిసి నిర్మాణం పనులు ఈ సంస్థకు అప్పగించవద్దని నీటిపారుదలశాఖ అధికారులు సూచించినా కూడా మళ్ళీ జెపి సంస్థకు అప్పగించడమే కాకుండా గ్రీన్ చానల్ ద్వారా నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వం సుముఖంగా ఉంది. ఇప్పటికే ఎస్ఎల్‌బిసి నిర్మాణం పనులు నత్తలకు నడక నేర్పుతోన్నది. దీనికి తగ్గట్లు అనేక ఆటంకాలు అడుగడుగున జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో సొరంగం కుప్పకూలిపోయి అందులో పనిచేసే కార్మికులు గల్లంతైనారు. ఇద్దరి మృతదేహాలు మినహా మిగితా కార్మికుల ఆచూకి తెలుసుకులేకపోయారు. షీర్‌జోన్స్ సమస్యలేకుండా ఎస్ఎల్‌బిసి సొరంగం గుర్రపుడెక్క ఆకారంలో తవ్వి పాత మార్గంకు ఔట్‌లెట్‌వైపు కలుపాలని ప్రభుత్వం హెలికాప్టర్‌తో సర్వేకూడా వేగవంతంగా చేస్తున్నది. ఇలాంటి సమయంలో జెపి సంస్థ ఎండి మనోజ్‌గౌర్ అరెస్టు కావడంతో మన ఎస్ఎల్‌బిసి డిసెంబరు 2026కు పూర్తిచేయాలనే లక్ష్యం నెరవేరుతుందా లేదా అనేది కాలమే జవాబు చెప్పాలి. నేషనల్ జియో ఫిజికల్ ఇన్స్టిట్యూట్ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ప్రత్యేక హెలీకాప్టర్ మన్నెవారిపల్లి ఔట్ లెట్ నుంచి దోమలపెంట ఇన్‌లెట్ వరకు తిరుగతూ సర్వే పదకొండు రోజులుగా జరుగుతోన్నది.మ్యాగ్నమీటర్, రిసీవర్, ట్రాన్స్ మిట్టర్ లూప్ లుఅమర్చిన ప్రత్యేక హెలీకాప్టర్‌ను సర్వేకు ఉపయోగిస్తున్నారు. హెలికాప్టర్ టేకాఫ్ అయిన ప్రతి సారి గాలిలో దాదాపు 150 మీటర్ల ఎత్తు నుంచి ఐదు నుంచి ఎనిమిది చక్కర్లు కొడుతూ భూమిలోపల దాదాపు 500 నుంచి 800 మీటర్ల లోతు వరకు విద్యుదయస్కాంత తరంగాలను ప్రసరింప చేస్తూ ప్రతి ఇంచు ఇంచు జల్లెడ పడుతోన్నది. ప్రమాదం జరిగిన ప్రాంతం, ఇక ముందు తవ్వాల్సిన సొరంగ అలైన్మెంట్ తోపాటు సొరంగ మార్గం తవ్వకం పూర్తైన ప్రాంతాన్ని శాస్త్రజ్ఞులు పరిశీలించాలని నిర్ణయించడంతో 43 కి.మీ.నిడివిలో సొరంగం అడ్డం సుమారు 3 కి. మీ. పరిధిలో సర్వే చేస్తున్నారు. దీని కోసం సొరంగం ప్రతిపాదితన ప్రాంతంను 14 వరుసలుగా విభజించుకుని, ఒక్కో వరుసలో 100 నుంచి 500 మీటర్ల మధ్య సర్వే చేపడుతున్నారు. దీని ద్వారా భూమిలోపల షీయర్ జోన్స్ వంటి ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఏరియల్ సర్వే ముగిసిన వెంటనే నవంబరు 29లోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వబోతుండటంతో ఎస్ఎల్‌బిసి సొరంగం తవ్వకానికి సమాయత్తం అవుతున్న సమయంలో జెపి ఇన్‌ఫ్రాటెక్ ఎండి అరెస్టుకావడం ఎస్ఎల్‌బిసి కష్టాలు తీరడం ఇప్పట్లో సాధ్యమౌతుందా అనే అనుమానం మొదలైంది.

# లక్కీ డ్రా పేరుతో దోపిడీ

>> అమాయక రైతులను లక్కీ డ్రాల పేరుతో కొన్ని సంస్థలకు చెందిన ప్రతినిధులు వంచనకు గురి చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బుకింగ్ చేయడంతోపాటు, బహుమతులు అంటూ బురిడీ కొట్టిస్తున్నారు. అందమైన బ్రోచర్లు, ఆకట్టుకునే విధంగా కరపత్రాలు చూపించి నకిలీ, నాసిరకం విత్తనాలును అంటగడుతున్నారు. రాష్ట్రంలో ఈ యాసంగి సీజనులో 68.67 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, ఇందులో ప్రధాన పంట వరి అత్యధికంగా 51.48 లక్షల ఎకరాల్లో నాట్లు పడతాయని అంచనా వేసింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మార్కెట్లలో నకిలీలు, నాసికరం విత్తనాలు ప్రవేశించాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విత్తన కంపెనీల ప్రతినిధులు రైతులను నమ్మించి బుట్టలో వేసుకుంటున్నారు. ఆషామాషీ కాదంటూ బంపర్ ఆఫ్ ప్రకటిస్తూ బోల్తా కొట్టిస్తున్నారు. కేవం తమ కంపెనీ విత్తన ప్యాకెట్లు మూడు కొంటే చాలు జత ఎద్దులు, లేదంటే నగదు, ఇంకా రకరకాల గిఫ్ట్ ప్యాక్‌లంటూ గ్రామాల్లో ఊదరగొడుతున్నారు. గతంలో కూడా కొన్ని కంపెనీలు అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవడం, గిఫ్టుల పేరుతో దాదాపు వేల మంది రైతుల వద్ద నుండి ఒక్కొక్కరి వద్ద రూ.200 నుండి రూ.400 వరకూ లక్కీ డ్రా పేరిట వసూలు చేశారు. గిఫ్ట్ మాత్రం ఎవరికి రాలేదు సరికదా, ఇచ్చిన వరి, మిరప తదితర విత్తనాలు సైతం కాత, పూత లేక పెట్టుబడి సైతం నష్టపోవాల్సి వచ్చింది. ఇప్పుడు కూడా అదే విధంగా మూడు విత్తన కంపెనీలకు చెందిన ప్రతినిధులు విత్తనాలు, గిఫ్ట్‌ల పేరుతో మళ్లీ వసూలు చేస్తున్నట్లు పలువురు బహిరంగంగా చెబుతున్నారు.

# 'జూబ్లీ'పై ఏ జెండా!

>> తేలనుంది. ఈమేరకు శుక్రవారం యూసఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో కౌంటింగ్ జరగనుంది. నియోజకవర్గంలో మొత్తం 407 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన 4 లక్షల 1 వెయ్యి 365 మంది ఓటర్లుండగా వీరిలో మొత్తం లక్షా 94 వేల 631 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. వీరిలో పురుషులు 99 వేల 771 మంది కాగా, మహిళలు 94 వేల 855 మంది కాగా, థర్డ్ జెండర్ కు చెందిన 30 మంది ఓటర్లు తమ ఓటు వేశారు. దీంతో 48.49 శాతం ఓట్లు పోలయ్యాయి. అయితే అభ్యర్థులు 58 మంది ఉండటంతో 42 టేబుళ్ల ఏర్పాటు చేసి 10 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేస్తామని అధికారులు వివరించారు. ఫలితాలను ఎప్పటికప్పుడు ఈసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అనుమతి ఉన్నవారు మాత్రమే లెక్కింపు కేంద్రం వద్దకు రావాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభమై ఒక్కో రౌండు 45 నిమిషాల సమయం పడుతుందని మొత్తం ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 3 గంటలకు పూర్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోలింగ్ శాతం అతి తక్కువగా నమోదు కావడంతో గెలుపు అవకాశాలు ఉత్కంఠను రేపుతున్నాయి. తక్కువ పోలింగ్‌శాతం తమకే అనుకూలమని అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ విశ్లేషిస్తున్నాయి. సర్వేలన్నీ కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్నాయి. సిట్టింగ్ స్థానం తమకే దక్కుతుందని బీఆర్ఎస్ విశ్వాసం వ్యక్తం చేస్తోంది. ఎగ్జిట్‌పోల్స్ ప్రకారం చూస్తే కాంగ్రెస్ 6నుంచి 9 శాతం వరకు ఆధిక్యం వస్తుందని అంచనాలు వేస్తున్నారు.

## జూబ్లీహిల్స్ ఎన్సీపీ అభ్యర్థి మృతి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబర్ 13, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఎన్సిపి అభ్యర్థిగా బరిలోకి దిగిన మహమ్మద్ అన్వర్ గురువారం గుండెపోటుతో మృతి చెందారు. గడియారం గుర్తుతో ఆయన ఈ ఎన్నికల బరిలోకి దిగారు. చాతినొప్పి రావడంతో కుటుంబ సభ్యులు నాంపల్లిలోని కేర్‌ఆస్పత్రికి తరలించగాచికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి కన్నుమూశారు. ఓట్ల లెక్కింపుకు ఒక రోజు ముందే ఆయన మృతి చెందడం గమనార్హం.

## వారం - వర్జ్యం

14-11-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
దశమి రా.12.52
పూర్వఫల్గుణి రా.9.23, విశాఖ కార్తె
వర్జ్యం : తె.5.15-7.00
దు.ఉ.8.28-9.14, 2) మ.12.16-1.01
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** మీ వ్యూహాలు ఫలిస్తాయి. బాధ్యతలు సక్రమంగా నెరవేరుస్తారు. ముఖ్య మైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**వృషభం:** చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. టెంపరరిగా ఉన్న ఉద్యోగం పర్మినెంట్ అవుతుంది.

**మిథునం:** ఉద్యోగులకు ఆకస్మిక బదిలీలు ఉంటాయి. వివాదాలకు దూరంగా వుండండి. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

**కర్కాటకం :** శత్రువులు సైతం మిత్రులుగా మారతారు. వ్యాపారాలు లాభిస్తాయి. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది.

**సింహం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. ప్రముఖుల నుండి వచ్చిన ఆహ్వానం ఆశ్చర్యపరుస్తుంది.

**కన్య :** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్యము పట్ల మెలకువ అవసరం. దూర ప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకొంటారు.

**తుల:** కుటుంబ సమస్యలు తీరి ఊరట కలిగిస్తాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం. జీవిత భాగస్వామితో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**వృశ్చికం:** చిన్ననాటి మిత్రులతో భవిష్య ప్రణాళికల గురించి చర్చిస్తారు. సంతానం, విద్యా,ఉద్యోగావకాశాలు పొందుతారు.

**ధనుస్సు:** బంగారు ఆభరణాల భద్రత పట్ల అప్రమత్తత కలిగి ఉండండి. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండటం మంచిది.

**మకరం:** సెంటిమెంట్ వస్తువుల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచడం చెప్పదగినది. సంతానం నుండి కీలక సమాచారం అందుకుంటారు.

**కుంభం:** ఆర్థిక స్థితిగతులలో చెప్పుకోదగిన ఒడిదుడుకులు ఉండవు. ఉద్యోగులకు ఎదురైన చికాకులు కొంతవరకు తొలుగుతాయి.

**మీనం :** విలువైన పత్రములు, డాక్యుమెంట్స్ విషయములు జాగ్రత్తలు పాటించండి.క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మరో 32 ప్రాంతాల్లో పేలుళ్లకు కుట్ర?

>> చేయాలని నిర్ణయించినట్లు ఉగ్రవాదులు విచారణలో వెల్లడించారు. దశలవారీగా ఆరుదశల్లో ఈ పేలుళ్ల చేయాలని,ముందుగా ఢిల్లీలో ఆరు ప్రాంతాల్లో ఈపేలుళ్లనిర్వహించేందుకు సిద్ధంచేసారు. ఇందుకోసం హుండై ఐ20, మారుతిసుజుకి బ్రెజ్జా, స్విఫ్ట్ డిజైర్, ఫోర్డ్ ఎకోస్పోర్ట్ వంటి వాహనాలు కూడా సిద్ధంచేసి వాటిని బాంబులు,పేలుడు సామగ్రి రవాణాకు లేదా వాటిని అమర్చి పేల్చేందుకు సిద్ధంచేసారు. వీటిలోభాగంగానే ముందు ఎర్రకోటవద్ద సోమవారం పేల్చాలని భావించారు. అయితే ఆరోజు మూసివేయడంతో మరుసటిరోజు పార్కింగ్‌ప్రాంతంలో వీటిని పేల్చారని సమాచారం. ఇందుకోసం పాతకార్లుకొన్ని, అనేకసార్లు విక్రయించిన డబ్బాకార్లనే వీరు ఎంచుకున్నారు. వీటివల్ల పోలీసులు వాటినిగుర్తించడం కూడా కష్టమన్నది వారిభావన. బ్రెజ్జా హెచ్ఆర్ 87 యు 9988 కారు ఫరీదాబాద్‌లోని అలఫలా విద్యాసంస్థ ఆవరణలోనే లభించింది. వీటిలో ఎకోస్పోర్ట్ వాహనం డిఎల్10 సికె 0458 రిజిస్ట్రేషన్‌తో ఉంది. హర్యానాలోనే ఈ కారుకూడా లభించింది. వీటిని పేలుడు సామగ్రి రవాణాకోసం వినియోగించారని అంచనా. ఇప్పటికే డిజైర్‌ను రికవరీచేసారు. అలాగే కారులో ఉన్న అస్సాల్ట్ రైఫిల్; పేలుడు సామగ్రినికూడా స్వాధీనంచేసుకున్నారు.ఈ పేలుడులో ఇప్పటివరకూ 13 మందికిపైగా చనిపోయిన సంగతి తెలిసిందే. ఐ20ని ఉపయోగించి కారును పేల్చేసారు. ఆత్మాహుతి బాంబు ఉమర్ మహ్మద్ ఘాతుకమేనని ఆతడి డిఎన్ఎ శాంపిల్స్ సరిపోయినట్లు పోలీసులు తెలిపారు. బదార్‌పూర్ సరిహద్దునుంచి ఐ20 ఢిల్లీలోకి ప్రవేశించి కొన్ని



కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలోని కరీమాబాద్ గ్రామంలో ఓ ప్రాంతాన్ని చుట్టుముట్టిన పోలీసులు

గంటలపాటు చక్కర్లు కొట్టింది. లాల్‌ఖిలా పార్కింగ్‌ప్రాంతంలో పేల్చాలని నిర్ణయించారు. అయితే ముందు దీపావళి రోజు అనుకున్నారు. కానీ శెలవు కావడంతో వాయిదావేసారు. మొత్తంగా మూడు వేల కిలోల పేలుడు సామగ్రితో వీరంతా కార్లను సిద్ధంచేసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. వీటన్నింటినీ అల్‌ఫలా ఆసుపత్రిలోను, జమ్ము కాశ్మీర్ అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ వైద్యకళాశాలలోను భద్రపరిచినట్లు నిందితులు అంగీకరించారు. ఈ ఉగ్రసెల్ మొత్తం పాకిస్తాన్‌కేంద్రంగా ఉన్న జైషే మహ్మద్ కనుసన్నల్లోనే నడుస్తోంది. మరో సంచలన విషయం ఏంటంటే ఈసారి ఉన్నత విద్యావంతులు ఉగ్రవాదులుగా మారారు. వీరంతా వృత్తినిపుణులు, వైద్యులుకావడం గమనార్హం. జమ్ముకాశ్మీర్‌లోని నౌగామ్‌లో జైష్ సంస్థను ప్రశంసిస్తూ పోస్టర్లు కూడా అతికించిన వాటితో వీరి ప్రమేయం ఉంది. యుపిలోని సహరాన్‌పూర్‌లో అరెస్టులు జరిగేంతవరకూ ఈ ఉగ్రకుట్రలు యధేచ్ఛగా కొనసాగించారు. ఈ ఉగ్రసెల్‌లోని సభ్యులందరికీ అల్‌ఫలా విద్యాసంస్థతో సంబంధాలున్నాయి. అయితే వీరిచర్యలతో సంస్థ వీరిని దూరం పెట్టింది. దర్యాప్తులో పూర్తిగా సహకరిస్తామని ప్రకటించింది.

**పుల్వామా మాస్టర్‌మైండ్‌తో నిత్యం టచ్‌లోనే...**

అరెస్టుచేసిన వారికి అందరికీ జైషే మహ్మద్ సంస్థతో లింకులున్నట్లు బయటపడింది. వీరిలో మహిళా డాక్టర్ షహీన్ సయీద్ పుల్వామా దాడిమాస్టర్‌మైండ్ ఊమర్ ఫరూక్ భార్య అఫిరాబీబీతో నిత్యం టచ్‌లో ఉందని, ప్రతినిత్యం ఆమెను ఫోన్‌లో సంప్రదించేదని దర్యాప్తులో తేలింది.జైషే చీఫ్ మసూద్ అజర్ మేనల్లుడు ఉమర్ ఫరూక్‌ను 2019 ఎన్‌కౌంటర్‌లోనే హతమార్చిన సంగతి తెలిసిందే. ఇపుడు ఉమర్ భార్య ఆఫిరాబీబీ జైషేలోని మహిళా విభాగానికి కమాండర్‌గా ఉంది. జమాత్ ఉల్ మోమినత్ అని పేరుకూడా ఉంది. ఢిల్లీపేలుడుకు ముందే ఆఫిరా బ్రిగేడ్ సలహా మండలి షురాలో చేరింది.అజర్ మరో సోదరి సాదియా అజర్‌కూడా ఈ మండలిలో ఉంది. వీరితోపాటే షాహీన్‌సయీద్ కూడా చేరడంతో వీరిమధ్య నిరంతర సంప్రదింపులు జరిగాయి. షహీన్‌తోపాటే ముజామ్మిల్, ఉమర్‌లు అల్‌ఫలా వర్సిటీలో పనిచేసారు. వీరిలో ఇద్దరు కస్టడీలో ఉంటే ఉమర్ కార్‌బ్లాస్ట్‌లోనే చనిపోయాడు.

# రూ.20.76 కోట్ల ధాన్యం గల్లంతు

>> గల్లంతైనట్లు అధికారులు నిర్ధారించారు. వారాహిలో నాలుగుకోట్ల 37లక్షల రూపాయల విలువగల 47160 బస్తాలు, చాముండిలో రూ. 9.30కోట్ల విలువైన బస్తాల ధాన్యం పక్కదారి పట్టించినట్లు అధికారులు గుర్తించి డిఫాల్ట్‌మిల్లులపై చర్యలు తీసుకోవాలని స్థానిక జిల్లా పౌరసరఫరాల అధికారికి ఆదేశాలు జారీచేశారు. సంగారెడ్డి జిల్లా ఆర్‌సిపురం విజిలెన్స్ యూనిట్ ఆందోల్ మండలం దకూర్ మెస్సర్ కన్యకా పరమేశ్వరీ ఆగ్రోఇండస్ట్రీలో ఆకస్మిక తనిఖీ చేసి 2024-25 రబీసీజన్‌కు చెందఇన రూ. 87,06,496 విలువకలిగిన 3752.80క్వింటాళ్ళ ధాన్యం పక్కదారి పట్టించారని గుర్తించారు. సదరు మిల్లు యజమానిపై చర్యలు చేపట్టాలని పౌరసరఫరాల అధికారులకు మెమో అందించారు. సైబరాబాద్ పరిధిలోని శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిమితిలోని పెదషాపూర్‌లో జాతీయరహదారి44పై రూట్ చెకింగ్ చేస్తున్న విజిలెన్స్‌అధికారులు టిఎస్07యుఇ 8883వాహనంలో పిడిఎస్ బియ్యం అక్రమరవాణా చేయడాన్ని గుర్తించి ఆ వాహనంను స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన డిసిఎంఎస్ వాహనం డ్రైవర్ ప్రేమ్‌కుమార్ మహబూబ్‌నగర్‌కు బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు ప్రశ్నించగా ఒప్పుకొన్నారు. శంషాబాద్ పోలీసులకు వాహనం అప్పగించి సదరు డ్రైవర్‌పై క్రిమినల్ కేసు, ఇసి చట్టం కింద 6ఎకేసు పెట్టాలని సూచించారు. హైదరాబాద్ సిటి -2 యూనిట్ అధికారులు రవాణా,మైనింగ్ అధికారులతో కలిసి భూత్‌పూర్, జడ్చర్ల, కొడంగల్ రహదదారిపై తనిఖీలు చేశారు. అధకలోడ్ తో ఉన్న మైనింగ్ అక్రమరవాణా చేసే లారీ పై ఒవర్ లోడ్ ఉందనే కారణంగా రవాణాచట్టం కింద రూ. 2.82లక్షలు రాయల్టీ ఉల్లంఘన కింద మైనింగ్ అధికారులు రూ.40వేలు జరిమాన వేశారు. సరైన పత్రాలు లేని వాటర్ ట్యాంకర్‌తోపాటు 17 వాహనాలు స్వాధీనం చేసుకొని వాటిపై కూడా రూ.5.20లక్షల విలువైన జరిమానా విధించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి తాడూరు పోలీస్‌స్టేషన్లలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఫైర్ స్టేషన్‌లలో ఈ వాహనాలను సురక్షిత కస్టడిలో ఉంచినట్లు విజిలెన్స్‌అధికారులు తెలిపారు. రాష్ట్రంలో చీకటిబజారు,అక్రమాలు కట్టడి చేయడానికి 14432 టోల్‌ఫ్రీనెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని విజిలెన్స్‌ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వశాఖ అధికారులు ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసినా వాటి తాలుకు అక్రమాలు కట్టడి చేయడానికి విజిలెన్స్ శాఖ ఎప్పుడు ముందు ఉంటుందని ఆయన తెలిపారు. సహజవనరుల ,ప్రభుత్వ నిధుల దుర్వినియోగం ప్రజా ఆదాయం లీకేజి ప్రజాచైతన్యంతోనే కట్టడి చేయడం సాధ్యమని పేర్కొన్నారు.



భారత్ బహుమతిగా ఇచ్చిన 8 చిరుతలను బోత్సవానాలోని ఘాంజీ ప్రాంతంలో వదిలిపెట్టిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, బోత్సవానా అధ్యక్షుడు దూమా గిడియాన్ బోకో తదితరులు

# ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానం హైదరాబాద్

>> ప్రాజెక్టుల పురోగతిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వివరించారు. చైనా +1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుందని పేర్కొన్నారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే తక్కువ ఖర్చు, సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల (గ్లోబల్ సౌత్) విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను ఆహ్వానించారు.భారతదేశంలో రోడ్లకు ఎక్కువగా నేతల పేర్లు ఉంటాయని... హైదరాబాదులో ఆ ట్రెండ్‌ను మార్చాలని తాము అనుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీ పేర్లను పెడతామని సీఎం అన్నారు. సదస్సు ప్రారంభంలో తెలంగాణ రైజింగ్-2047 విజన్ ను ప్రదర్శించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి లక్ష్యం ఢిల్లీలో జరిగిన యుఎస్-ఇండియా స్ట్రాటజిక్ పాట్నర్‌షిప్ ఫోరం (యుఎస్ఐఎస్‌పిఎఫ్) వార్షిక సమావేశంలో విశేష ఆదరణ పొందింది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడుల అవకాశాలు వివరించిన సీఎం ప్రసంగం, అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది. రేవంత్ రెడ్డి విజన్ బోల్డ్, క్లియర్, అచీవబుల్: జాన్ ఛాంబర్స్, సిస్కో మాజీ సీఈఓ, టెక్ దిగ్గజం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ విజన్ పారదర్శకంగా, సాహసోపేతంగా (బోల్డ్), సాధించగలిగేలా ఉంది. ఆయన చెప్పిన ప్రాజెక్టులు, వాటి సామాజిక ప్రభావం ఎంతో ప్రేరణాత్మకంగా ఉంది. గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవుతాం..: డా. ముఖేష్ ఆఘి, యుఎస్ఐఎస్‌పిఎఫ్ అధ్యక్షుడుముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు మా సభ్యులలో అత్యధికులం డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవుతాం. తెలంగాణ విజన్‌ను దగ్గరగా తెలుసుకోవాలని మేమంతా ఆసక్తిగా ఉన్నాం.

# లాభాలకోసం ఆర్టీసీ అన్వేషణ

>> చేయాలన్నారు. ఆర్‌టిసి ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. .కారుణ్య నియామకాల కింద నియమించబడిన కండక్టర్‌ల ప్రొవిజన్ పిరియడ్‌ను 3 సంవత్సరాల నుండి 2 సంవత్సరాలకు తగ్గించేలా పరిశీలించాలన్నారు. అరాంఘర్‌లో అధునాతన బస్సు టెర్మినల్ నిర్మాణం కోసం ఆర్‌టిసి, పోలీస్ శాఖల భూ బదలాయింపుపై చర్చించాలన్నారు. అలాగే హైదరాబాద్ నగరంలో కొత్త బస్సు డిపోలకు స్థల పరిశీలన చేసి జిల్లా కలెక్టర్‌తో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా బస్సు ప్రమాదాలు తగ్గించడానికి డ్రైవర్ మానిటరింగ్ సిస్టం అమలు చేయనున్నట్టు మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఫోర్త్ సిటీలో బస్ టెర్మినల్ ఏర్పాటు చేయడం అధ్యయనం చేయాలన్న మంత్రి.. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్‌టిసి కండక్టర్‌లు, డ్రైవర్లు ఇతర ఉద్యోగులతో జూమ్ సమావేశం నిర్వహిస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహా లక్ష్మీ ్మ పథకం వచ్చిన తర్వాత సంక్షోభంలో ఉన్న ఆర్టీసీ క్రమక్రమంగా లాభాల బాటలోకి వస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి నెల వారిగా వస్తున్న మహాలక్ష్మి ్మ టికెట్ ఆదాయమే కాకుండా అదనపు ఆదాయంపై దృష్టి సాధించాలన్నారు.

ఆర్టీసీలో ఇప్పటి వరకు మహిళలాలు 237 కోట్ల జీరో టికెట్ ఉపయోగించుకున్నారని ఇందుకోసం రూ. 7980 కోట్లు ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించిందన్నారు. టికెట్ ఆదాయంతో పాటు టికెట్ యేతర ఆదాయంపై దృష్టి సారించాలని మంత్రి ఆర్టీసీ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్టీసీ బస్సులు, బస్ స్టేషన్‌లలో, టిమ్ మిషన్‌ల ద్వారా వచ్చే టికెట్‌పై అడ్వర్టైజ్మెంట్స్ ద్వారా ఆదాయాన్ని మరింత పెంచాలని సూచించారు.

# 17న సుప్రీం విచారణ

>> ఎమ్మెల్యే ముకుల్‌రాయ్‌పై కలకత్తా హైకోర్టు అనర్హత వేటు వేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ముకుల్‌రాయ్ బీజెపి తరఫున కృష్ణానగర్ నార్త్ నియోజకవర్గం ఉనంచి పోటీ చేసి గెలుపొందారు. అయితే రాష్ట్రంలో టిఎంసీ అధికారంలోకి రావడంతో ఆయన 2021లో బిజెపికి గుడ్‌బై చెప్పి అధికార పార్టీలో చేరారు. పార్టీ మారిన ముకుల్ రాయ్ ఎమ్మెల్యే పదవి రద్దు చేయాలని బిజెపి 2022లో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేయగా,.. స్పీకర్ ఈ పిటీషన్‌ను తోసిపుచ్చారు. దీంతో బిజెపి హైకోర్టును ఆశ్రయించడంతో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద గురువారం జస్టిస్ దేబాంగ్సు బసక్,జస్టిస్ ఎండీ షబ్బర్ రషీదిలతో కూడిన డివిజన్ బెంచ్ ముకుల్‌రాయ్‌పై అనర్హత వేటు వేసింది. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం ఆయనపై అనర్హత వేటు వేస్తున్నట్లు ధర్మాసనం తీర్పు ఇచ్చింది. పశ్చిమ బెంగాల్‌లో అనర్హత వేటు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ తరఫున గెలుపొంది కాంగ్రెస్‌లో చేరినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలపై బిఆర్ఎస్ పోరాటం చేస్తుంది. ఈ వ్యవహారంపై ప్రస్తుతం అసెంబ్లీ స్పీకర్ విచారణ చేపట్టారు. పార్టీ ఫిరాయింపులపై మూడు నెలల గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని గతంలో తెలంగాణ స్పీకర్‌ను సుప్రీంకోర్టు సూచించింది. అయితే గడువు ముగిసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఇది కోర్టు ఆదేశాలను ధిక్కరించడమేనని మూడు రోజుల క్రితం బిఆర్ఎస్ మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బిఆర్ఎస్ తాజా పిటీషన్‌పై వచ్చే సోమవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది. కాగా, పార్టీ మారినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అరికెపూడి గాంధీపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ శుక్రవారం,శనివారం విచారణ జరుపనున్నారు. వీరిద్దరి విచారణతో మొత్తం 8 మంది ఎమ్మెల్యేలపై విచారణ పూర్తయినట్లు అవుతుంది.కాగా పార్టీ మారినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న దానం నాగేందర్, కడియ శ్రీహరి ఇంతవరకు స్పీకర్‌కు అఫిడవిట్లు సమర్పించలేదు.

# టెట్ నోటిఫికేషన్ జారీ

>> తీర్పు ప్రకారం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ పాస్ కావాలని తీర్పును వెలువరించింది. తీర్పు ఇచ్చిన తర్వాత రెండేళ్లలో అంటే 2027 నాటికి టెట్ ఉత్తీర్ణులు కావాలని పేర్కొంది. టెట్ ఉత్తీర్ణత కాని పక్షంలో ఉద్యోగం వదులుకోవాలని తెలిపింది. అయితే ఐదేళ్లలో పదవీ విరమణ చేయబోయేవారికి మాత్రమే టెట్ అవసరం లేదని చెబుతూనే.. వారు పదోన్నతి పొందాలంటే మాత్రం టెట్ పాసవ్వాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో టెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం 2015 డిసెంబరు 23న జారీచేసిన జీఓ 36లో సవరణలు చేస్తూ కొత్త జీవోను జారీ చేసింది. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు కూడా టెట్‌కి హాజరు కానున్న నేపథ్యంలో రాష్ట్రంలో జనవరిలో జరగబోయే టెట్ పరీక్షలకు సుమారు 3 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సర్వీస్ టీచర్లు సుమారు 30వేల వరకు ఉండే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

**జీవో నంబర్ 36కి సవరణలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ..**

2015 డిసెంబరు 23న జారీచేసిన జీఓ ఎంఎస్ నంబర్ 36లో సవరణలు చేస్తూ ప్రభుత్వ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన జీవో ఎంఎస్ నంబర్ 28ని విద్యా శాఖ కార్యదర్శి ఏ శ్రీదేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. జీవో 36 ప్రకారం టెట్ ఉత్తీర్ణత నుండి 23.08.2010కి ముందు ప్రభుత్వ/స్థానిక సంస్థల పాఠశాలల్లో నియమించబడిన ఉపాధ్యాయులకు ఆ సమయంలో అమలులో ఉన్న నియామక నియమాల ప్రకారం టెట్ పరీక్షకు హాజరు కావడం నుండి మినహాయింపు ఉంది. అయితే, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల నియామకాలు కాంపిటెంట్ అధికారం ద్వారా ఆమోదించబడకపోతే, వారు టెట్ ఉత్తీర్ణత నుండి మినహాయింపు పొందరు. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం నిర్వహించే టెట్ పరీక్షకు హాజరు కావాలి. జీవో ఎంఎస్ నంబర్ 28 ప్రకారం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణులయ్యే అవకాశం కల్పించారు. ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ప్రైవేట్ (ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్) నిర్వహణ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే టెట్, కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సీటెట్ పరీక్షకు హాజరు కావడానికి అనుమతి ఉంది. అలాగే డిఇడి, బిఇడి అర్హతలు కలిగిన సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్‌జిటి) ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్లు పేపం-1కి హాజరు కావడానికి అనుమతి ఉంది. స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండితులు, హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు(జీహెచ్‌ఎం) పేపర్-2కి హాజరు కావడానికి అనుమతి ఇస్తూ ఉత్తర్వులో పేర్కొన్నారు.

## మంత్రి కొండా సురేఖపై కేసును ఉపసంహరించుకున్న అక్కినేని నాగార్జున

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 3:** రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై పెట్టిన కేసు విషయంలో టాలీవుడ్ హీరో అక్కినేని నాగార్జున కీలక నిర్ణయం తీసుకున్నారు. మంత్రిపై పెట్టిన పరువు నష్టం దావా కేసును గురువారం నాగార్జున ఉపసంహరించుకున్నారు. గతంలో నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యల పట్ల చింతిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేస్తూ మంత్రి కొండా సురేఖ బుధవారం ట్వీట్ చేశారు. నాగార్జున కుటుంబాన్ని కించపరిచే ఉద్దేశం తనకు లేదని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. నాగార్జున బాధపడి ఉంటే.. అందుకు చింతిస్తున్నాను. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నాను.. నాగార్జున కుటుంబానికి క్షమాపణ చెప్పారు. దీంతో నాగార్జున.. మంత్రి సురేఖపై కేసును విత్‌డ్రా చేసుకున్నారు.

## పేదల వైద్య ఖర్చులకు సిఎం భరోసా

### ప్రభుత్వ సలహాదారు మహ్మద్‌అలీ షబ్బీర్

### సిఎంఆర్ఎఫ్ చెక్కులు రూ.18 లక్షలు పంపిణీ

**హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం వారి వైద్యఖర్చులకు సిఎం భరోసా ఇస్తున్నారని వైద్యంతో ఎవరు ఆర్థిక ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీషబ్బీర్ అన్నారు. నిజామాబాద్ పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ గెస్ట్‌హౌస్‌లో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి 26 చెక్కులను దాదాపు 18 లక్షల రూపాయలు లబ్దిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గంలోని పలు కాలనీల లోని బాధితులకు సీఎం సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేయించడం జరిగింది అన్నారుఅనారోగ్యంతో అప్పుల పాలైన వారికి సిఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో కొంత ఉపశమనం కలిగిస్తాయి అన్నారు. పేదలకు సహాయంగా అండగా. నియోజకవర్గ ప్రజల మంచి మాత్రమే కోరుకుంటామన్నారుఇందిరమ్మ ఇండ్లు మరియు కొత్త రేషన్ కార్డులు అర్హులకు నిరంతరంగా అందిస్తామనిఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువ గానే అమలు చేస్తున్నా అన్నారు.



బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు

## ఢిల్లీ పేలుడు ఘటన దేశ వ్యతిరేక శక్తుల కుతంత్రమే

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 13:** ఢిల్లీలో జరిగిన ఉగ్రవాద పేలుడు ఘటన దేశ వ్యతిరేక శక్తుల కుతంత్రమేనని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. ఈ దాడి దేశంలో శాంతిని భగ్నం చేసేందుకు, దేశ ప్రగతిని అడ్డుకునేందుకు ఉద్దేశపూర్వకంగా పాల్పడిన చర్యగా అభివర్ణించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన పేలుడులో 13 మంది ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో దోషులను కేంద్ర ప్రభుత్వం వదిలిపెట్టదని అన్నారు. దేశం మొత్తం ఇలాంటి ఉగ్రవాద చర్యలను అరికట్టేందుకు కేంద్రానికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

## గోడ కూలి ఇద్దరు కూలీల దుర్మరణం

### మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో విషాద ఘటన

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 13, ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పాత తోట వద్ద ప్రమాదవశాత్తు ఇద్దరు కూలీలు మృతి చెందిన ఘటన చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పాతతోట ప్రాంతంలో పురాతన భవనం ఒకటి తొలగించే ప్రయత్నంలో జరిగిన ప్రమాదం వలన ఒక్కసారిగా భవనం నేలమట్టం అయింది. ఈక్రమంలో భవనం క్రింద పనిచేసే ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు శిథిలాల కింద చిక్కుకొని అక్కడికక్కడే మరణించారు. ప్రమాదానికి ప్రధానంగా భవన యజమాని లక్ష్మణ్ ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకుండానే పాత భవనాన్ని తొలగించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తున్నది. ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు శిథిలాల కింద ఉండిపోయారు. పాత భవనం ఓనర్ లక్ష్మణ్ భద్రతా చర్యలు తీసుకొని ఉంటే ప్రాణనష్టం జరిగేది కాదని స్థానికుల అభిప్రాయపడుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే మున్సిపల్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను రక్షించేందుకు ప్రయత్నాలు చేసినా ఎలాంటి ఫలితం దక్కలేదు. దురదృష్టవశాత్తు ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు అక్కడికక్కడే మరణించారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ఓనర్ పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. పురాతన భవనం కూలి ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతిచెందిన విషయం తెలుసుకున్న తెలుసుకున్న జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సంఘటన స్థలం ను పరిశీలించి సహాయక చర్యలపై అధికాగులకు ఆదేశాలు జారీ చేసి మున్సిపల్ కమిషనర్‌ను పర్యవేక్షించాలని ఆదేశించారు. పోలీస్, నగర పాలక సంస్థ, అగ్నిమాపక శాఖలు సంఘటన స్థలంలో సహాయక చర్యలు చేపట్టి శిథిలాల నుండి ఇద్దరి మృత దేహాలు వెలికి తీశారు.అదనపు ఎస్.పి. రత్నం, డి.ఎస్.పి.వెంకటేశ్వర్లు, జిల్లా అగ్నిమాపక అధికారి కిషోర్, నగర పాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఆత్మాహుతి దాడితో శ్రీలంక క్రికెటర్లు వెనుకంజ

### తిరిగి వెళ్లేందుకు ఎనిమిది మంది క్రికెటర్లు రిక్వెస్ట్

### కాదు ఆడాల్సిందేనని కఠిన ఆంక్షలు విధించిన శ్రీలంక బోర్డు

**రావల్పిండి, నవంబరు 13:** పాకిస్తాన్‌లో పర్యటిస్తున్న శ్రీలంక క్రికెట్ జట్టు మరోసారి తీవ్ర భద్రతా సమస్యలను ఎదుర్కొంది. ఇస్లామాబాద్‌లో ముందురోజు జరిగిన ఆత్మాహుతి దాడితో జట్టు బస చేస్తున్న రావల్పిండికి సమీపంలో ఉద్రిక్త నెలకొంది. ఈ పరిణామంతో భయాందోళనకు గురైన పలువురు శ్రీలంక ఆటగాళ్లు పర్యటనను అర్ధాంతరంగా ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చేయాలని భావించారు. అయితే, ఇరు దేశాల క్రికెట్ బోర్డులు వెంటనే రంగంలోకి దిగి, ఉన్నతస్థాయి హామీలు ఇవ్వడంతో సిరీస్‌ను కొనసాగించాలని నిర్ణయించాయి. ముందుజాగ్రత్త చర్యగా వన్డే మ్యాచ్‌ల షెడ్యూల్‌లో మార్పులు చేశారు. భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ), శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) వెంటనే స్పందించాయి. రావల్పిండిలో నవంబర్ 13న జరగాల్సిన రెండో వన్డేను నవంబర్ 14కు, మూడో వన్డేను నవంబర్ 16కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించాయి. పాక్ అంతర్గత వ్యవహారాల మంత్రి కూడా ఉన్న పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ శ్రీలంక హైకమిషనర్‌తో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. శ్రీలంక ఆటగాళ్లకు అత్యున్నత స్థాయి భద్రత కల్పిస్తున్నామని, ప్రభుత్వ అతిథులుగా పరిగణిస్తామని పాక్ ఆర్మీ, రేంజర్లు వారి రక్షణ బాధ్యతలు చూసుకుంటున్నారని ఆయన భరోసా ఇచ్చారు. "పర్యటన కొనసాగించేందుకు అంగీకరించిన శ్రీలంక జట్టుకు ధన్యవాదాలు" అని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలిపారు. మరోవైపు, కనీసం 8 మంది ఆటగాళ్లు భద్రతా కారణాలతో వెనక్కి వచ్చేందుకు ఆసక్తి చూపినట్లు శ్రీలంక క్రికెట్ బోర్డు అంగీకరించింది. పర్యటనను కొనసాగించాలంటూ జట్టుకు కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. పీసీబీ, సంబంధిత అధికారులతో చర్చించి ఆటగాళ్ల భద్రతకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. బోర్డు ఆదేశాలను ధిక్కరించి ఎవరైనా స్వదేశానికి తిరిగి వస్తే, వారి స్థానంలో వెంటనే ప్రత్యామ్నాయ ఆటగాళ్లను పంపిస్తాం. వారిపై క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకుంటామని ఎస్ఎల్‌సీ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. తాజా ఘటన 2009 నాటి భయానక జ్ఞాపకాలను మళ్లీ గుర్తుచేస్తోంది. అప్పట్లో లాహోర్‌లో శ్రీలంక జట్టు బస్సుపై ఉగ్రవాదులు కాల్పులు జరపగా, పలువురు ఆటగాళ్లు గాయపడ్డారు. ఆ దాడి తర్వాత దాదాపు పదేళ్లపాటు పాకిస్తాన్‌లో అంతర్జాతీయ క్రికెట్ నిలిచి పోయింది. మళ్లీ 2019లో శ్రీలంక జట్టే పాక్‌లో పర్యటించి అంతర్జాతీయ క్రికెట్ పునరుద్ధరణకు సాయపడింది. ఇప్పుడు అదే జట్టుకు మరోసారి భద్రతా సమస్యలు తలెత్తడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వివాదాల నడుమ, సిరీస్‌లో పాకిస్తాన్ 10 ఆధిక్యంలో ఉంది. తొలి



వన్డేలో సల్మాన్ అఘా అజేయ శతకంతో మెరవగా, హారిస్ రవూఫ్ 4 వికెట్లతో రాణించి పాక్‌కు 6 పరుగుల తేడాతో విజయాన్ని అందించాడు. ప్రస్తుతం ఆటగాళ్లపై ఉన్న మానసిక ఒత్తిడి వారి ప్రదర్శనపై ఎలా ప్రభావం చూపుతుందో చూడాలి. ఈ సిరీస్ ముగిశాక జింబాబ్వేతో కూడిన ట్రైసిరీస్ జరగాల్సి ఉండగా, దాని భవిష్యత్తు కూడా ప్రస్తుత పర్యటనపైనే ఆధారపడి ఉంది.

# జూబ్లీహిల్స్ గెలుపుపై బిఆర్‌ఎస్ ధీమా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 13:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోటీ తీవ్రంగా ఉన్నప్పటికీ తమకే గెలుపు అవకాశాలు ఉన్నాయని బిఆర్ఎస్ పార్టీ ధీమాగా ఉన్నది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరుగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పార్టీ నిర్ణయించింది. ఓట్ల లెక్కింపు పర్యవేక్షణ కోసం పార్టీ సీనియర్ నాయకులను, ప్రముఖులను ఎలక్షన్ ఏజెంట్లుగా, కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించింది. ఈ ఏజెంట్లందరితో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, పార్టీ సీనియర్ నాయకులు హరీష్ రావు తదితర ముఖ్య నేతలు గురువారం తెలంగాణ భవన్‌లో కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కౌంటింగ్ ఏజెంట్లకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ సందర్భంగా అనుసరించాల్సిన అంశాలపై మార్గదర్శనం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ పోలింగ్ సందర్భంగా అన్ని రకాల అక్రమాలకు పాల్పడిందని, ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేసిందని బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో కౌంటింగ్ సందర్భంగా కూడా కాంగ్రెస్ పార్టీ అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని, వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్క కౌంటింగ్ ఏజెంట్, ఎలక్షన్ ఏజెంట్ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు.

## డిసెంబరు 1 నుంచి ఢిల్లీలో 'ఇండియన్ పికిల్‌బాల్ లీగ్'

**హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న పికిల్‌బాల్ గేమ్ లీగ్ రూపంలో ముందుకు రాబోతోంది. దేశంలో తొలి అధికారిక పికిల్‌బాల్ లీగ్ (ఐపీబీఎల్) పోటీలు డిసెంబర్ 1 నుంచి 7 తేదీల్లో న్యూ ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరగనున్నాయి. ఈ లీగ్‌కు ఇండియన్ పికిల్‌బాల్ అసోసియేషన్ (ఐపీఏ) అనుమతితో పాటు క్రీడా, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ గుర్తింపు లభించింది. తొలి ఎడిషన్‌లో దేశ, విదేశాలకు చెందిన మేటి, వర్ధమాన క్రీడాకారులతో కూడిన జట్లు తలపడతాయి. వారం రోజుల పాటు రౌండ్ రాబిన్, నాకౌట్ ఫార్మాట్‌లో మ్యాచ్‌లు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వనున్నాయి. పికిల్‌బాల్ క్రీడ ప్రపంచ వ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతూ మంచి గుర్తింపు తెచ్చుకుంటోంది. సులభంగా ఆడగలగడం, వేగవంతమైన క్రీడా విధానం దీని ప్రత్యేకత. ప్రపంచవ్యాప్తంగా ఐదు మిలియన్ల ఆటగాళ్లు, 1.3 బిలియన్ డాలర్ల మార్కెట్ ఈ క్రీడకు ఉంది. భారత్‌లోని ముఖ్య నగరాల్లో వేగంగా విస్తరిస్తోంది. 2028 నాటికి ఆటగాళ్ల సంఖ్య పది లక్షలకు చేరుతుందని అంచనా. ఆడేవారిలో 80 శాతం మంది 18-50 ఏళ్ల మధ్య వయసువారే కావడం విశేషం. లీగ్ ప్రారంభంపై ఇండియన్ పికిల్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యవీర్ సింగ్ భుల్లార్ హర్షం వ్యక్తం చేశారు. ఐపీబీఎల్ రాక భారత్‌లో పికిల్‌బాల్ క్రీడకు ఒక చారిత్రక ఘట్టం అని క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ సమాఖ్య ఐపీఏ ఈ లీగ్‌కు అనుమతి ఇచ్చిదన్నారు. ఐపీబీఎల్ ద్వారా అందరిలో ఫిట్‌నెస్ పెంచడం, ఎక్కువమంది ఆడేలా ప్రోత్స హించడం మా లక్ష్యం అని ఆయన తెలిపారు.

# వరంగల్ ఎంజిఎం ఆస్పత్రిలో రూ. 30 కోట్ల కుంభకోణం

### ప్రజల సొమ్మును కాజేసిన ఉద్యోగ సిబ్బంది కాంట్రాక్టర్లు

### ఆరోగ్యశ్రీ నిధుల దుర్వినియోగం

### విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో వెలుగుచూసిన నిజాలు

**వరంగల్ సిటీ, నవంబరు 13 ప్రభాతవార్త:** గత కొన్ని నెలలుగా ఎంజిఎం ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని సామాజిక మాధ్యమాలు, వార్తా పత్రికలు చెప్తున్న కథనాలు నిజమయ్యాయి. అంతా కల్పితమే అంటున్న అధికారులు సిబ్బంది కాంట్రాక్టర్ల నోర్లు మూసుకు పోయాయి. వరుస కథనాలతో కదిలిన ప్రభుత్వం యంత్రంగం విజిలెన్స్ అధికారులు గురువారం ఎంజిఎం ఆస్పత్రిలో సోదాలు నిర్వహించారు. ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ ఛాంబర్ లో రికార్డులను పరిశీలలించిన అధికారులకు నమ్మలేని నిజాలు వెలుగుచూశాయి. 2021 2024 లలో సుమారు 30 కోట్ల కుంభకోణం జరిగినట్టు సమాచారం. విజిలెన్స్ డీఎస్పీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం 2021 నుంచి 2024 వరకు ఆరోగ్యశ్రీ ద్వారాచేసిన ఆపరేషన్లు, ఆసుపత్రికి వచ్చిన నిధుల వివరాలను రికార్డు ఆధారంగా పరిశీలించారు. ఈ నాలుగేళ్లలో ఆసుపత్రి అభివృద్ధి కోసం, ఆపరేషన్ చేసిన వైద్యు లకు ఫీజు చెల్లించడం కోసం ఉపయోగించాల్సి ఉండగా, అవసరమైన పనులకు కాకుండా అనవ సరమైన పనులకు వెచ్చించారనే ఫిర్యాదులు ప్రభుత్వానికి అందడంతో ఈ తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించిసంబంధిత పత్రాలను అధికారులు తీసుకువెళ్లారు. ఎంజీఎం సూపరిం టెండెంట్‌డాక్టర్ హరిచంద్రారెడ్డి ఈ విషయంపై స్పందిస్తూ, ఆసు పత్రిలో ఆరోగ్యశ్రీకి సంబంధించిన నిధుల వ్యవ హారంపై విజిలెన్స్ టీమ్ వచ్చిపరిశీలించి వెళ్లా రని తెలిపారు. అయితే ఇది రొటీన్‌గా జరిగే తనిఖీలే అని ఆయన పేర్కొన్నారు.



# ఎర్రకోట బ్లాస్ట్‌కు తుర్కియేతో లింకులు

### 'ఉకాసా' పేరుతో అంకారా హ్యాండ్లర్‌తో సంప్రదింపులు

**న్యూఢిల్లీ, నవంబరు 13:** ఎర్రకోట పేలుళ్ల కేసుకు సంబంధించి దర్యాప్తులో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో అరెస్టయిన నిందితు లకు, తుర్కియే (టర్కీ) రాజధాని అంకారా నుంచి పనిచేస్తున్న ఓ విదేశీ హ్యాండ్లర్‌కు మధ్య సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం "ఉకాసా" అనే కోడ్‌నేమ్‌తో ఉన్న ఈ హ్యాండ్లర్ ప్రధాన నిందితుడు డాక్టర్ ఉమర్ ఉన్ నబీ, అతని అనుచరులతో నేరుగా సంప్రదింపులు జరిపినట్లు తేలింది. ఇందుకోసం అత్యంత గోప్యత ఉండే సెషన్ అనే ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌ను వీరు ఉపయోగించినట్లు అధికారులు తెలిపారు. ఉకాసా అంటే అరబిక్‌లో సాలీడు అని అర్థం. ఇది హ్యాండ్లర్ అసలు పేరు కాదని, తన గుర్తింపును దాచిపెట్టడానికి పెట్టుకున్న కోడ్ పేరు అని ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. ఇతను అంకారా నుంచే ఈ గ్రూప్ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, రాడికలైజేషన్ ప్రయత్నాలను సమన్వయం చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌తో సంబంధం ఉన్న పలువురు నిందితులు 2022 మార్చిలో భారత్ నుంచి అంకారాకు వెళ్లినట్లు దర్యాప్తులో తేలింది. ఈ పర్యటనలోనే వారు తమ హ్యాండ్లర్‌ను కలిసి, ఉగ్రవాద నెట్‌వర్క్‌లోకి చేరి ఉంటారని అనుమానిస్తున్నారు. "నిఘా ఏజెన్సీల కంట పడకుండా ఉండేందుకే నిందితులు, వారి హ్యాండ్లర్ మధ్య సంప్రదింపులు పూర్తిగా సెషన్ యాప్ ద్వారానే జరిగాయి. ఈ గ్రూప్ కార్యకలాపాలు విదేశీ మార్గదర్శకత్వంలోనే సాగాయని స్పష్టమవుతోందని ఒక సీనియర్ అధికారి వివరించారు. ఈ నెట్‌వర్క్ కార్యకలాపాల పూర్తి స్వరూపాన్ని, పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే ఉగ్రవాద సంస్థలతో వీరికి ఉన్న సంబంధాలను నిగ్గు తేల్చేందుకు ఏజెన్సీలు ఇప్పుడు చాట్ హిస్టరీలు, కాల్ లాగ్‌లు, స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి.

## శ్రావణి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటాం

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** అక్టోబరు 18న కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలంలో గెర్రే గ్రామంలో హత్యకు గురైన శ్రావణి తల్లిదండ్రులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎస్పి కాంతిలాల్ సుభాష్ పాటిల్, జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, కాగజ్ నగర్ డిఎస్పిలతో కలిసి శ్రావణి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హత్యకు గురైన శ్రావణి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని, శ్రావణి తండ్రి చెన్నయ్య పేరిట ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి మండల సమాఖ్య నుండి 1 లక్ష రూపాయల రుణ చెక్కును అందిస్తున్నామని,త్వరగా ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాలని తెలిపారు. అట్రాసిటీ కేసు క్రింద పరిహారాన్ని అందిస్తున్నామని, మొదటి విడతగారూ.4,12,500 మంజూరి ఉత్తర్వులను అందించడం జరిగిందని తెలిపారు. శ్రావణి తండ్రి ఖాతాలో డబ్బులను జమ చేయడం జరుగుతుందని, శ్రావణి కుటుంబానికి 3 నెలలపాటు నిత్యవసర సరుకులు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వపరంగా అందవలసిన వాటిని అందజేస్తున్నామని, శ్రావణి తల్లిదండ్రులకు ఉపాధి కొరకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏదైనా దుకాణం పెట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని, శ్రావణి తమ్ముడిని గురుకుల పాఠశాలలో చేర్పించడానికి చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. ఎస్పి మాట్లాడుతూ శ్రావణిని హత్య చేసిన వారికి కఠిన శిక్ష విధించే విధంగా చర్యలు తీసుకుంటు న్నామని, రక్షణ పరంగా శ్రావణి కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పిడి. ప్రకాష్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, దహేగాం మండల తహసిల్దార్ షరీఫ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నస్రుల్లా, ఎస్.ఐ. విక్రమ్, శ్రావణి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జిహెచ్‌ఎంసిపై దృష్టి పెట్టమని అధిష్ఠానం ఆదేశం

### ఇవిఎం వచ్చాక రిగ్గింగ్ అక్రమాలకు తెర: జెట్టి కుసుమకుమార్

**హైదరబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** జూబ్లీ హిల్స్‌లో కాంగ్రెస్ విజయం తథ్యం రిగ్గింగ్ అక్రమాలు ఇవిఎం వినియోగంలోకి వచ్చాక దాదాపు కట్టడైనాయని జిహెచ్‌ఎంసిపై దృష్టి పెట్టమని అధిష్ఠానం చెప్పింది ఎఐసిసి కార్యదర్శిజెట్టి కుసుమకుమార్ అన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో గురువారం మాట్లా డుతూ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేసే ఆసక్తి లేదనీ, జాతీయ రాజకీయాలపై ఆసక్తి ఉండటంతో పార్టీ ఆర్గనైజేషన్ పనులు చేయడమే నాకు ఇష్టం అని ఆయన చెప్పుకున్నారు. ఒడిశాతోపాటు తెలంగాణలోనూ పార్టీని సంస్థాగతంగా బలో పేతం చేయడానికి పనిచేస్తానని ఆయన వివరించారు. గ్రేటర్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగరేస్తామనీ ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఎఐసిసి కార్యదర్శిగా నియమించినందుకు సంతోషంగా ఉందనీ తెలిపారు. నాకు పదవి రావడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలనీ ఆయన అన్నారు. పని చేస్తే పదవులు దక్కుతాయని కాంగ్రెస్ పార్టీ మరో సారి నిరూపించిందని అన్నారు. ఒడిశా రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుస్తుందని తెలిపారు. మేనిఫెస్టోలో చెప్పని అంశాలను కూడా రేవంత్ ప్రభుత్వం అమలు చేస్తోందని కితాబు ఇచ్చారు.




## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

### గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

### ఖానాపూర్ సిఐ అజయ్ కుమార్

**ఖానాపూర్ టౌన్, నవంబరు 13, ప్రభాతవార్త:** ఖానాపూర్‌లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఖానాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ అజయ్ కుమార్ తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన బుట్టి మనోహర్ అనే ఆటో డ్రైవర్‌తోపాటు బోదాసురామ్‌లు ఇద్దరు కలిసి గంజాయిని సరాఫరా చేయగా మాటువేసి పట్టుకున్నా మన్నారు. గురువారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఎస్సై రాహుల్ గైక్వాడ్‌తో కలిసి సిఐ అజయ్ కుమార్ గంజాయి పట్టివేత గురించి వివరాలను వెల్లడించారు.

పైన తెలిపిన వీరిద్దరూ అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలానికి చెందిన కోట్నాక రాజు వద్ద నుండి మూడు కిలోల గంజాయిని కొనుక్కొని వచ్చి ఖానాపూర్‌లో కొంతమందికి విక్రయించడానికి ప్రయత్నించగా పక్క సమాచారం మేరకు పట్టకున్నామన్నారు పట్టుకున్న గంజాయి విలువ 3 లక్షల వరకు ఉంటుందని సిఐ తెలిపారు. గంజాయి మొక్కలు సాగుచేసిన విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత వారి జీవితాలను గంజాయి మాదకద్రవ్యాల మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి సరఫరా చేస్తున్న బుట్టి మనోహర్, బోదాసు రామ్లను పట్టుకున్న వారిలో ఎస్ఐ రాహుల్ గైక్వాడ్‌తో పాటు హెడ్ కానిస్టేబుళ్లు మొహమ్మద్ రఫీ, దేవిచంద్‌లు ఉన్నారన్నారు. గంజాయితో పట్టుబడ్డ నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తున్నామని వివరించారు.

## పది మంది నిందితుల అరెస్టు

### అల్‌ఫలా వర్సిటీకి నాక్ నోటీసులు

# గ్రెనేడ్ దాడికి ఉగ్ర కుట్ర.. భగ్నం చేసిన పంజాబ్ పోలీసులు

**చండీగఢ్, నవంబరు 13:** ఢిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో తనిఖీలను ముమ్మరం చేసిన పోలీసులు మరో ఉగ్రకుట్రను భగ్నం చేశారు. పంజాబ్‌లో గ్రెనేడ్ దాడులకు కుట్ర పన్నిన వారిని అరెస్టు చేశామని లూధియానా పోలీసులు తాజాగా వెల్లడించారు. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ ప్రోద్బలంతో గ్రెనేడ్ దాడికి సిద్ధమవుతున్న మాడ్యుల్‌ను పోలీసులు ఆదిలోనే అడ్డుకున్నారు. 10 మంది నిందితులను అరెస్టు చేశారు. మలేసియాలోని ఆపరేటర్ల ద్వారా నిందితులు కుట్ర పన్నినట్లు పోలీసులు తెలిపారు. పాక్‌లోని హ్యాండ్లర్లతో సంప్రదింపులు జరుపుతూ హ్యాండ్ గ్రెనేడ్‌ల సేకరణ, డెలివరీ చేస్తున్నారని చెప్పారు. అధిక జనాభా ఉన్న ప్రాంతంలో గ్రెనేడ్ దాడి చేసి రాష్ట్రంలో అశాంతిని రేకెత్తించేందుకు నిందితులు ప్లాన్ చేసినట్లు పంజాబ్ డిజిపి తెలిపారు. ఇక ఢిల్లీ పేలుళ్ల నేపథ్యంలో వార్తల్లో నిలిచిన అల్ ఫలాహ్ యూనివర్సిటీకి నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ ఎక్రిడిషన్ కౌన్సిల్ (న్యాక్)




షోకాజ్ నోటీసులను జారీ చేసింది. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో గుర్తింపునకు సంబంధించిన తప్పుడు సమాచారం ఉండటంతో నోటీసులు జారీ చేసింది. న్యాక్ గుర్తింపు లేకపోయినా ఉన్నట్లు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారని నోటీసుల్లో తెలిపింది. అల్ ఫలాహ్ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్లు కొందరు ఢిల్లీ పేలుళ్లకు కుట్ర పన్నినట్లు వెలుగులోకి రావడంతో దర్యాప్తు సంస్థలు యూనివర్సిటీపై కూడా దృష్టి సారించాయి. హర్యానాలోని ఫరీదాబాద్ జిల్లా ధౌజ్ గ్రామంలో ఈ యూనివర్సిటీ ఉంది. 1997లో ఇంజినీరింగ్ కాలేజీగా దీన్ని ప్రారంభించారు. 2014లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి యూనివర్సిటీ హోదా వచ్చింది. ఈ యూనివర్సిటీకి అనుబంధంగా 2019లో అల్ ఫలాహ్ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు.

వార్త

తక్కువ పదాల్లో ఎక్కువ విషయాలను చెప్పడం మేధావుల లక్షణమైతే, చెప్పేదేమీ లేకపోయినా ఎక్కువ పదాలు వినియోగించడం మూర్ఖుల లక్షణం.

-టిమిలే

# కాలుష్య కాసారంలో నగరాలు!

ఊదురుగొట్టం వాడు ఊదుతూ ఉంటే చల్లార్పుదు గొట్టం వాడు చల్లారుస్తున్నట్లు ఉందికాలుష్య నివారణ విషయంలో పాలకులు, కొందరు పారిశ్రామికవేత్తలు వ్యవహరిస్తున్న తీరు. కాలకూట విషంగా మారుతున్న నీటి, వాయుకాలుష్య విషవాయువుల నుంచి ప్రజలను కాపాడేందుకు పాలకులు చట్టాలపై చట్టాలు తెస్తున్నా, ఎందరిపైనో చర్యలు తీసుకుంటున్నా కాలుష్యకాటుకు బలయ్యేవారి సంఖ్య అంతకంతకు పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. ఈ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వాలు ఇంకా జాప్యం చేస్తే కాలుష్యకాటుకు దేశవ్యాప్తంగా కోట్లాది మంది అమాయకులు బలికాక తప్పదని పర్యావరణవేత్త శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. జీవించే హక్కు కల్పించాల్సిందిగా కోరుతూ ఎందరో ఈ కాలుష్యకాసారంలో చిక్కుకున్న అభాగ్యుల వేదన అరణ్యరోదనగా మిగిలిపోతున్నది. కాలుష్య నియంత్రణ మండలిని ఏర్పాటు చేశారు. అనేక చట్టాలు తెచ్చారు. చర్యలు తీసుకుంటున్నారు. అయినా అవేమీ కాలుష్యం నుండి ప్రజలను కాపాడలేకపోతున్నాయి. ముఖ్యంగా నగరాల్లో కాలుష్యం అంతకంతకు పెరిగి ఇప్పుడు నగరాల పరిసర ప్రాంతాలకు విస్తరిస్తున్నది. ప్రపంచ జనాభాలో ప్రస్తుతం సగం నగరాల్లోనే నివసిస్తున్నది. మరో మూడు దశాబ్దాల నాటికి నగర జనాభా అదనంగా మూడువందల కోట్లకుపైగా పెరుగుతుందని అధికారుల అంచనా. భూభాగంపై నగరాల వైశాల్యం రెండు మూడు శాతానికి మించకపోయినా కాలుష్యం మాత్రం అది ప్రపంచ జనాభా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే స్థాయిలో విస్తరిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా స్థూల దేశీయోత్పత్తిలో అరవైశాతం కేవలం ఆరువందల పట్టణాల్లో కేంద్రీకృతమై ఉందంటే నగరాల ప్రాధాన్యత ఎంతగా ఉందో వేరే చెప్పనవసరం లేదు. వ్యవసాయ రంగంలో ఏర్పడిన సంక్షోభం, గ్రామీణ ప్రాంతాన్ని అతలాకుతలం చేయడంతో నగరాలకు వలసలు పెరిగిపోతున్నాయి. అందుకే గ్రామీణ జనాభా తగ్గుతుండగా, పట్టణాల్లో జనాభా యేడాది యేడాదికి పెరిగిపోతున్నది. మరీ ముఖ్యంగా భారతదేశంలో అయితే పట్టణీకరణ అందుకోలేనంతగా విస్తరిస్తున్నది. 2001లో పట్టణ ప్రాంతాల్లో జనాభా ఇరవైఎనిమిదిన్నర కోట్లు ఉండగా ఇప్పుడు అది దాదాపు యాభై కోట్లకు చేరుకున్నదని చెప్తున్నారు. అయితే పెరిగిన జనాభాకు అనుగుణంగా కనీస వసతులు కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. 2005లో ప్రారంభించిన జవహర్‌లాల్‌నెహ్రూ జాతీయ పట్టణ నవీకరణ కార్యక్రమం (జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్) కింద పట్టణ ప్రాంతాలకు మరికొన్ని సౌకర్యాలు కల్పించి మెరుగైన జీవనం కల్పించేందుకు కోట్లాది రూపాయల వ్యయంతో ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పెరుగుతున్న అవసరాలు, జనాభాను అవి అందుకోలేకపోతున్నాయి.

భారత్‌లో ఆరు మెట్రోనగరాల్లో ఒక ప్రైవేట్ సంస్థ చేసిన సర్వేలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. విస్తరణ అంశాల్లో ఒక నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా చేపట్టడం వల్ల తీవ్రమైన ప్రభావం చూపుతున్నదనే విషయం వెలుగు చూసింది. ముఖ్యంగా నగరాల్లోవాయుకాలుష్యం వల్ల పౌరుల ఊపిరితిత్తులకు తూట్లుపొడుస్తుందని హెచ్చరించింది. చెన్నై, కోల్‌కతా, ముంబాయిలతోపాటు హైదరాబాద్‌లో కూడా వాయుకాలుష్యం తీవ్రంగా ఉంది. పారిశ్రామిక కాలుష్యంతో బెంగళూరు నగరం అతలాకుతలం అవుతుంది. ఇక వాహనాలు, నీటి కాలుష్యంతో తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సర్వేలు వెలువడుతున్నాయి. నిర్మాణరంగం వల్ల పీల్చే గాలిలో అధికశాతం దుమ్ముధూళి చేరుతుండడం ప్రజారోగ్యం రానురాను ప్రశ్నార్థకంగా మారుతుంది. నగర శివారుల్లోని పరిశ్రమల నుండిగాలిలో వదులుతున్న కాలుష్యాలకు అడ్డూఅదుపు లేకుండాపోతున్నది. మరొకపక్క విషపూరితమైన రసాయనిక కలుషిత జలాలను శుద్ధి చేయకుండా మూసీలో కలుపుతున్న పరిశ్రమలపై చర్యలు అంతంత మాత్రంగా ఉండడంతో ఆ నది పరివాహక ప్రాంతమంతా కాలుష్యకాసారంలో కొట్టుమిట్టాడుతున్నది. ప్రభుత్వ విధానాలు, కొందరు అధికారుల అవినీతి, అసమర్థత, అంతులేని నిర్లక్ష్యం కారణంగా ఈ సమస్య రోజుకు ఇంత పెరిగిపోతున్నది. మూసీతోపాటు ఎన్నోచెరువులు కాలుష్యకాసారాలుగా మారిపోయాయి. ఈ చెరువుల్లో చేపలు జీవించలేని పరిస్థితి ఏర్పడింది. కాలుష్యం విస్తరించే కొద్దీ ముందు జలచరాలు, ఆ తర్వాత పశుపక్ష్యాదులతోపాటు మానవ జీవనం కూడా ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి ఎంతో దూరంలో లేదని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే కాదుఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు తదితర నగరాల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగాలేదు. వాతావరణంలో ధూళికణాలు ఉండాల్సిన స్థాయి కన్నా ఐదు రెట్లు అధికంగా ఉండడంతో శ్వాసవమస్యల నుంచి కేన్సర్‌దాకా అనేక రోగాల భారిన పడుతున్నారని డాక్టర్లే చెబుతున్నారు. ముఖ్యంగా భావితరానికి ప్రతినిధులైన బాలల బతుకులు ఈ వాయు, నీటి కాలుష్యం చిదిమేస్తుండడం ఆందోళన కలిగించే అంశం. వాయుకాలుష్యం మనిషికే కాదు దేశ సుసంపన్నమైన చరిత్ర, సంస్కృతులకు ప్రతీకలుగా భాసిల్లుతున్నా వారసత్వ కట్టడాలకు ముప్పు ముంచుకొస్తున్నదని పర్యావరణ శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించిన పరిశీలనలో ముప్పైతొమ్మిది నగరాల్లో 138 వారసత్వ కట్టడాల పరిస్థితి వాయుకాలుష్యం వల్ల ఆందోళనకరంగా ఉన్నట్లు వెల్లడయింది. మొత్తం మీద కాలుష్యనివారణకు చట్టాలు చేసి చేతులు దులుపుకుంటే సరిపోదు. త్రికరణశుద్ధిగా అమలుకు కృషి చేయాలి. ఈ యుద్ధంలో ప్రజలను కూడా భాగస్వాములను చేయాలి.

చేజారిన ఓ నిమిషాన్ని భూమిపై ఉన్నసిరిసంపద లేవీ తిరిగి చేకూర్చజాలవు.



ఆది శంకరాచార్యులు

నిరాశా నిస్పృహలకు లోనుకాకుండా ప్రయత్నం కొనసాగిస్తే మనం ఏ పనైనా సాధించగలం.



ఎమర్సన్

# ప్రజావాక్కు



## బీసీలు మోసపోవద్దు

మన దేశ ప్రజాస్వామ్యంలో బీసీవర్గాల సంఖ్య గణనీయమైనది. ఈ వర్గం ఓటుశాతం రాజకీయ పార్టీల విజయానికి కీలకంగా మారింది. అందువల్ల ప్రతి ఎన్నికల సీజన్‌లో బీసీలకు హామీలు, పదవుల వాగ్దానాలు వెల్లువెత్తుతాయి. కానీ ఎన్నికలు ముగిసిన వెంటనే ఆ హామీలు గాలిలో కలిసిపోతాయి. బీసీ వర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు, ఆర్థిక పథకాలు ప్రకటించినా, వాటి అమలు స్థాయిలో పెద్ద మార్పు కనపడడం లేదు. పార్టీలకు బీసీలు కేవలం ఓటు బ్యాంకులుగా మారి పోయారు. అసలు నాయకత్వ స్థాయిలో బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం చాలా అరుదు. కొద్దిమంది ప్రతీకాత్మక నాయకులను ముందుకు తెచ్చి మొత్తం వర్గాన్ని మోసం చేయడం జరుగుతోంది. ఈపరిస్థితుల్లో బీసీసమాజం రాజకీయ అవగాహన పెంచుకొని, నిజమైన అభివృద్ధి దిశగా ఆలోచించాలి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## అమలు కాని హామీలు

ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి రావాలని ముందు వెనుక ఆలోచించకుండా సాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా హామీల వర్షం కురిపేస్తుంటారు పార్టీలకు చెందిన నాయకులు. అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుంటారు. అయితే ఒకరు మోసం చేసినా మరొకరు మంచి చేయకపోతారా అనే ఆశతో ప్రభుత్వాలను మారుస్తుంటారు. అలానే సంవత్సరం ముందు ఏపిలో ప్రభుత్వ మార్పిడి చేశారు. వై.యస్ ఆర్‌సిపిని తప్పించి తెలుగుదేశంకి పట్టంగట్టారు. అయితే వీరు ఒరగబెట్టిందేమీ లేదనిటాకి. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుకు నోచుకోలేదు. దాని ప్రస్తావనే లేదు.

- ఎమ్. రామారావు, హైదరాబాద్

## నిరుద్యోగులకు భృతి ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలో ప్రవేశ పెట్టనున్ననిరుద్యోగ భృతి పథకంలో అర్హులందరికీ నిరుద్యోగ భృతి పంపిణీ చేయాలి. ఉన్నత విద్య చదివిన అరవైఏళ్లలోపు నిరుద్యోగులు ఎందరో ఉన్నారు. కనీసం ఐదు వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తే బాగుంటుంది. కాలయాపన చేయకుండా వెంటనే అందివ్వాలి.

- ఎన్. బాషా, నెల్లూరుజిల్లా

## కట్నం వేధింపులను ఆపలేమా?

కట్నం అనే బాధకరమైన సంస్కృతి భారత సమాజానికి ఇంకా సమాజానికి ఒకతీవ్రమైన జాడ్యంగా నిలవడం బాధాకరం. తెలంగాణ బాసరమండలంలోని దొండపూర్‌గ్రామంలో మాధవి ఆత్మహత్య సంఘటన యావత్ సభ సమాజానికి ఒక మరిచిపోలేని ఘటనగా నిలిచింది. వివాహానంతరం భర్త మద్యపు అలవాట్లు, అత్తింటి నిరంతర వేధింపులు ఆమె జీవితాన్ని నరక యాత్రలోకి నెట్టాయి. ఈ సంఘటన మహిళల భవిష్యత్తుకే కాదు, సమాజ మానవతాకే హెచ్చరిక. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కాపాడాల్సిన చట్టాలు అనేకం ఉన్నప్పటికీ, అవి అమలులో విఫలమవుతున్నవి. బాధితుల కోసం వేగవంతమైన, సమర్థవంతమైన రక్షణ అందడం లేదు. ప్రతి జిల్లా, మండలంలో ప్రత్యేక విచారణ కేంద్రాలు ఉండాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పర్యవేక్షణ తప్పనిసరి

ఇప్పటికాలంలో చిన్నపిల్లల చేతుల్లోకూడా మొబైల్ ఫోన్లు కనిపిస్తున్నాయి. చదువుకోడానికి, ఆటల కోసం అని మొద లైన ఈ అలవాటు క్రమంగాహానికరంగా మారుతోంది. ఎక్కువసేపు మొబైల్ వాడడంవల్ల కంటిచూపు తగ్గిపోవడం, నిద్రసరిగా లేకపోవడం, శారీరక చలనం తగ్గిపోవడం జరుగుతోంది. మొబైల్ గేమ్స్ మరియు వీడియోల తో సమయం వృథా అవ్వడంతో చదువుపై దృష్టి తగ్గి పోతోంది. స్నేహితులతో ఆడుకోవడం, మాట్లాడడం తగ్గి పిల్లలు ఒంటరిగా మారుతున్నారు. అందుకే తల్లిదండ్రులు పిల్లల మొబైల్ వాడకాన్ని పరిమితం చేసి, పర్యవేక్షణలో ఉంచాలి. పిల్లలకు ఎప్పుడుపడితే అప్పుడు మొబైల్ ఫోన్లు ఇవ్వకుండా కట్టుదిట్టం చేయాలి.

-పి. రాజేష్, నల్గొండ జిల్లా

## మద్యాన్ని నిషేధించాలి

ఇటీవల ఏపిలో కొత్తగా ఏర్పాటుచేసిన మద్యం విక్రయ కేంద్రాలు కొన్ని నగరాలలో జన వాడల మధ్య ఉంటున్నాయి. దీనికి తోడు వివిధ జంక్షన్‌లోకి వచ్చేజనం ఆమార్గం గుండా వస్తారు. మద్యం సేవకులు మోతాదు ఎక్కువై ఇతరులతో ఘర్షణలకు దిగుతున్నారు. కొందరు రహదారి ప్రక్కన అసహ్యంగా పడిపోయి అక్కడే పడుకుంటున్నారు. కుటుంబాల ప్రజలు స్థానిక ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా దుకాణ దార్లు ఏమి చేయలేకపోతున్నారు. ఇకపై కొత్త షాప్‌లకు ప్రదేశం కాస్త దూరంగా ఉంటే ఈ సమస్య కొంత తగ్గుతుంది.

-బొల్లోజు మేఘానథం, విశాఖపట్నం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆరోగ్య, శ్రామికశక్తిని హరిస్తున్న మధుమేహం!

**మధుమేహం బారిన పడ్డాకే చాలా మందిలో ఆరోగ్యం విలువ తెలుస్తుంది. నిజానికి ఎంతకాలం బతికామన్నది ముఖ్యంకాదు. ఆరోగ్యంగా ఎంతకాలం బతికామన్నదే ముఖ్యం. అందుకే ప్రతి ఒక్కరు ఆరోగ్య పరిరక్షణ గురించి తెలుసుకునేందుకు, మధుమేహం వంటి జీవితకాల వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు కొంత సమయం కేటాయించాలి. కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఏది ఏమైనా నేడు మధుమేహం ఒక పెద్ద ప్రజారోగ్య సమస్య అయి కూర్చుంది. దేశ శ్రామిక శక్తిపై అత్యంత ప్రభావం చూపుతోంది. అంతేగాక దేశాన్ని ఆర్థిక పరంగా, బాధితుల కుటుంబాలను ఆరోగ్య, ఆర్థికపరంగా కృంగదీస్తోంది. దేశ ప్రజలందరూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మధుమేహ నిరోధక చర్యలపై తీవ్రంగా దృష్టి సారించాల్సిన పరిస్థితులు అత్యవసరమయ్యాయి. ఎంత త్వరగా స్పందిస్తే అంత మంచిది.**



డాక్టర్ టి. సేవకుమార్

మధుమేహ బాధితుల పరంగా భారత దేశం ప్రపంచానికే రాజధాని అయితే ,దక్షిణాది రాష్ట్రాలు భారతదేశానికి రాజధానులుగా మారాయని గణాంక వివరాలు తెలుపుతున్నాయి. ఇప్పటికే మన దేశంలో 20 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల మధ్య వయస్సుగల వారిలో11.5 మధుమేహ బాధితులే . మధుమేహ బాధితుల సంఖ్య ఇప్పుడు 101 మిలియన్‌లకు చేరింది. ఇంకా గుర్తించకుండా దేశంలో నిద్రాణంగా ఉన్న వారి సంఖ్య 38.6 మిలియన్ లని ఒక అంచనా. అంతేకాక అతి త్వరలో మధుమేహ బాధితులలో చేరబోతున్న 'ప్రీ డయాబెటిక్స్' సంఖ్య ప్రతి వంద మందిలో 16 మంది ఉన్నారంటే మధుమేహ వ్యాప్తి పరిస్థితిని మనం అర్థం చేసుకోవచ్చును. పేద,ధనిక, స్త్రీ ,పురుష వయోభేదం లేకుండా నేడు దేశంలో మధుమేహం విజృంభిస్తోందడానికి నిదర్శనం పై సంఖ్యలే. మనదేశంలోనూ దక్షిణాది రాష్ట్రాల్లోనే అత్యధిక సంఖ్యలో మధుమేహ బాధితులున్నారు. గోవా, పుదుచ్చేరి రాష్ట్రాలలో ప్రతి వందమందిలో 26మంది ఉంటే, కేరళలో 25మంది ఉన్నారని సర్వేలు తెలుపుతున్నాయి. మనరెండు తెలుగు రాష్ట్రాలలో సరైన గణాంకాలు, సర్వేలు లేవు కానీ, గోవా, కేరళ రాష్ట్రాల్లో కంటే కాస్త ఎక్కువగానే మధుమేహ బాధితులున్నారని, ప్రతిరోజు ఆసుపత్రులను, డయాగ్నొస్టిక్ సెంటర్లను ఆశ్రయిస్తున్న వారిని బట్టి తెలుస్తోంది. భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో మధుమేహం క్రమంగా వేగాన్ని పుంజుకొంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేస్తుంది. ఈ నేపథ్యంలోనే మధుమేహం నియంత్రణ, నిరోధమే లక్ష్యంగా ప్రతి సంవత్సరం మధుమేహ కారక ఇన్సులిన్‌ను, కనుగొన్న సర్ ఫెడరిక్ బ్యాంటిన్గ్ పుట్టినరోజైన నవంబర్ 14 వ తేదీని "ప్రపంచ మధుమేహ నిరోధక దినం'గా జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చింది. అంతేకాక ప్రతి సంవత్సరం ఒక నినాదం కూడా ఇవ్వడం జరుగుతోంది .ఈ సంవత్సరం 2025కు మధుమేహం వెల్ బీయింగ్ లక్ష్యంగా వివిధ వయసులలో గల మధుమేహ బాధితులలో వ్యాయామాన్ని ప్రోత్సహించడం ,ఆహార నియమాలను పాటించేలా చేయడం ,పోషకాహారం తీసుకోవడంలో సహకరించడం, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం, మానసిక ఒత్తిడి, ఆందోళనలను తొలగించడం వంటి విషయాలలో చేయూత అందించి ,మనలానే మధుమేహ బాధితులకు సైతం మెరుగైన జీవన పరిస్థితులకు సహకరించాలన్నది ఈ నినాదముఖ్యఉద్దేశం. ఈ నినాద లక్షసాధనలో మనందరం భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేడు మనిషి జీవన విధానం, ఆహారంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు మధుమేహం వంటి జీవితకాల దీర్ఘవ్యాధులకు ఆజ్యంపోస్తున్నాయి. కారణాలు ఏవైనా అతి చిన్న వయసు నుండే ఏమాత్రం శారీరక శ్రమ లేకపోవడం, ఆహారంలో చోటు చేసుకున్న మార్పులు, కల్తీలు, పంట పొలాల్లో వేసే రసాయనక ఎరువులు, క్రిమిసంహారక మందులు, విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగం, పర్యావరణ మార్పులు, కొత్త కొత్త వైరల్ వ్యాధులు ,వృత్తిపర మానసిక ఒత్తిడి, ఆందోళనలు, జన్యువులలో ఉత్పరివర్తనలు ఇలా ఎన్నో కారణాలు, రక్తములో షుగర్‌ను నియంత్రించే ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే ప్యాంక్రియాస్ (క్లోమగ్రంది)ను అసాధారణ రీతిలో ప్రభావితం చేయడం జరుగుతోంది. శరీర అవసరాలకు సరిపడా ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోవటం, ఇన్సులిన్ పనితీరులోని లోపాలు( రెసిస్టెన్స్) శరీర కణాలు ఇన్సులిన్‌ని వినియోగించుకోలేకపోవడం...వెరసి రక్తంలో అసాధారణ స్థాయిలో షుగర్ శాతాన్ని పెంచేస్తున్నాయి. ఈ అధిక స్థాయిలో రక్తంలో గల షుగర్



అన్ని శరీర అవయవాలలో రక్తంతోపాటే చేరి, తీవ్ర ప్రభావం చూపుతోంది. అందుకే షుగర్‌ను 'వైట్ పాయిజన్'గా పేర్కొనడం జరిగింది. నేడు మనం ఆహారం రుచిగా ఉండాలి, కంటికి ఇంపుగా ఉండాలి అనే చూస్తున్నాం కానీ, వాటిలో గల పోషక విలువల గురించి గానీ, ఆ రుచికి వాడుతున్న వివిధ రకాల రసాయనాలను గురించి గానీ, కంటికి ఇంపుగా కనిపించేందుకు వాడుతున్న రంగుల గురించి గానీ ఆలోచించటం లేదు. తగరపు కాగితాలు, ప్లాస్టిక్ కవర్‌లు పాలు, కాఫీ, టి, కర్రీ, బిర్యాని వంటి వాటి ప్యాకింగ్ వాడుతున్నాం .ఆ వేడి పదార్థాలలో ప్లాస్టిక్ కరిగిపోయి ఆహారంలో కలుస్తుందన్న విషయం గుర్తించడం లేదు. కాఫీ కప్పులు, గ్లాసులు కాగితాలతో చేసినా, వాటి లోపల ద్రవపదార్థాలను పీల్చకుండా ఉండేందుకు రసాయనాల పూత ఉంటుందన్న విషయాన్ని గుర్తించడం లేదు. ఫంక్షన్‌లలో పింగాణీ కప్పులు ,స్టీల్ గ్లాసులు వాడడం ఎప్పుడో పూర్తిగా మానేశాం. అంతేకాక మోదుగు, బాదం చెట్ల ఆకులతో చేసిన ప్లేట్లు లేదా విస్తరాకులు తగ్గిపోయి, పేపర్‌తో రసాయనాల పూతతో తయారుచేసిన అందమైన ప్లేట్లను వాడుతున్నాం. ఈ రసాయనాలన్నీ తేలికగా నీటిలో కరిగి, తినే ద్రవరూప, ఘనరూప పదార్థాలతో కలిసి జీర్ణాశయంలోకి పోతున్నాయి. చివరకు రక్తంలో చేరి ప్రతి అవయవానికి సరఫరా అవుతున్నాయి. ఇవి శరీరంలోని అన్ని హార్మోన్లపై, అవయవాలపై ప్రభావం చూపుతున్నాయి. చివరకు గోళ్లు, వెంట్రుకలను కూడా వదలడం లేదు. శరీరం అంతా విషమయం అవుతుంది. అందులో ముఖ్యంగా అతి సున్నిత అవయవం అయిన ప్యాంక్రియాస్ పై ఆ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అది సహజ సిద్ధంగా ఉత్పత్తి చేసే ఇన్సులిన్ ,శరీర అవసరాలకు సరిపడా ఉత్పత్తి చేయకపోవడం, లేదాఉత్పత్తి చేసిన శరీర కణజాలాలలో రెసిస్టెన్స్ వచ్చి వినియోగపడకపోవడం వల్ల చివరికి రక్తంలో షుగర్ స్థాయి అసాధారణ రీతిలో పెరిగిపోవడం జరుగుతోంది. అదే ఇప్పుడు మన వేధిస్తున్న సమస్య మధుమేహం. శరీరంలో శక్తిని జ్వలింపచేసే సహజ ఇన్సులిన్ కు అస్వస్థత చేస్తే ,ఇన్సులిన్‌తోపని చేయించుకోవడం లేదా ఎక్కువగా ఉత్పత్తి చేయడం కోసం ప్రతి రోజు శ్రమ పడక, మందులు వాడక తప్పని పరిస్థితులు వచ్చేసాయి. ఒకసారి మధుమేహం వచ్చిందని నిర్ధారించాక ఇక జీవితాంతం దాని గురించి ఆలోచించక తప్పదు. ప్రతినెల రక్త పరీక్షలు ,వైద్యుని సంప్రదింపులు ,మందుల వాడకం ,ఆహార నియమాలు పాటించటం, క్రమం తప్పక వ్యాయామం చేయడం, మళ్లీ రక్త పరీక్షలు, వైద్యులు, మందులు, ఇలా ఒక విష వలయంలో చిక్కుకుపోతున్నారు. మధుమేహ బాధితులు, వైద్యులు కాగితాలపై ప్రింట్ చేసి ఇచ్చే నియమాలు ప్రాక్టికల్‌గా పాటించటం అంత తేలిక కాదు. అలానే వ్యాయామంకు సమయం దొరకపోవడం, స్థలం దొరకపోవడం కూడా చాలామంది ఎదుర్కొనే సమస్య .ఇక రక్త పరీక్షలు, వైద్యుల సలహా, మందులు నేడు చాలా ఖరీదైపోతున్నాయి. ఇక కాంప్లికేషన్లు గురైన వారికి అయితేఇంకా ఖర్చు ఎక్కువవుతుంది. సంపాదనలో కొంత భాగం తప్పక మధుమేహ నియంత్రణకు ఖర్చు పెట్టక తప్పని పరిస్థితులు వచ్చేసాయి. ఇంట్లో మధుమేహ బాధితులు ఇద్దరు ముగ్గురు ఉంటే ఆ ఖర్చు మరింత పెరుగుతుంది. ఆనందంగా ఏ ఆహారం తీసుకోలేరు. రుచిగా ఉందని ఏ ఆహారం ముట్టుకున్న లోపల ఉన్న మధుమేహం భయపెడుతూనే ఉంటుంది. ప్రశాంతంగా ,స్వేచ్ఛగా ఆహారం తీసుకునే పరిస్థితి లేదు. మధుమేహ బాధితులు తమ శత్రువులకు కూడా ఈ కష్టాలు రాకూడదని అనుకుంటారు. కానీ వీరు షుగర్ రాకముందు జాగ్రత్తలలో ఎంతో అజాగ్రత్తగా ఉంటారు. మధుమేహం బారిన పడ్డాకే చాలామందిలో ఆరోగ్యం విలువ తెలుస్తుంది. నిజానికి ఎంతకాలం బతికామన్నది ముఖ్యంకాదు. ఆరోగ్యంగా ఎంతకాలం బతికామన్నదే ముఖ్యం. అందుకే ప్రతి ఒక్కరు ఆరోగ్య పరిరక్షణ గురించి తెలుసుకునేందుకు, మధుమేహం వంటి జీవితకాల వ్యాధుల బారిన పడకుండా ఉండేం దుకు కొంత సమయం కేటాయించాలి. కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఏది ఏమైనా నేడు మధుమేహం ఒక పెద్ద ప్రజా రోగ్యసమస్య అయి కూర్చుంది. దేశ శ్రామిక శక్తిపై అత్యంత ప్రభావం చూపుతోంది. అంతేగాక దేశాన్ని ఆర్థిక పరంగా, బాధితుల కుటుంబాలను ఆరోగ్య, ఆర్థికపరంగా కృంగదీస్తోంది. దేశ ప్రజలందరూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మధుమేహ నిరోధక చర్యలపై తీవ్రంగా దృష్టి సారించాల్సిన పరిస్థితులు అత్యవసరమయ్యాయి. ఎంత త్వరగా స్పందిస్తే అంత మంచిది. ●

# మన పొదుపే ఆరోగ్యానికి మదుపు


డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

రెక్కాడితేనే డొక్క నిండని అత్యాధునిక అకాలాలు. నిరుద్యోగుల బతుకు బహు వెతలు. నిరుపేదల అనంత ఆకలి పోరాటాలు. నైపుణ్య చేతులకే పరిమితమైన పనులు, ఆదాయాలు. దినసరి కూలీ రేట్ల పతనాలు. ఆదాయం బహు పలుచన, కోరికలు ఆకాశాన. చుట్టూ సమస్యల విష వలయాలు. రేపటికి లేదు భరోసా. నేడు పని దొరుకుతుందన్న ఆశలు కరువు. ఇన్ని సంక్షోభాల నడుమ డిజిటల్ యువత తమ కుటుంబ స్థాయిని మరిచి, విచ్చలవిడిగా, అనాలోచితంగా, విచక్షణారహితంగా ధనాన్ని నీళ్ల వలె ఖర్చు చేయడం చూస్తున్నాం. ఆదాయానికి, ఖర్చుకు సంబంధం లేకుండా పోతున్నది. నేటి ఆదాయం రేపటి విపత్తుల్లో ఆదుకుంటుందన్న ఇంగితం మరిచారు యువజనులు. ఆర్థిక క్రమశిక్షణ లోపించి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతూ, అశాంతి నిలయాలుగా దర్శనమిస్తున్నాయి. రాబడి కన్న ఖర్చులు అధికం అవుతున్నాయి. ఎంత సంపాదిస్తున్నామనేది ముఖ్యం కాదని, ఎంత ఆదా లేదా పొదుపు చేస్తున్నామనేది ప్రధానమని తెలుసుకోని యువత నేడు ఆర్థిక నిరక్షరాస్యులుగా మిగిలిపోతున్నారు. రేపటి ఆపదలు చెప్పిరావు. ఆపద వచ్చినపుడు బ్యాంకు బ్యాలెన్స్ ఖాళీగా ఉంటుంది. ఇలాంటి ఆర్థిక సంకట స్థితికి కారణం నేటి ప్రజల్లో, ముఖ్యంగా యువతలో పొదుపు ప్రాధాన్యం తెలియకపోవడమే అని నిర్ధారించాల్సిన సమయం ఆసన్నమైంది. నేటి విద్యా వ్యవస్థలో ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు పాఠాలు చెప్పడానికి అవకాశం లేకుండా పోయింది. ఎంత ఖర్చు పెడితే అంత గౌరవం పెరుగుతుందనే దురభిప్రాయంలో యువత కొట్టుమిట్టాడుతోంది. చిన్నప్పటి నుంచేపిల్లల్లో పొదుపు పట్ల అవగాహన కల్పించాలి. పొదుపుకు, పిసినారితనానికి వ్యత్యాసం నేర్పాలి. సంపాదించిన నెలసరి వేతనంతో కొంతమేరకు పొదుపు చేయడం కనీస కర్తవ్యమని నేర్చుకోవాలి. మొక్కై వంగనిదే, మానై వంగదు కదా. లేత మనసుల్లో ఆర్థిక అక్షరాస్యత బీజాలు నాటాలి. చిన్నతనంలో పొదుపు పాఠాలు నేర్పిన పిల్లలు రేపటి కుటుంబానికి సుఖ సంతోషాలను అందించగలదని తెలుసుకోవాలి. కనీస అవసరాలకు, విలాసాలకు వ్యత్యాసం నేర్పాలి. నేటి డిజిటల్ యువత ఉద్యోగాలు చేస్తూ పరిమిత వేతనాలను పొందుతున్నారు. తాము పొందిన వేతనాలతో కుటుంబాలను సజావుగా నడపడం లేదు. ప్రాధాన్యాలు మరిచిపోతున్నారు. విలాసాలు కూడా కనీస అవసరాలు అనుకుంటున్నారు. డబ్బు చేతిలో ఉన్నపుడు చేతులకు ఎముకలు లేవన్నట్లు అనాలోచితంగా ఖర్చు చేస్తున్నారు. ధనం ఉన్నపుడు ఎగిరి పడడంతో పాటు లేనప్పుడు అప్పులు చేయడానికి కూడా వెనకాడడం లేదు. విలాసాలకు, కనీస అవసరాలకు వ్యత్యాసాలు మరిచి పోతున్నారు. ఎంత సంపాదించిన నెలలోని తొలి వారంలోనే ఖర్చు పెడుతున్నారు. రేపటి అనుకోని ఆపదలను తట్టుకోవడానికి పొదుపు ధనం వినియోగపడుతుందనే కనీస అవగాహన కోల్పోతున్నారు. నేటి విద్యాలయాలు మార్కులు, ర్యాంకుల పాఠాలు నేర్పుతున్నారు. ఉద్యోగాలు పొందడానికి అవసర విద్యను బోధిస్తున్నారు. సంపాదించిన ధనాన్ని పొదుపుగా వాడుకోవడాన్ని నేర్పేవిద్య కరువైయ్యింది. చాప ఉన్నంత వరకే కాళ్లు చాపుకోవడం నేర్పాలి. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవడంబోధించాలి. ప్రమాదాలు చెప్పి రావని, అనారోగ్యాలు అడిగి రావని తెలుసుకోవాలి. అనుకోని విపత్తుల్లో ఆదా చేసిన డబ్బు ఆదుకుంటుందనే ఇంగితం మరిచాం. చిన్నతనం నుంచే పాకెట మనీని దాచుకోవడం నేర్పించాలి. పిల్లలతో పాటు యువతకు డబ్బు ప్రాధాన్యాన్ని, ఖర్చు చేసే పద్ధతులను, పొదుపు చేయవలసిన అవసరాన్ని బోధించాలి. తమ బ్యాంక్‌లో పొదుపు ధనాన్ని దాచుకోవడం బోధించాలి. ప్రతి నెల వేతనంలో కొంత శాతాన్ని విధిగా పొదుపు చేయడం నేర్చుకోవాలి. మన అలవాట్లకు, వ్యయానికి సమీప సంబంధం ఉందని తెలపాలి. నేటి పొదుపు రేపటి భరోసా కావాలి. నేటి బాలలే రేపటి పౌరులు. నేటి ఆదాయమే రేపటి ప్రమాదాలకు చికిత్స. నేటి పొదుపు చేసిన ధనమే రేపటి కుటుంబ సంతోషాలకు పునాది. ●

# నిరుద్యోగులకు ఏదీ ఉపాధి గ్యారంటీ?

ఆర్.భాస్కర్ రెడ్డి

ఎన్నో దశబ్దాలుగా ఈ ప్రాంత నిరుద్యోగుల ఆశలు అడి యాశలు అయ్యాయి. చేసిన బలిదానాలకు అర్థం లేకుండా పోయింది. ప్రారంభించిన ఉద్యమాలు, ఆత్మర్పనాలు అన్ని వృధా ప్రయాసే అనే నిరాశలో, నిరుత్సాహంతో తెలంగాణ రాష్ట్రంలో వున్న నిరుద్యోగులు ఒక రకమైన మానసిక సంఘర్షణ చేస్తున్నారు. హైదరాబాద్ రాష్ట్రంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో దశాబ్దాలుగా ఉద్యోగాలకోసం ఈ ప్రాంత నిరుద్యోగులు తమకు జరుగుతున్న అన్యాయాలను ఎలిగెత్తి చాటారు. ఇక విసుగు చెంది స్వరాష్ట్రంలోనే తమ ఆకాంక్షలు నెరవేరుతాయని 1969లో తొలి తెలంగాణ ఉద్యమం నడిపి విద్యార్థులు అమరులు అయ్యారు. ఆ తర్వాత కూడా ఈ ప్రాంత విద్యార్థి, నిరుద్యోగులకు నష్టం జరగడాన్ని తట్టుకోలేక మలిదశ తెలంగాణ ఉద్యమంలో 1200మంది ఆత్మార్పణ చేసుకొని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను దేశానికి అర్థం అయ్యేలా చేశారు. ఇది చరిత్ర. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు 2014 అయ్యాక కూడా నిరుద్యోగుల, విద్యార్థుల ఆకాంక్షలు ఆవిరై ఒక తరం భవిష్యత్తు నాశనం అయింది. వేసిన ఉద్యోగ ప్రకటనలు అయితే కోర్టు మెట్లు ఎక్కడంతోనే మొదటి దఫా ప్రభుత్వం పనితనం అయింది. రెండో దఫా ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలు లీకేజీలతో గడిచింది. దీనితో విసుగు చెందిన నిరుద్యోగ, విద్యార్థి యువకులు మొన్న జరిగిన ఎన్నికలలో నూతన ప్రభుత్వం కోసం గత ప్రభుత్వాన్ని తిరస్కరించారు. ఇప్పుటి ప్రభుత్వం గతంలో జరిగిన పొరబాట్లు జరగకుండా మొదటగా టిఎస్‌పిఎస్‌సి బోర్డ్‌ను ప్రక్షాళన చేశారు. ఇంకా టిఎస్‌పిఎస్‌లో ఖాళీగా వున్న ఉద్యోగాలను మొదటగా భర్తీ చేసిన తర్వాతే ఉద్యోగ ప్రకటనలు జారీచేయాలని అనుకున్నారు. వేసే ఉద్యోగ ప్రకటనలు కోర్టు మెట్లు ఎక్కకుండా జాగ్రత్త తీసుకోవాలి అని, ఉద్యోగ క్యాలెండర్ మానిఫెస్టోలో చేర్చారు. నోటిఫికేషన్ వచ్చాక మాత్రం ఒక సంవత్సరంలో పూర్తి అయ్యేలా జవాబుదారీ తనంతో, పారదర్శకతతో చేస్తారని ఎదురుచూస్తున్నారు. వివిధ ఉద్యోగ ప్రకటనలకు అర్హత వున్న అందరూ ఎగ్జామ్ రాసేలా సమయాన్ని ఇచ్చేలా ప్రణాళికతో నిర్వహించాలి. కానీ జరింగింది, జరుతుంది చూస్తుంటే నిరుద్యోగులకు అన్యాయం ఇప్పటికీ జరుగుతుంది అని తెలుస్తుంది. ఎందుకంటే గ్రూప్ 2ఎగ్జామ్‌ను పోస్ట్‌లు పెంచకుండా పరీక్ష నిర్వహించి వేశారు. గ్రూప్ 3 పోస్ట్‌లను కూడా పెంచలేదు. గ్రూప్ 1పరీక్షపై అనేక నీలి నీడలు వున్నాయి. దాదాపు 20 రకాల కేసులు హై కోర్టులో పెండింగ్‌లో వున్నాయి. కానీ కోర్టుకి అఫిడవిట్ వేయడం టీజీపిఎస్‌కి రాలేదు. అసలు సమస్య జి.ఓ. నెంబర్ 55ను తీసి వేసి జి.ఒ.నంబర్ 29ను తీసుకొచ్చి రిజర్వేషన్ సూత్రానికి విరుద్ధంగా ప్రిలిమ్స్‌లో పాస్ అయిన అభ్యర్థులను మెయిన్స్‌కి ఎంపిక చేశారు. ప్రిలిమ్స్ పరీక్షలో క్వశ్చన్‌లకు జవాబులు తప్పుగా ఇచ్చారని అభ్యర్థులు కమిషన్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా కూడా పట్టించుకోకుండా పబ్లిక్ సర్వీస్ కమిషన్ వ్యవహరించింది. ఇలా చేసే అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో ఎపిపిఎస్‌సి 2011లో ఇచ్చిన గ్రూప్ 1 రెండు సార్లు మెయిన్స్ ఎగ్జామ్స్ నిర్వహించాల్సి వచ్చింది. ఇప్పుడు కూడా మెయిన్స్ ఎగ్జామ్స్‌పై పలు రకాల కేసులు వేయడం వలన వాటిని విచారణ చేసిన గౌరవ హైకోర్టు తీర్పును వెలువరిస్తూ మెయిన్స్ మూల్యాంకనం మళ్లీచేయాలని అది సాధ్యం కాకపోతే మళ్లీ మెయిన్స్‌ను నిర్వహించాలని తీర్పులో తెలియజేసింది. గత ప్రభుత్వంలో రెండు సార్లు ప్రిలిమ్స్‌ను రద్దు చేశారు. ఇప్పుడు ప్రిలిమ్స్ నిర్వహించిన అనేక అపోహలు, అనుమానాలు, అపార్థాలు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు తీరని మానసిక వేదన, ఆవేదనతో ఇబ్బంది పడ్డారు. కేస్‌లో అన్ని కోర్టు పరిధిలో పరిష్కరించాకే మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించాలని తమ బాధను, మూగ వేదనను ఎవరికి చెప్పాలో తెలియక మానసిక క్షోభను అనుభవిస్తూ మెయిన్స్ ఎగ్జామ్స్ రాశారు. ప్రభుత్వం ఒకరకంగా యుద్ధ ప్రాతిపదికన గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లను పరీక్షలు నిర్వహించి, రిజల్ట్స్ ప్రకటించి అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇచ్చింది. కానీ గ్రూప్ 1 విషయంలో కూడా ఎగ్జామ్ నిర్వహించాలి అనుకుందే కానీ నిరుద్యోగుల అపోహలను గుర్తించలేకపోయింది. ప్రభుత్వ తప్పు ఇక్కడ లేకున్నా టీజిపిఎస్ ఏం చేస్తున్నట్టు? ఎన్ని ప్రభుత్వాలు మారిన ఎందరు చైర్మన్‌లు మారిన కూడా ఈ అవకతవకలకు ముగింపు పలకలేరా? గత ప్రభుత్వం లాగే ప్రతిదీ కోర్టు మెట్లు ఎక్కితే జాబ్ క్యాలెండర్ వేసి ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తారు. వీటి అని అన్నిటికీ పబ్లిక్ సర్వీస్‌కమిషన్ బాధ్యత వహించాలి. అనుమానాలు, అపోహలను తొలగించాల్సిన బాధ్యత రాజ్యాంగ సంస్థ అయిన పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై వుంది. ప్రభుత్వం కూడా తగిన చొరవ తీసుకోవాలి. గత ప్రభుత్వ తప్పులను ఈ ప్రభుత్వం కూడా చేస్తే ఇక నిరుద్యోగుల ఆకాంక్షలు ఎవరు తీర్చాలి? ఇంకా ఎన్ని శతాబ్దాలు ఈ అన్యాయం చూస్తూ వుండాలి? ఇప్పటికే ఒక తరానికి అన్యాయం జరిగింది. ఇంకో తరానికి అదే జరుగుతుంది. నిరుద్యోగుల జీవితాలు గత 12 సంవత్సరాలలో తల కిందులు అయ్యాయి. నిరుద్యోగులు గ్రామ గ్రామం తిరిగి ప్రజలలో చైతన్యం కలిగించి ఈ ప్రభుత్వ ఏర్పాటులో తగు కృషి చేసిన ఈ రాష్ట్ర నిరుద్యోగులకు కొత్తగా ఏర్పాటు అయిన ప్రభుత్వంలో కూడా తగిన న్యాయం ఇప్పటికీ జరగట్లేదు. ఇప్పటికి అయిన ప్రభుత్వం, మేధావులు మౌనం వీడి జరుగుతున్న పొరపాట్లను సరిచేయాల్సిన తక్షణఅవసరంవుంది. అవసరం అయితే నిరుద్యోగులతో మీటింగ్ ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. ఇవి అన్నీ జరిగేలా నిరుద్యోగుల జీవితాలలో మార్పు వచ్చేలా చేస్తారు అని యావత్తు తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ యువకులు తెలియజేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఆరు గ్యారంటీల లో నిరుద్యోగ భృతి అమలు చేయకున్నా, ప్రభుత్వ ఉద్యోగాల గ్యారంటీ ఇస్తే చాలు. ●






# నేరచరితుల కట్టడికే పార్లమెంటు జెపిసి

## ఎంపి అపరాజితా సారంగి నేతృత్వంలో 31మందితో కమిటీ

**న్యూఢిల్లీ, నవంబరు 13:** రాజకీయాల్లోకి నేర చరిత్ర కలిగిన వారికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కళంకిత మంత్రుల తొలగింపు కోసం పార్లమెంటులో బిల్లును తీసుకువచ్చింది. దీని ప్రకారం ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు ఎవరైనా సరే తీవ్రమైన నేరపూరిత కేసుల్లో నెల రోజులు అనగా వరుసగా 30 రోజులు జైల్లో గడుపుతున్న వారిని తొలిగించేందుకు ఈ బిల్లును తీసుకు వచ్చింది. ఈక్రమంలో ఈ బిల్లును సమీక్షించేందుకు కతాను లోక్‌సభ సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)ని బుధవారం నాడు ఏర్పాటు చేసింది. దీనికి బీజేపీ మహిళా ఎంపి అపరాజితా సారంగి సారథ్యం వహిస్తారని లోక్‌సభ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో వెల్లడించింది. తీవ్రమైన నేరాల్లో జైల్లో ఉన్న వారిని పదవులు నుంచి తొలగించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాజ్యాంగ సవరణ చేసింది. ఇది 130వ రాజ్యాంగ సవరణ బిల్లుకు కిందకు వస్తుంది. దీనితో పాటు కేంద్రం మరో రెండు బిల్లులను కూడా చేసింది. అవి జమ్మూ, కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ(సవరణ)బిల్లు-2025, కేంద్ర పాలిత ప్రభుత్వాల(సవరణ)బిల్లు- 2025లను తీసుకు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బిల్లులను సమీక్షించేందుకు గాను లోక్‌సభ జాయింట్ పార్లమెంటరీ కమిటీని వేసింది. దీనిలో మొత్తంగా 31 మంది సభ్యులు ఉన్నట్లు లోక్‌సభ బుధవారం ప్రకటించింది. అయితే ప్రతిపక్ష పార్టీలు ఈ కమిటీని తీవ్ర స్థాయిలో వ్యతిరేకించడమే కాక బహిష్కరించాయి కూడా. నలుగురు విపక్ష పార్టీల సభ్యులకు కమిటీలో చోటు కల్పించారు. ఈ మొత్తం 31 మంది సభ్యుల్లో ఒక నామినేటె సభ్యుడు సహా కాషాయ పార్టీ నుంచి 15 మంది ఉన్నారు. అలానే ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీల నుంచి 11 మందికి అవకాశం ఇచ్చారు. మిగిలిన సభ్యులను ప్రతిపక్ష పార్టీల నుంచి తీసుకున్నారు. వీరిలో ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, వైసీసీ నుంచి నిరంజన్ రెడ్డి, అకాలీదళ్ పార్టీ నుంచి హర్‌సిమ్రత్ బాదల్, ఎన్సీపీ-ఎస్పీ పార్టీ నాయకురాలు సుప్రియా సూలేలను కూడా సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ ప్యానెల్‌లో తాము చేరబోమని కాంగ్రెస్ పార్టీతో పాటు తృణముల్ కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్, బిజూ జనతాదళ్ పార్టీలు ఇప్పటికే ప్రకటించాయి.



## శిక్షణ ఇచ్చి తిరిగి వెళ్లిపొండి!

### వలస కార్మికులపై యుఎస్ ఆర్థిక సలహాదారు బెస్సెంట్ అక్కసు

**వాషింగ్టన్,నవంబరు 13:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా హెచ్1బీ వీసాల విషయంలో యూటర్న్ తీసుకున్న విషయం అందరికీ తెలిసిందే. ఆయన వలస కార్మికుల గురించి పాజిటివ్‌గా మాట్లాడారు. అమెరికా పారిశ్రామిక సెక్టార్‌తో పాటు రక్షణ రంగంలో పురోగతి సాధించాలంటే నైపుణ్యం ఉన్న కార్మికులను విదేశాల నుంచి అమెరికాకు రప్పించాలని అయితే, అది పరిమిత స్థాయిలో ఉండాలని అన్నారు. కానీ వీటిపై తాజాగా ట్రంప్ ఆర్థిక సలహాదారుల్లో ఒకరైన ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ నీళ్లు చల్లారు. ట్రంప్ తీసుకు రాబోతున్న కొత్త విధానం నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్ ప్రయత్నమేనని అభివర్ణించారు. దశాబ్దాల ఔట్‌సోర్సింగ్ తర్వాత అమెరికన్ తయారీ రంగాన్ని తిరిగి నిర్మించడం ఈ విధానం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. నైపుణ్యాలు కలిగిన విదేశీ కార్మికులను మూడు, ఐదు లేదా ఏడు సంవత్సరాల పాటు అమెరికన్ కార్మికులకు శిక్షణ ఇవ్వడానికి దేశంలోకి తీసుకురావాలని అధ్యక్షుడు భావిస్తున్నారు. ఆ తర్వాత వారు ఇంటికి వెళ్లిపోవచ్చు, అప్పుడు అమెరికన్ కార్మికులు ఆ స్థానాలను భర్తీ చేస్తారని బెస్సెంట్ పేర్కొన్నారు. విదేశీ కార్మికులు అమెరికన్ల ఉద్యోగాలను లాక్కుంటారనే ఆందోళనలను ఆయన తోసిపుచ్చారు.

ఇకపై విదేశీ నిపుణులు వచ్చి అమెరికన్ కార్మికులకు శిక్షణ ఇచ్చి తిరిగి వెళ్లిపోతారని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగానే బెస్సెంట్ ట్రంప్ పరిపాలన ఆర్థిక ఎజెండాను కూడా ప్రస్తావించారు. సంవత్సరానికి 1,00,000 డాలర్ల కంటే తక్కువ సంపాదించే కుటుంబాలకు సుంకాల ద్వారా వచ్చే డబ్బుల్లోంచి 2,000 వేల డాలర్లు అందించబోతున్నట్లు వివరించారు. బలమైన వాణిజ్య విధానాల ప్రయోజనాలు మధ్యతరగతి కుటుంబాలకు కూడా అందేలా చూడటంలో ఇది భాగమని ఆయన స్పష్టం చేశారు.

# ఖైదీల రెమిషన్ విడుదలలో విఫలమైన రాష్ట్రాలు

## ఐదు రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు

**న్యూఢిల్లీ, నవంబరు 13:** ఖైదీల ముందస్తు విడుదల (కమిషన్) విధానాలను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైన ఐదు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు చివరి అవకాశం ఇచ్చింది. అస్సాం, హిమాచల్ ప్రదేశ్, మేఘాలయ, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు రెండు నెలల్లోగా ఈ విధానాలను సంపూర్ణంగా అమలు చేయాలని గురువారం గడువు విధించింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం.. బెయిల్, రెమిషన్ విధానాలకు సంబంధించిన సమస్యలపై సుమోటోగా విచారణ చేపట్టిన సుప్రీం స్ట్రాటజీ ఫర్ గ్రాంట్ ఆఫ్ బెయిల్ కేసులో ఈ ఆదేశాలు జారీ చేసింది. లిజ్ మాథ్యూ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈ ఐదు రాష్ట్రాలు తమ ముందస్తు విడుదల విధానాలను, నిబంధనలను ఇంకా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వాల తరఫున చేసిన విజ్ఞప్తిని అంగీకరిస్తూ, చివరి అవకాశంగా, ఈ ఐదు రాష్ట్రాలు పూర్తిస్థాయిలో నిబంధనలు పాటించేందుకు ఈ ఉత్తర్వుల తేదీ నుంచి రెండు నెలల సమయం ఇస్తున్నామని ధర్మాసనం స్పష్టం చేసింది. అదే సమయంలో కేరళ పాక్షికంగానే నిబంధనలు అమలు చేసిందని పేర్కొన్న కోర్టు, ముందస్తు విడుదల అభ్యర్థనలను తిరస్కరించినప్పుడు కారణాలను తప్పనిసరిగా వెల్లడించేలా చట్టపరమైన సవరణ చేసేందుకు నాలుగు నెలల గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలకమైన సూచన చేసింది. ఒక ఖైదీ ముందస్తు విడుదలకు అర్హత సాధించడానికి కనీసం ఆరు నెలల ముందే అతని కేసును రాష్ట్ర ప్రభుత్వాలు సమీక్షించాలని ఆదేశించింది. దీనివల్ల అర్హత పొందిన తర్వాత కూడా ఖైదీలు అనవసరంగా జైలులో గడపాల్సిన పరిస్థితిని నివారించవచ్చని అభిప్రాయపడింది. ఈ కేసులో మరో ముఖ్యమైన ఆదేశాన్ని సుప్రీంకోర్టు జారీ చేసింది. రెమిషన్ విధానాల అమలు పురోగతిని ఆయా రాష్ట్రాల హైకోర్టులు పర్యవేక్షించాలన్న లిజ్ మాథ్యూ సూచనను అంగీకరించింది. సంబంధిత హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు సుమోటోగా రిట్ పిటిషన్ నమోదు చేసి, ఆ తర్వాత ఒక డివిజన్ బెంచ్‌ను ఏర్పాటు చేసి రెమిషన్, ముందస్తు విడుదల విధానాల అమలును పర్యవేక్షించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది.

# బీహార్ కౌంటింగ్‌కు భారీ ఏర్పాట్లు

## నేటి ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఆరంభం - విజయోత్సవ ర్యాలీలపై ఇసి నిషేధం - 8 ఉప ఎన్నికల ఫలితాలూ నేడే

**న్యూఢిల్లీ, నవంబరు 13:** బీహార్ ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధమైంది. శుక్రవారం ఉదయం 8గం.లకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. సాయంత్రం 5గంటల కల్లా తుది ఫలితాలు వెలువడనున్నాయి. బీహార్‌లోని 243 నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు కోసం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. మైక్రో అబ్జర్వర్‌తో కూడిన 4,372 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు సిఇఓ వినోద్ సింగ్ గుంజియల్ తెలిపారు. కౌంటింగ్ కోసం దాదాపు 18వేల మందికి పైగా ఆయా అభ్యర్థులు తమ ఏజెంట్లను నియమించు కున్నారని వివరించారు. పోలీసులు, పారా మిలిటరీ బలగాలతో మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు డిజిపి వినయ్ కుమార్ తెలిపారు. చెనారి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిపై ఫిర్యాదులు రావడంతో అతడిని కౌంటింగ్ ప్రక్రియతో సహా ఎన్నికలకు సంబంధించిన అన్ని విధుల నుంచి తప్పించినట్లు సిఇఓ వినోద్ సింగ్ తెలిపారు. బీహార్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి 67.13శాతం ఓటింగ్ నమోదు కావడంతో చరిత్ర సృష్టించింది. భారత ఎన్నికల సంఘం ప్రకారం, 1951 తర్వాత బీహార్‌లో ఇదే అత్యధికం. 62.98శాతం మంది పురుషులు, 71.78శాతం మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకుని మరో రికార్డు సృష్టించారు. రెండు దశల్లో జరిగిన పోలింగ్‌లో ఏ ఒక్క బూత్‌లోనూ రీపోలింగ్‌కు అవకాశం లేకుండా చాలా ప్రశాంతంగా ఈసారి ఎన్నికల ప్రక్రియ ముగియడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికల ఫలితాలపై అధికార ఎన్‌డిఏ, విపక్ష మహాఘట్ బంధన్ గెలుపు ధీమాతో ఉన్నాయి. ఎగ్జిట్ పోల్స్ మాత్రమే అధికార ఎన్‌డిఏ వైపు మొగ్గు చూపాయి. అత్యంత ప్రాముఖ్యమున్న తొమ్మిది సంస్థల ఎగ్జిట్ పోల్స్ అంచనా ప్రకారం 243 సభ్యుల అసెంబ్లీలో ఎన్‌డిఏ సరాసరి 147 స్థానాలు విజయం సాధించనుంది. ఎగ్జిట్ పోల్స్‌ను అధికార ఎన్‌డిఏ నేతలు స్వాగతించగా, ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ నాయకులు తిరస్కరించారు. ఎగ్జిట్ పోల్స్‌ను నకిలీవిగా జన్ సూరాజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిశోర్ అభివర్ణించారు. మరి బీహార్ ఓటరు తీర్పు ఎటు వైపు ఉంటుందో వేచిచూడాలి.

**విజయోత్సవ ర్యాలీలపై నిషేధం:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పాట్నాలో నవంబర్ 16 వరకు మోడల్ ప్రవర్తనా నియమావళి పొడిగించారు. విజయోత్సవ ర్యాలీల పై నిషేధం విధించారు. ఢిల్లీ పేలుడుతో అప్రమత్తమైన కేంద్ర ఎన్నికల సంఘం, బీహార్ అధికార యంత్రాంగం.. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

**8 అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలు కూడా:** ఆరు రాష్ట్రాలు, ఓ కేంద్ర పాలిత ప్రాంతంలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈనెల 11న జరిగిన పోలింగ్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు శుక్రవారం ఉదయం 8 గం.లకు ప్రారంభం కానుంది. జమ్మూకాశ్మీర్‌లోని బుద్గామ్, నగ్రోటా, అంటా(రాజస్థాన్), నుపాడ(ఒడిశా), జూబ్లీహిల్స్ (తెలంగాణ),

దంపా(మిజోరం) ఘట్‌శిల్ (జార్ఖండ్), టర్న్‌టరన్(పంజాబ్) నియోజక వర్గాల్లో ఓటర్లు ఇచ్చిన తీర్పు వెలువడనుంది.

అధికార పార్టీకి అనుకూలమా? ప్రతిపక్ష పార్టీకి అందలమా? అన్నది ఉదయం 10గంటలకల్లా తేలిపోనుంది.

## ఢిల్లీలో బస్సు పేలడంతో ఉద్రిక్తత



**న్యూఢిల్లీ, నవంబరు 13:** ఢిల్లీలోని రాడిసన్ హోటల్ వద్ద గురువారం ఉదయం ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించింది. దీంతో మరో పేలుడు జరిగిందని జనం వణికిపోయారు. ఓ మహిళ ఫోన్ చేయడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకున్నాయి. వాహనాల రాకపోకలను దారిమళ్లించి ఘటనా స్థలంలో క్షుణ్ణంగా పరిశోధించగా బస్ టైర్ పేలడం వల్లే భారీ శబ్దం వచ్చిందని తేలింది. దీంతో స్థానికులతో పాటు పోలీసులు కూడా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు మీడియాకు ఓ స్టేట్ మెంట్ విడుదల చేశారు. గురువారం ఉదయం ఓ మహిళ ఎమర్జెన్సీ నెంబర్ కు కాల్ చేసింది. తాను గురుగ్రామ్ వెళుతుండగా మహిపాల్ పూర్ ఏరియాలోని రాడిసన్ హోటల్ సమీపంలో పేలుడు శబ్దం వినిపించిందని తెలిపింది.

దీంతో తమ సిబ్బంది, ఫైర్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, అక్కడ ఎలాంటి అనుమానాస్పద ఘటన జరిగినట్లు కనిపించలేదని చెప్పారు. స్థానికులను, వాహనదారులను ఆరా తీయగా ఓ గార్డు అసలు విషయం వెల్లడించాడని తెలిపారు.

## సంపన్నుల సరదా.. రూ. కోట్లు ఇచ్చి మనుషుల వేట!



**సరాయెవో, నవంబరు 13:** యుద్ధంతో అల్లాడుతోన్న ప్రజలపై కనికరం చూపాల్సింది పోయి.. కొందరు సంపన్నులు అరాచకానికి పాల్పడ్డారు. సరదా కోసం భారీగా సొమ్ములు వెచ్చించి మరీ అమాయక పౌరులను వేటాడి చంపారు. దాదాపు మూడు దశాబ్దాల కిందట బోస్నియాలో చోటుచేసుకున్న ఈ నరమేధం తాజాగా బయటపడింది. దీంతో ఆ సంపన్నులపై ఇటలీ దర్యాప్తు చేపట్టింది. 1992-95 మధ్య బోస్నియాలో జరిగిన యుద్ధం.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపా చరిత్రలోనే అత్యంత హింసాత్మక సాయుధ ఘర్షణగా నిలిచింది. 1992 ఆరంభంలో బోస్నియా-హర్జెగోవినాను గణతంత్ర ప్రాంతంగా అంతర్జాతీయ సమాజం గుర్తించింది. దీన్ని వ్యతిరేకించిన 'బోస్నియా సెర్బ్‌'లు తన దళాలతో కలిసి బోస్నియా రాజధాని సరాయెవో నగరాన్ని ఆక్రమించి తమ నియంత్రణలోకి తీసుకున్నాయి. దాదాపు మూడేళ్లకు పైగా జరిగిన ఈ యుద్ధంలో 11 వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఈ యుద్ధం సమయంలో కొందరు ఇటలీ దేశస్థులు అత్యంత దారుణాలకు పాల్పడ్డారని తాజాగా పలు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. వీరు డబ్బులిచ్చి సరాజెవో వీధుల్లో పౌరులను కాల్చి చంపినట్లు పేర్కొన్నాయి. 'స్నైపర్ టూరిజం' పేరుతో జరిగిన ఈ అరాచకాన్ని బోస్నియా సెర్బ్‌ దళాలు వెనకుండి నడిపించాయని తెలిపాయి. ఇటలీకి చెందిన సంపన్నులను సరాజెవో చుట్టూ ఉన్న కొండల ప్రాంతాలకు ఈ దళాలే తరలించాయట. అక్కడ వీరు స్నైపర్ తుపాకులతో అమాయకులను వేటాడి చంపినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఇందుకోసం ఆ సంపన్నులు లక్ష యూరోల వరకు (దాదాపు రూ. కోటి) వరకు చెల్లించారట. మనిషి బట్టి ఈ వేటకు నిర్ణయించారని, చిన్నారులైతే ఎక్కువ మొత్తం ఇచ్చే వారిని ఆ కథనాలు వెల్లడించాయి. వృద్ధులను ఉచితంగా వేటాడేందుకు దళాలు అనుమతించాయని తెలిపాయి. బోస్నియా యుద్ధం సమయంలో విదేశీయులు స్నైపర్ టూరిజానికి పాల్పడినట్లు గతంలోనే అనేకసార్లు కథనాలు వచ్చాయి. దీంతో ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ ఎజియో గవాజెనీ కొన్నేళ్ల కిందట నివేదిక తయారుచేశారు. అయితే, అందుకు తగిన ఆధారాలు లేకపోవడంతో దాన్ని పక్కనబెట్టారు. ఈ క్రమంలోనే 2022లో స్లోవేనియా దర్శకుడు ఒకరు 'సరాయెవో సఫారీ' పేరుతో డాక్యుమెంటరీ చిత్రాన్ని విడుదల చేశారు. దీన్ని చూసిన తర్వాత ఎజియో గవాజెనీ మళ్లీ తన పరిశోధనలు ప్రారంభించారు. బోస్నియా సెర్బ్ మిలిటరీ అధికారి సహా పలువురి నుంచి వాంగ్మూలాలను సేకరించి వాటి ఆధారాలతో నివేదిక రూపొందించారు. దాన్ని ఇటలీ దర్యాప్తు అధికారులకు సమర్పించారు. ఆయన పెట్టిన కేసు ఆధారంగా తాజాగా దీనిపై మిలాన్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఈ కథనాలు ఇటలీలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

## సైన్యాధ్యక్షుడికే సర్వాధికారాలు

### పాక్‌లో సైనిక పెత్తనానికి చట్టబద్ధత

**ఇస్లామాబాద్, నవంబరు 13:** పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడికి అపరిమిత అధికారాలు కట్టబెడుతూ, అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు అధికారాలను పరిమితం చేస్తూ రూపొందించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు పాక్ పార్లమెంటు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం దేశంలో ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కొత్త చట్టం ప్రకారం ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌ను "చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్" అనే నూతన పదవిలో నియమించనున్నారు. ఈ హోదాతో ఆయనకు ఆర్మీతో పాటు నౌకాదళం, వాయుసేనపై కూడా పూర్తిస్థాయి అధికారాలు లభిస్తాయి. త్రివిధ దళాలపై సైన్యాధిపతికి అధికారికంగా కమాండ్ ఇవ్వడం ఇదే తొలిసారి. అలాగే ఈ చట్టంలోని నిబంధనలు మరింత వివాదాస్పదంగా మారాయి. పదవీ విరమణ పొందిన తర్వాత కూడా అసిమ్ మునీర్ తన ర్యాంకును కొనసాగిస్తారు. ఆయనకు జీవితకాలం పాటు చట్టపరమైన విచారణల నుంచి పూర్తిస్థాయి రక్షణ కల్పించనున్నారు.



## ప్రతి కాశ్మీరీ ఉగ్రవాదికాదు

**అందరినీ ఒకే కోణంలో చూడవద్దు**

**జమ్ముకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా**

**శ్రీనగర్, నవంబరు 13:** ఢిల్లీలో ఇటీవల జరిగిన బాంబు పేలుడు నేపథ్యంలో జమ్ము కాశ్మీరలోని కశ్మీరీ ముస్లింలపై వివక్ష చూపించే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి కశ్మీరీ ముస్లిం ఉగ్రవాది కాదని, ప్రజలందరినీ ఒకే కోణంలో చూడవద్దని ఆయన స్పష్టం చేశారు. కేవలం కొద్దిమంది చేసే తప్పులకు మొత్తం సమాజాన్ని నిందించడం సరికాదన్నారు. ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన పేలుడులో 13 మంది మరణించగా, అనేక మంది గాయపడిన సంగతి తెలిసిందే. ఈ దారుణ ఘటనను తీవ్రంగా ఖండించిన ఒమర్ అబ్దుల్లా, అమాయక ప్రజలను ఇంత క్రూరంగా చంపడాన్ని ఏ మతమూ సమర్థించదని అన్నారు. గురువారం జమ్మూలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మనం ఒక విషయం గుర్తుంచుకోవాలి. జమ్మూకశ్మీర్‌లోని ప్రతి పౌరుడూ ఉగ్రవాది కాదు, ఉగ్రవాదులతో సంబంధం ఉన్నవాడూ కాదు. శాంతి, సోదరభావాన్ని దెబ్బతీసేది కేవలం కొద్దిమంది మాత్రమే. మనం కశ్మీరీలందరినీ, ప్రతి కశ్మీరీ ముస్లింను ఉగ్రవాదిగా చూస్తే, ప్రజలను సరైన మార్గంలో నడిపించడం కష్టమవుతుందని ఒమర్ వివరించారు. ఈ పేలుడు వెనుక ఉన్న అసలైన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, విచారణ పేరుతో అమాయకులను వేధించవద్దని ఆయన డిమాండ్ చేశారు. ఉగ్రవాద ఘటనల్లో డాక్టర్లు వంటి చదువుకున్న వారు పట్టుబడటంపై అడిగిన ప్రశ్నకు ఒమర్ బదులిస్తూ, గతంలో మనం యూనివర్సిటీ ప్రొఫెసర్లను ఇలాంటి కేసుల్లో చూడలేదా? చదువుకున్న వారు ఇలాంటి పనుల్లో పాల్గొనరని ఎవరు చెప్పారు? వారు కూడా పాల్గొంటున్నారని అన్నారు.

## సంక్షిప్తంగా..

### మాదక ద్రవ్యాల నుంచి కాశ్మీర్‌కు విముక్తి కలగాలి: శ్రీశ్రీరవిశంకర్




**న్యూఢిల్లీ, నవంబర్ 13:** మాదక ద్రవ్యాల నుంచి కశ్మీర్ విముక్తి పొందేలా అందరూ కృషి చేయాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ అన్నారు. హింస లేని సమాజం, వ్యాధి లేని శరీరం, గందరగోళం లేని మనస్సు, దుఃఖం లేని ఆత్మ తన కల అని చెప్పారు. ఇవి ప్రతి ఒక్కరి జన్మహక్కు అన్నారు. ఈ నెల 11న జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ బక్షి స్టేడియంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ఎడ్యూ యూత్ డ్రగ్ ఫ్రీ కశ్మీర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 50 కళాశాలలు, 4 విశ్వవిద్యాలయాల నుంచి సుమారు 20వేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వారందరితో రవిశంకర్ మాదకద్రవ్య రహిత భవిష్యత్తు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాదకద్రవ్య రహిత భవిష్యత్తు ప్రతిజ్ఞ చేయించారు.

### బంగ్లాదేశ్‌లో మళ్లీ చెలరేగిన హింస



**ఢాకా, నవంబరు 13:** బంగ్లాదేశ్‌లో మరోసారి హింస చెలరేగింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినందుకు గానూ మాజీ ప్రధాని షేక్ హసీనాపై నమోదైన కేసుల విషయంలో ఈ నెల 17న తీర్పు వెలువడనుంది. ఈ తీర్పు రానున్న సమయంలో పలు చోట్ల దాడులు జరుగుతున్నాయి. గత పరిణామాలను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం రాజధాని నగరం ఢాకాలో భద్రత పెంచింది. మరీ ముఖ్యంగా తీర్పును వెలువరించే ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ఐసిటి) చుట్టూ సెక్యూరిటీని కట్టుదిట్టం చేశారు. హసీనా పార్టీ అవామీ లీగ్ ఢాకాలో లాక్‌డౌన్‌కు పిలుపునిచ్చింది. దాంతో గురువారం పోలీసులు, బోర్డర్ గార్డ్ సెక్యూరిటీని భారీ స్థాయిలో మోహరించారు. రాజధాని నగరంలోకి ప్రవేశించే మార్గాల వద్ద పలు చెక్ పాయింట్లను ఏర్పాటు చేసి, ముమ్మర తనిఖీలు చేస్తున్నారు.

### ఢిల్లీ పేలుళ్లకు మద్దతిస్తూ పోస్టులు! అసోంలో 15 మంది అరెస్టు



**గువాహతి, నవంబరు 13:** దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన కారు బాంబు పేలుళ్ల ఘటన దేశవ్యాప్తంగా విషాదం నింపగా, కొందరు మాత్రం దీనిపై పైశాచిక ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పేలుళ్లకు సంబంధించి సోషల్ మీడియాలో అనుచిత, అవమానకరమైన పోస్టులు పెట్టిన వారిపై అసోం ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. రాష్ట్రవ్యాప్తంగా 15 మందిని అరెస్టు చేసినట్లు ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్వయంగా వెల్లడించారు. ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన ఈ దుర్ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 20 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే.

ఈ విషాద ఘటనను కీర్తిస్తూ పోస్టులు పెట్టిన వారిపై అసోం పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఈ ఉదయం సీఎం హిమంత బిశ్వ శర్మ ఎక్స్ వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీ పేలుళ్లపై అవమానకరమైన పోస్టులు పెట్టినందుకు అసోంలో ఇప్పటివరకు 15 మందిని అరెస్టు చేశాం. నిన్న రాత్రి ఆరుగురిని అరెస్టు చేయడంతో ఈ సంఖ్య 15కి చేరిందని ఆయన తెలిపారు.

### మాస్కులు కూడా సరిపోని తీవ్రస్థాయిలో ఢిల్లీ కాలుష్యం

**న్యూఢిల్లీ,నవంబరు 13:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉంది. ఇప్పటికే గ్రాప్ 3 స్థాయిని దాటిపోవడంతో పగటిపూట 11 గంటలు దాటుతున్నా మంచుతో రోడ్లన్నీ తడిసిపోతున్నాయి. వాహనాల రాకపోకలు కూడా కనిపించనిస్థాయిలో ఓపక్క మంచుకురుస్తుంటే వాహన కాలుష్యం కూడా పెరిగిపోతోంది. ఈ నెల మొదటి వారంనుంచి కూడా రాజధాని నగరంలో వాయుకాలుష్యం తీవ్రస్థాయిలో పెరిగింది. పొరుగుననే ఉన్న హర్యానా, పంజాబ్‌సరిహద్దుల్లో రైతులు వరిదుబ్బులు కాల్చడంవల్లనే కాలుష్యం పెరుగుతోందని చెప్పినప్పటికీ వాహన కాలుష్యమే అధికంగా ఉందని తెలుస్తోంది. రాజధాని ప్రాంతంలో గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తోంది. కొన్ని రోజులుగా గాలి నాణ్యత సూచిక 400కిపైనే నమోదవుతోంది. దీంతో రాజధాని వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రతపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో వాయు కాలుష్య పరిస్థితిని చాలా తీవ్రమైనదిగా అభివర్ణించింది. వాయు కాలుష్య తీవ్రతకు మాస్కులు కూడా సరిపోవని వ్యాఖ్యానించింది.

# 43రోజుల షట్‌డౌన్ ముగింపు!

## ప్రభుత్వ ఫండింగ్ బిల్లుపై ట్రంప్ సంతకం



**వాషింగ్టన్, నవంబరు 13:** అగ్రరాజ్యం అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ముగిసింది. అమెరికా చరిత్రలోనే అత్యధికంగా 43 రోజుల పాటు కొనసాగిన ఈ షట్‌డౌన్‌కు ముగింపు పలుకుతూ.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం రాత్రి కీలకమైన ప్రభుత్వ ఫండింగ్ బిల్లుపై సంతకం చేశారు. రిపబ్లికన్ల ఆధ్వర్యంలో ఉన్న ప్రతినిధుల సభలో ఈ బిల్లుకు 222, 209 ఓట్ల తేడాతో ఆమోదం లభించిన కొద్ది గంటల్లోనే అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశారు. దీనికి మూడు రోజుల ముందే సెనేట్ కూడా ఆమోదముద్ర వేసింది. సుదీర్ఘ ప్రభుత్వ ప్రతిష్టంభన ముగియడంతో ట్రంప్ వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో రిపబ్లికన్ల సమక్షంలో మాట్లాడుతూ మేము ఎన్నటికీ బలవంతపు వసూళ్లకు లొంగిపోమనే స్పష్టమైన సందేశాన్ని పంపిస్తున్నామని వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రకటనతో అక్కడి రిపబ్లికన్ చట్టసభ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఫెడరల్ నిధులకు సంబంధించిన బిల్లుకు సెనేట్‌లో ఆమోదం దక్కకపోవడంతో సెప్టెంబర్ 30వ తేదీ అర్ధరాత్రి నుంచి ప్రభుత్వ షట్‌డౌన్ మొదలైంది. డెమొక్రాట్లు తమ వైఖరిని మార్చుకోకపోవడంతో రిపబ్లికన్లకు కంట్రోల్ ఉన్నా సెనేట్‌లో బిల్లును పాస్ చేయించుకోలేకపోయారు. దీంతో నిరవధికంగా ప్రభుత్వ షట్‌డౌన్ ప్రకటిస్తున్నట్లు వైట్‌హౌస్ తెలియజేసింది. ఈ రికార్డుస్థాయి షట్‌డౌన్ కారణంగా లక్షలాది మంది అమెరికన్ల జీవితాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. షట్‌డౌన్ సమయంలో జీతం లేకుండా పని చేసిన ఫెడరల్ ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొన్నారు. విమానయాన రంగంపై ప్రభావం తీవ్రంగా పడింది.

# కాళేశ్వరం పేరిట రూ.లక్షా 20వేల కోట్లు గోదాట్లో పోసిన బిఆర్ఎస్



గురువారం నిజామాబాద్‌లోని పాత కలెక్టరేట్ మైదానంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి సన్మానసభలో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

## 15 నెలల్లోనే రూ.21వేల కోట్ల రుణమాఫీ

### సుదర్శన్‌రెడ్డి సన్మానసభలో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** కాళేశ్వరం పేరుతో రూ.లక్షా ఇరువైవేల కోట్ల ప్రజాధనాన్ని గోదావరిలో పోసిన ఘనత బిఆర్ఎస్ పార్టీదైతే, తెలంగాణలో అధికారంలోకి రాగానే 15 మాసాల్లో రూ.21 వేల కోట్ల రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం నిజామాబాద్‌లోని పాత కలెక్టరేట్ మైదానంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సన్మాన సభలో టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లా డుతూ నిజామా బాద్ జిల్లాకు అనుభవ పూర్వకంగా ఆలోచన పరంగా సుదర్శన్ రెడ్డి పాత్ర పెద్దది అని కొనియాడారు. ప్రజల సమస్యలను సొంత సమస్యగా సుదర్శన్ రెడ్డి భావిస్తారని అన్నారు. సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ సలహాదారు మాత్రమే కాదు జిల్లాకు మంత్రిగా కూడా వ్యవహరిస్తారని తెలిపారు. ఏదైనా పని మొదలు పెడితే అకుంఠిత దీక్ష, పట్టుదలతో సుదర్శన్ రెడ్డి పూర్తి చేస్తారని మహేష్‌కుమార్ ప్రశం సించారు. సుదర్శన్ రెడ్డి వ్యాపారం, రాజకీయం పరంగా రాణించారు అదే విధంగా జిల్లా ను కూడా ముందకు నడిపారని అన్నారు. జిల్లాకు మెడికల్ కాలేజ్ రావడంలో సుదర్శన్ రెడ్డి పాత్ర కీలకం అని గుర్తుచేశారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా జిల్లాకు 21,22 పాళ్ల ప్యాకేజీలు తీసుకురావడంలో సుదర్శన్ రెడ్డి ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. కెనాల్ ఆధునికరణ, నిధులు తీసుకువచ్చిన ఘనత వారిదే అని చెప్పారు. ప్రాజెక్టుల ప్యాకేజీలను బిఆర్ఎస్ ప్రభుత్వం అటకెక్కించిందని ఆరోపించారు. ప్రజాధనాన్ని కేసీఆర్ దుర్వినియోగం చేశారని విమర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం చరిత్రాత్మకం అని ప్రశంసించారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే నిలబెట్టుకుంటుందని అన్నారు. జిల్లా ప్రజలుగా 35 ఏళ్ల గా ఇంజనీరింగ్ కళాశాల కోసం మనం నిరీక్షించామని నేను టిపిసిసి అధ్యక్షుడిగా అయిన ఏడాదిలో మంజూరు చేపించి తెరదించా అని చెప్పుకొచ్చారు. అగ్రికల్చర్ కళాశాల యూనివర్సిటీలో ఏర్పాటు కోసం కృషిచేశానని అనేక దశాబ్దాల స్వప్నం సాకారం చేయడానకి టిపిసిసి చీఫ్‌గా నేను ప్రయత్నం చేస్తున్నాని తెలిపారు. కరీంనగర్ ధర్మపురి,కొండగట్టు, వేములవాడ, లింబాద్రి గుట్ట నుంచి బాసర వరకు రూ.350 కోట్లతో రోడ్డు మంజూరు అయిందని పనులు కూడా జరుగుతున్నాయని ఆయన వివరించారు. కరీంనగర్ నుంచి నిజామాబాద్ వరకు నాలుగు వరుసల రోడ్డు సదుపాయం త్వరలో అందించబోతున్నామని అన్నారు. ఈ రోజే భీమ్గల్ లింబాద్రి గుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఆవరణలో టూరిజం గెస్ట్ హౌస్ నిర్మాణం కోసం రూ. 4 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం జీరో జారిసేసిందని ఆయన తెలి పారు. మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందరికి సముచిత స్థానం కల్పిస్తుంది ఈరోజు సుదర్శన్ రెడ్డికి ప్రభుత్వ సలహాదారు గా అవకాశం ఇచ్చినందుకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. జిల్లాను మరింత అభివృద్ధి చేసే అవకాశం ముఖ్యమంత్రి సుదర్శన్‌రెడ్డికి సలహాదారు నియమించడం ద్వారా మరింత సాధ్యమవుతుంది అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల పార్టీ పేద ప్రజల కోసం ఎన్నెన్నో పథకాలను తీసుకువచ్చింది పేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్ల ద్వారా పూర్తిచేశామని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చి పేదలకు సన్నబియ్యం అందిస్తున్నామనీ, రూ. 500కే గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను అందిస్తున్నామని సంక్షేమపథకాల చిట్టాను వివరించారు. రైతు రుణమాఫీ చేసాం రైతు భరోసా అందిస్తున్నాం గతంకంటె మెరుగుగా ఇస్తున్నామని తెలిపారు. యువతకు 60,000 ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ అందిస్తున్నమనీ అన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఇంటర్గ్రిగ్రేటెడ్ రెసిడెన్సి స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు

# పంట కొనుగోళ్లలో సడలింపులు ఇవ్వాలి

### కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ

**హైదరబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** ఇటీవల రాష్ట్రంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటల కొనుగోలు విషయంలో నిబంధనలు సడలించాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం కేంద్రానికి లేఖ రాసినట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. రాష్ట్రంలో ప్రధానంగా పత్తి, సోయాబీన్, మొక్కజొన్న పంటల కొనుగోళ్లలో ఏర్పడుతున్న సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపింది. కేంద్ర ప్రభుత్వం సేకరించే సోయాబీన్, పత్తి పంటల విషయంలో ప్రత్యేక సడలింపులు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో 3,66,697 ఎకరాల్లో సోయాబీన్ సాగు కాగా, సగటు దిగుబడి ఎకరాకు 7.62 క్వింటాళ్లుగా అంచనా వేసినట్టు చెప్పారు. కోత సమయంలో కురిసిన అకాల వర్షాల వల్ల పంటకు తీవ్రమైన నష్టం వాటిల్లిందన్నారు. ఫలితంగా గింజల్లో రంగు మారడం, ముడతలు పడటం వంటి వాటితో కొనుగోళ్లలో ప్రమాణాలు రావడం లేదని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సోయాబీన్‌పై నిబంధనలు సడలించాలన్నారు. అలాగే 6.74 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగుకాగా, సగటున దాదాపు 16.85 లక్షల టన్నుల దిగుబడి వస్తుందన్నారు. దీంతో రూ.2,400 ఉన్న మద్దతు ధర రూ.1,959కు పడిపోయిందని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమే ఇప్పటి వరకూ 48,757 టన్నులను కొనుగోలు చేసిందన్నారు. అలాగే పత్తి కొనుగోలులో ఎకరాకు 7 క్వింటాళ్ల పరిమితి నిర్ణయం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని తెలిపారు. ఇప్పటికే స్పాట్ బుకింగ్ విధానంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వర్షాలతో దెబ్బతిన్న పత్తికి ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా తేమ శాతాన్ని సడలించాలని, ఎకరాకు 11.74 క్వింటాళ్ల మేర కొనుగోలు కొనసాగించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

# నేడు జాతీయ బాలల దినోత్సవం.. సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 13:** స్వాతంత్ర్య సమర యోధుడు, దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి (నవంబరు 14) సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆ మహ నీయుడిని స్మరించుకున్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ బాలల దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని బాలబాలికలందరికీ ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. బాలలను జాతి సంపదగా భావించి వారి మెరుగైన భవితవ్యానికి కృషి చేయాలన్న నెహ్రూ ఆకాంక్షల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులన్న నెహ్రూ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం పాఠశాల విద్యా రంగంలో మెరుగైన మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. చదువుతోనే బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి సాధ్యమని విద్యా రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభు త్వం పని చేస్తోందన్నారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.

## చిన్నారులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ శుభాకాంక్షలు

**హైదరబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నవంబర్ 14న నిర్వహించే జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని బాలబాలికలకు ఎస్సీ,ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

పిల్లలు నిష్కలమైన మనస్సు, మృదుస్వభాం సంతోషంతో నిండి వుంటారని.. వారి నవ్వులు ఆ ఇంటి వెలుగు, అలాగే వారి ఆలోచనలు దేశ భవిష్యత్తని మంత్రి అన్నారు. ప్రతి చిన్నారి సురక్షితమైన వాతావరణంలో ఎదగాలని, పాఠశాలలు పిల్లల ప్రతిభను వెలికితీసే వేదికలుగా మారాలని ఆకాంక్షించారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని ఆధునిక దిశగా తీసుకెళ్తూ, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, ప్రతి తల్లిదండ్రి హృదయంలో వారు కలలుగన్న ఆశను సుసాధ్యం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో.. తమ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

# ఎస్ఎస్‌సి పరీక్ష ఫీజు గడువు 20వ తేదీకి పెంపు

### అపరాధ రుసుంతో డిసెంబరు 29 వరకు అవకాశం

**హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరంలో 10వ తరగతి లో చేరిన విద్యార్థులకి సంబంధించి వచ్చే యేడాది (2026) మార్చిలో జరగనున్న వార్షిక పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపు గడువు గురువారంతో ముగిసిన నేపథ్యంలో గడువును కాస్త పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 20 వరకు స్వీకరించనున్నట్టు ప్రభుత్వ పరీక్షల డైరక్టర్ పివి శ్రీహరి ప్రకటనలో తెలిపారు. మొదట ప్రకటించినట్టుగా పరీక్ష ఫీజును అక్టోబరు 30 నుంచి గురువారం(నవంబరు 13) వరకు అపరాధ రుసుం లేకుండా ఫీజును స్వీకరించనున్నట్టు ప్రకటించారు.

గురువారంతో గడువు ముగిసిన నేపథ్యంలో ఈ నెల 20 వరకు అపరాధ రుసుం లేకుండా స్వీకరించనున్నట్టు ప్రకటించారు. అపరాధ రుసుంతో డిసెంబరు 29 వరకు స్వీకరించనున్నారు. అపరాధ రుసుం రూ. 50తో ఈ నెల 21 నుంచి 29 వరకు, రూ. 200తో డిసెంబరు 2 నుంచి 11 వరకు, అపరాధ రుసుం రూ. 500తో డిసెంబరు 15 నుంచి 29 వరకు స్వీకరించనున్నారు. అన్ని సబ్జెక్టులకు రూ. 125 ఫీజుగా నిర్ణయించారు.

# విత్తన నాణ్యతపై శిక్షణ

### సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్ కేశవులు

**హైదరబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** విత్తన నాణ్యతపై దృష్టిసారించాలని తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ కేశవులు సూచించారు. విత్తన సంస్థలతోపాటు, రైతుల్లోనూ అవగాహన అవసరమని తెలిపారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ, అంతర్జాతీయ విత్తన పరీక్ష కేంద్రం(టీఐఎస్‌టీఏ) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విత్తన నాణ్యత భరోసా, ఇస్టా గుర్తింపుపై మూడు రోజుల పాటు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ, ప్రయివేటు విత్తన రంగ సంస్థ ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణను ఇచ్చినట్లు ఈ సందర్భంగా కేశవులు తెలిపారు. ఇందులో ముఖ్యంగా, విత్తన నమూనాల సేకరణ, అధునాతన విత్తన పరీక్ష పద్ధతులు, అంతర్జాతీయ విత్తన పరీక్ష ప్రమాణాల సంస్థ గుర్తింపు పొందేందుకు పాటించాల్సిన నియమ నిబంధనలపై శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. అంతేకాకుండా విత్తనాల నమూనాల సేకరణపై ప్రత్యేకమైన ప్రాక్టికల్ సెషన్స్ నిర్వహించినట్లు వివరించారు. అంతేకాకుండా విదేశాలకు విత్తన ఎగుమతులు చేయడానికి కావాల్సిన ఆరంజ్ అంతర్జాతీయ విత్తన ఎగుమతి ఈసర్టిఫికెట్ల జారీపై స్విట్జర్లాండ్ ప్రతినిధులతో ప్రత్యేక వెబినార్ నిర్వహించారు. ఈ మూడు రోజుల శిక్షణా, అవగాహనా కార్యక్రమాల్లో తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ, ఉద్యాన యూనివర్సిటీ అధికారులతో పాటు, వ్యవసాయ శాఖ నుంచి అధికారులు, ప్రయివేటు విత్తన కంపెనీల నుంచి మొత్తం 30 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో ఇస్టా విత్తన పరీక్ష సలహాదారులు జీవీ.జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌రహిత్న వర్సిటీ లక్ష్యం.. బిస్లెరీతో ఒప్పందం

### ఉద్యాన విశ్వవిద్యాలయ విసి డాక్టర్ రాజరెడ్డి

**హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా చేయాలనే లక్ష్యంతో ముందడుగు వేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ హార్టికల్చల్ యూనివర్సిటీ (ఎస్‌కేఎల్‌టీజీహెచ్‌యూ) బిస్లరీ సంస్థల మధ్య కీలకమైన ఒప్పందంపై కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బాటిల్స్ ఫర్ ఛేంజ్ అనే సామాజిక బాధ్యత కార్యక్రమాన్ని అమలు చేయడానికి ఈ ఒప్పందం కుదిరింది. అందులో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులు, సిబ్బందిలో సామాజిక స్పృహను పెంపొందించడం, ప్లాస్టిక్‌ను బాధ్యతాయుతంగా పారవేసి రీసైక్లింగ్ చేసేలా అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల నిర్వహణ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండ రాజరెడ్డి తెలిపారు. బాటిల్స్ ఫర్ ఛేంజ్ కార్యక్రమం ప్లాస్టిక్‌ను కేవలం వ్యర్థంగా కాకుండా, రీసైక్లింగ్‌కు ఉపయోగపడే విలువైన వనరుగా గుర్తించాలన్నారు. ఈ ఒప్పందం కింద యూనివర్సిటీ ఉపయోగించిన ప్లాస్టిక్‌ను ప్రాంగణం నుంచే వేరు చేసి, శుభ్రంగా రీసైక్లింగ్‌కు పంపడం జరుగుతుందన్నారు. తద్వారా ప్లాస్టిక్ పారవేసే అలవాట్లలో మార్పు తీసుకురావాలని ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తుందని తెలిపారు. బిస్లరీ సంస్థ తమ వంతు బాధ్యతగా, ప్రాంగణంలోని విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, హౌస్‌కీపింగ్ సిబ్బందికి ప్లాస్టిక్ నిర్వహణపై తగిన శిక్షణను అందిస్తుందన్నారు. అలాగే, సేకరించిన ప్లాస్టిక్ మొత్తాన్ని తమ అధీకృత రీసైక్లింగ్ భాగస్వాముల ద్వారా నేరుగా రీసైక్లింగ్ కేంద్రాలకు చేరేలా చూస్తుందని తెలిపారు. సేకరించిన ప్లాస్టిక్ వివరాలను, వాటిపై సర్టిఫికెట్లను యూనివర్సిటీకి అందజేస్తుందన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా క్యాంపస్‌లో పర్యావరణ పరిరక్షణకు, స్థిరమైన వ్యర్థాల నిర్వహణకు బలమైన పునాది పడినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. భగవాన్, బిస్లరీ సంస్థ డైరెక్టర్ కె.గణేష్, డీన్ ఆఫ్ హార్టికల్చర్, డీన్ ఆఫ్ స్టూడెం ట్ అఫైర్స్ డాక్టర్. జె. చీనా నాయక్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్. డి. లక్ష్మీ మినారాయణ తదితరులు పాల్గొన్నారు.



రిజర్వేషన్ల సాధన కోసం భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో నీల వెంకటేష్, రాజ్‌కుమార్ తదితరులు

# రిజర్వేషన్లను అడ్డుకుంటే యుద్ధమే

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** బిసిలకు స్థానిక సంస్థలతో పాటు విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లను అడ్డుకుంటే యుద్ధమే జరుగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు చట్టబద్దంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం హైదరాబాద్,బర్కత్‌పురలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో బిసి సంఘాల నేతలు సి.రాజేందర్, టి.రాజ్‌కుమార్, పగిళ్ల సతీష్ శివయాదవ్, వంశీకృష్ణ, భీమ్‌రాజ్, బాణాల అజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా బీసీల ఉద్యమం జోరందుకుందని, బీసీ సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ సంఘాలు, ఓయూలో విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో దీక్షలు జరుగుతున్నాయని, ఇక న్యాయవాదుల బీసీల న్యాయ దీక జరుగుతుందని, సకల జనుల సమ్మె తరహాలో మహాఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో చట్టబద్ధంగానే 42 రిజర్వేషన్లు అమలు చేయాలని, పార్టీల పరంగా ఇచ్చి చేతులు దులుపుకుంటే సహించేది లేదన్నారు.

# ఆదేశాలు అమలు చేయకుంటే విచారణకు హాజరుకావాలి

### ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** చేప పిల్లలు పంపిణీకి సంబంధించి ఇచ్చిన ఆదేశా లను అధికారులు అమలు చేయకపోవడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. చేప పిల్లలను పంపిణీ చేసిన వారికి నగదు చెల్లించాలంటూ గతంలో తామిచ్చిన ఆదేశాలను అమలు చేయకపోతే కోర్టు విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శికి హైకోర్టు ధర్మాసనం తేల్చి చెప్పింది. తమ ఆదేశాలు అమలు చేస్తారా? లేక కోర్టుకు హాజరవుతారా? అని ప్రశ్నించింది. ఈ కేసులో ఫిబ్రవరిలోనే ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎందుకు అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేసింది. చివరిసారిగా నాలుగు వారాలు గడువు ఇస్తున్నట్టు ప్రకటించింది. తదుపరి విచారణను డిసెంబర్ 5కు వాయిదా వేసింది. కాగా 2023-24 సంవత్సరానికి తాము అందజేసిన చేప పిల్లలను సరఫరా చేసిన సందర్భంలో తమకు నగదు చెల్లింపులో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారంటూ ఫిషరీస్ ట్రేడర్స్ అండ్ సీడ్ సప్లయర్స్ వేర్వేరుగా పిటిషన్లు వేశారు. వీటిని జస్టిస్ కాజ శరత్ ధర్మాసనం విచారించి ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది.

# కెజిబివి విద్యార్థుల ప్లేగ్రౌండ్ కోసం కృషి

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### కొక్కిరేణిలో రూ. 7.21 కోట్లతో అభివృద్ధి పనులు

**తిరుమలాయపాలెం, నవంబరు 13, ప్రభాతవార్త:** భావితరాలకు మనం అందించే అధిక ఆస్తి విద్య మాత్రమేనని, దానికోసం ప్రభుత్వం ఎంతైనా ఖర్చు పెడుతుం దని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్య పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం మండలంలో మంత్రి పర్యటించి కొక్కిరేణి గ్రామంలో 3 కోట్ల లక్షలతో తిరుమలాయపాలెం నుండి పోచారం రోడ్డు స్లాబు కల్వర్టు నిర్మాణ పనులకు, తిరుమలాయపాలెం గ్రామంలో 61 లక్షలతో చేపట్టిన కెజిబివి భవన మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, కేజీబీవీ తిరుమలాయపాలెం మరమ్మత్తు పనులకు 61 లక్షల రూపాయలు మంజూరు చేసుకున్నామని, డైనింగ్ హాల్, గ్రిల్, దోమల తెర, మొదలగు మరమ్మతు పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చూడాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. తిరుమలాయపాలెంలో ఐటిఐ ప్రభుత్వం మంజూరు చేసిందని, దానిని మెయిన్ రోడ్డు వద్ద షిఫ్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని అక్కడ భూమి దొరికితే, ఇక్కడ ఖాళీగా ఉండే మూడు ఎకరాలు కేజీబీవీ ప్లే గ్రౌండ్ కోసం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చిన్నారుల బాధలు గమనించి 40 శాతం డైట్ చార్జీలు,200 శాతం కాస్మొటిక్స్ చార్జిల పెంచడం జరిగిందని అన్నారు. భావితరాలకు అందించే ఆస్తిగా పరిగణించి విద్య, వైద్యం రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. 22 నెలల కాలంలో కొక్కిరేణి గ్రామంలో అభివృద్ధి పనులకు 7 కోట్ల 21 లక్షల రూపాయలు మంజూరు చేసిందని అన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, పాలేరు నియోజకవర్గంలోని విద్యార్థులు మంత్రి ద్వారా, పి.ఎస్.ఆర్. ట్రస్టు ద్వారా రెండు రకాలుగా లాభపడుతున్నారని అన్నారు. ప్రభుత్వం తరపున ఇవ్వలేని కార్యక్రమా లను కూడా పి.ఎస్.ఆర్. ట్రస్టు ద్వారా సహాయం అందిస్తున్నారని అన్నారు.విద్యార్థులు ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ బాగా చదువుకొని ఎదిగి గొప్పస్థాయికి చేరుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. కేజీబీవీలలో 10వ తరగతి లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల అద నపు కలెక్టర్ సిబ్బందిని అభినందిస్తూ ఇంటర్ విద్యార్థులలో కూడా ఉత్తీర్ణత పెరగాలని, నీట్, జెఇఇ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించి అత్యుత్తమైన సంస్థలలో సీటు సంపాదించాలన్నారు.

## దామగుండం రాడార్ స్టేషన్ ప్రాజెక్ట్..

# అదనపు కౌంటర్ దాఖలు చేయండి

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 13:** వికారాబాద్ జిల్లా దామగుండం లో ఇఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ విషయంలో పూర్తి వివరాలతో అద నపు కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశించింది. దామగుండం అటవీ ప్రాంతంలో ఈఎల్ఎఫ్ రాడార్ ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దామగుండం అటవీ పరిరక్షణ జేఏసీ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై గురువారం హైకోర్టు విచారించింది. ఈఎల్ఎఫ్ రాడార్ తో జీవవైవిధ్యం, ఔషధ మొక్కలు దెబ్బతింటాయని పిటిషనర్లు విచారణ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాఖలు చేసిన కౌంటర్లో పూర్తి వివరాలు లేవని పిటిషనర్లు వాదించారు. వాదనలు విన్న న్యాయస్థానం అదనపు కౌంటర్ దాఖలుకు సమయమిస్తూ విచారణను వాయిదా వేసింది.

# వ్యవసాయ రుణాలపై మెగా మేళా

### సెంట్రల్ బ్యాంక్ డిప్యూటీ జోనల్ హెడ్ ప్రసాద్


**హైదరబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** వ్యవసాయ రుణాలకు సంబంధించి రైతాంగానికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. రైతాంగానికి మెగా వ్యవసాయ రుణాలపై (అగ్రికల్చర్ లోన్ ప్రోగ్రాం) అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సెంట్రల్ బ్యాంక్ హైదరాబాద్ జోన్ డిప్యూటీ జోనల్ హెడ్ ఎంవీఎస్ ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ రుణాల మంజూరు విషయంలో రైతాంగానికి సహాయ, సహకారాలను అందించడంలో భాగంగా జరుగుతున్న ఈ మెగా క్యాంప్ కార్యక్రమం తెలంగాణతో పాటు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల లోని అన్ని శాఖల్లోనూ నిర్వహించనున్నట్లు వెల్లడించారు, ఈ అవగాహన కార్యక్రమంలో అర్హులైన రైతులు, వ్యవసాయాధారిత వ్యాపారులకు వివిధ రుణాలు, వివిధ వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి తక్షణమే రుణ మంజూరు పత్రాలు జారీ చేస్తామన్నారు. రైతులు, వ్యవసాయాధారిత వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం సమీపంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచీలను సంప్రదించాలని తెలిపారు. మరింత అదనపు సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800 3030 కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు.

# ఎవరెస్ట్ గిరిపుత్రిక మలావత్ పూర్ణకు మాజీ మంత్రి కెటిఆర్ పరామర్శ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 13:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కెటిఆర్ ఎవరెస్ట్ అధిరోహకురాలు మలావత్ పూర్ణకు గురువారం ఫోన్ చేసి మాట్లాడారు. అతి చిన్నవయసులో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి గిరి పుత్రికగా పేరు తెచ్చుకున్న మలావత్ పూర్ణ తండ్రి దేవీదాస్ కన్నుమూయడంతో, కేటీఆర్ ఆమెను ఓదార్చారు. కేటీఆర్ ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఎన్నికల బిజీలో ఉన్నప్పటికీ, ఈ విషాదవార్త తెలుసుకుని వెంటనే నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం, పాకాల గ్రామంలో ఉన్న పూర్ణకు కాల్ చేశారు. పూర్ణ తండ్రి మరణం పట్ల ఆయన తీవ్రవిచారం వ్యక్తం చేశారు. పూర్ణకు ధైర్యం చెప్పిన కేటీఆర్, త్వర లోనే స్వయంగా వచ్చి ఆమె కుటుంబాన్ని కలవనున్నట్లు హామీ ఇచ్చారు.

# రిజర్వేషన్లు సాధించే వరకు పోరాడదాం

### ధర్మపోరాట దీక్షలో బిసి నేతల పిలుపు



ధర్మదీక్షలో నినాదాలు చేస్తున్న బిసి నేతలు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), నవంబరు 13, ప్రభాతవార్త:** 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు పోరాడుదామని పలువురు బీసీ నేతలు పిలుపునిచ్చారు. గురువారం బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో బీసీల ధర్మ పోరాట దీక్ష చేపట్టారు. బీసీ జేఏసీ వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుల కుల్కచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ దీక్షా కార్యక్రమానికి హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, ప్రొఫెసర్ కోదండ రామ్, మాజీ ఎంపీ మధుయాష్కీ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎల్. రమణ, ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్, బీసీ జేఏసీ కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, కుల సంఘాల జేఏసీ నేత గణేష్‌చారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని చేస్తున్న పోరాటం న్యాయ మైనదని, రిజర్వేషన్లు సాధించు కోవటానికై కులాలను పక్కకు పెట్టి, అందరం బీసీలుగా పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ నెల 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఢిల్లీ జంతర్ మంతర్‌వద్ద జరగబోయే ధర్నాకు బీసీ నేతలు కలసి రావాలని కోరారు.

హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ బీసీలలో చైతన్యం నేటికి వచ్చిందని, ఇదే చైతన్యంతో కులాలకు అతీతంగా, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో బీసీ రిజర్వేషన్లకై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి మనిషి సమానత్వం సాధించాలంటే రిజర్వేషన్లు కావాలని, బీసీ రిజర్వేషన్లకై చేస్తున్న పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

మధుసూదనాచారి మాట్లాడుతూ ప్రజలు కోరుకునే డిమాండ్‌లో న్యాయం ఉందాలేదా అనే విషయాన్ని ప్రభుత్వాలు ఆలోచించాలన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు తిరగబడతారని హెచ్చరించారు. ఎల్. రమణ మాట్లాడుతూ రాజకీయ పార్టీల జెండాలు పక్కకు పెట్టి, బీసీలంతా ఏకమై బీసీ జెండాను ఎత్తుకోవాలని పిలుపునిచ్చారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 42శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని, లేనిపక్షం బీసీలను నమ్మించి, గొంతు కోసినట్లు అవుతుందన్నారు. దీక్షా కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు కనకాల శ్యాం, శేఖర్, సాగర్, మణి మంజరి, నందగోపాల్, వేముల రామకృష్ణతో పాటు వివిధ బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఫార్మసీ పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం సానుకూలత

### సర్కారుకు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య కృతజ్ఞతలు

**హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 3 నుంచి ప్రైవేటు కాలేజీల నిరవధిక బంద్ నేపథ్యంలో నిర్వహించిన ఫార్మసీ పరీక్షలను తిరిగి నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. తెలంగాణ ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య(ఫాతి) విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం సానుకూల నిర్ణ యం తీసుకుంది. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంపై ఫాతి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. గురువారం ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య(ఫాతి) కార్యవర్గ సభ్యులు, ఫార్మసీ కళాశాలల సంఘం సభ్యులు విద్యా శాఖ కార్యదర్శి శ్రీదేవసేనను తన కార్యాలయంలో కలిసి విజ్ఞాపన పత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన దేవసేన తన కార్యాలయానికి జెఎన్‌టియు రెక్టార్, రిజిస్ట్రార్, ఇతర అధికారులను పిలిపించి పరీక్షల నిర్వహణపై సమీక్ష జరిపారు. రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్‌షిప్ బకాయిలపై ఈ నెల 3వ తేదీ నుంచి ఐదు రోజులపాటు ఇంజనీరింగ్, ఫార్మసీ, బి ఎడ్, లా, ఎంబిఎ, నర్సింగ్ తదితర కళాశాలలన్నింటిని మూసివేసిన విషయం తెలిసిందే.

ఈ సమయంలో ఈ నెల 4వ తేదీన, 6వతేదీన జెఎన్‌టియు నిర్వహించిన అనాటమీ, కెమిస్ట్రీ ఫార్మసీ పరీక్షలను ఏడు వేల మందికి పైగా విద్యార్థులు రాయలేక పోయారు. రాష్ట్ర ప్రభుత్వ హామీతో తిరిగి 8వ తేదీ నుంచి కళాశాలలను ప్రారంభించారు. ఈ సమ్మె కారణంగా వాయిదా పడిన రెండు ఫార్మసీ పరీక్షలను నిర్వహించేలా చూడాలని దేవసేన అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణపై త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని శ్రీదేవసేన ఫాతి కార్యవర్గ సభ్యులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రుల పక్షాన విద్యా శాఖ కార్యదర్శి శ్రీదేవసేనకు ఫాతి కృతజ్ఞతలు తెలిపింది.

## స్టాక్ ట్రేడింగ్ యాప్ పేరుతో

# సైబర్ దోపిడీ

### సీనియర్ లాయర్ నుంచి రూ.10 కోట్లు కొట్టేశారు

**ముంబై, నవంబరు 13 :** ఓ ప్రముఖ బహుళజాతి సంస్థలో ఉన్నతస్థాయి అధికారిగా పనిచేసి రిటైర్డ్ అయిన 65 యేళ్ల న్యాయవాది సైబర్ నేరస్థుల చేతిలో మోసపోయాడు. స్టాక్ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టమని న్యాయవాదిని జూన్‌లో ఓ మహిళ ఫోన్ ద్వారా సంప్రదించింది. ప్రఖ్యాత స్టాక్ బ్రోకరేజ్ ప్రతినిధిగా పరిచయం చేసుకుని స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో ప్రధానంగా ఐపిఓలపై దృష్టి సారించిన అనేక వాట్సాప్ గ్రూపుల్లో చేరమని కోరింది. ఆ మేరకు పలుమార్లు ఫోన్ ద్వారా సదరు న్యాయవాదితో సంప్రదింపులు జరిపి స్టాక్ ట్రేడింగ్ యాప్‌లో చేర్పించింది. ఆ యాప్ ద్వారా పలుమార్లు దాదాపు రూ.9.94 కోట్లు బదిలీ చేశాడు. యాప్ అధిక రాబడిని సూచించినప్పటికీ నిధులు ఉపసంహరించుకోవడానికి వీలుకాలేదు. పలుమార్లు బ్యాంకుకు వెళ్లి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మోసపోయానని గుర్తించి బాధిత న్యాయవాది పోలీసులను సంప్రదించాడు. ముంబైలోని శివాజీనగర్ సైబర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



# నవాలేపూల్ సమీపంలో ఘోర ప్రమాదం

### 25 వాహనాలను ఢీకొట్టిన కంటైనర్

### 8 మంది మృతి, 20 మందికి గాయాలు

**పుణె, నవంబరు 13:** మహారాష్ట్రలో నవంబరు 13 గురువారం సాయంత్రం ఘోర ప్రమాదం సంభవించింది. పుణేలోని నవాలే పూల్ ప్రాంతంలో కంటెయినర్ అదుపుతప్పి వాహనాలపై దూసుకెళ్లింది. వేగంగా వెళ్తున్న కంటెయినర్ బ్రేక్ విఫలం కావడంతో ముందున్న 20 నుంచి 25 వాహనాలను ఢీకొట్టింది. ముందు ఒక కారును ఢీకొట్టగా అది మరో కంటైనర్ మధ్య ఇరుక్కుపోయి నుజ్జునుజ్జు అయింది. దీంతో సీఎన్జీ కారు మంటల్లో చిక్కుకుంది. ప్రమాదంలో 8 మంది మరణించగా, 20 మంది గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం సతారా నుంచి ముంబైవైపు వెళ్తున్న కంటైనర్ అనేక వాహనాలను ఢీకొట్టింది. తొలుత కారును ఢీకొట్టగా ముందున మరో కంటైనర్ ఉండటంతో మధ్యలో ఇరుక్కుపోయింది. కారులోని సిఎన్‌జీ సిలిండర్ పేలి మంటలు చెలరేగాయి. దీంతో వెనుక కంటైనర్ కూడా మంటల్లో చిక్కుకుంది. కారులోపల ఉన్న ఐదుగురు, కంటైనర్‌లోని ఇద్దరు సహా 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి మృతదేహాలను కారు నుంచి బయటకు తీశారు. ఈ ప్రమాదంలో 20 మంది గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని చికిత్స కోసం వివిధ ఆసుపత్రుల్లో చేర్పించారు. నవాలే వంతెనపై సెల్ఫీ పాయింట్ ఉన్న ప్రాంతంలో ఈ ట్రక్కు బ్రేకులు ఫెయిలై వాహనాలపైకి దూసుకెళ్లిందని అధికారులు తెలిపారు. ప్రమాద స్థలిలో తొక్కిసలాట చోటుచేసుకుంటున్న జరుగుతోన్న ప్రచారాన్ని డీసీపీ సంభాజీ కదమ్ తోసిపుచ్చారు. ప్రస్తుతం వాహనాల్లో చిక్కుకున్న వారిని రక్షించడమే ప్రాధాన్యత.. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తున్నాం, మృతదేహాలను బయటకు తీస్తున్నాం మంటలు అదుపులోకి వచ్చాయి. రెండు పెద్ద వాహనాలను తొలగించడానికి క్రేన్లను రప్పించాం ఈ ప్రమాదం వెనుక గల కారణాలను తరువాత పరిశీలిస్తామని డీసీపీ వివరించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని ఆయన తెలిపారు. బ్రేక్ విఫలమైందా నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందా? అనేది విచారణలో తెలుస్తుందని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ అయి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఘటనకు సంబంధించిన వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి.

# పరీక్షలు చేసుకున్న ప్రతి ఇద్దరిలో ఒకరికి మధుమేహం

**న్యూఢిల్లీ, నవంబరు 13:** భారత్‌లో డయాబెటిస్ (మధుమేహం), ప్రీడయాబెటిస్ కేసులు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయని సమగ్ర సర్వేలో తేలింది. దేశవ్యాప్తంగా పరీక్షలు చేయించుకున్న ప్రతి ఇద్దరిలో ఒకరి రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉన్నట్టు తాజా నివేదిక వెల్లడించింది. ప్రముఖ హెల్త్‌కేర్ సంస్థ ఫార్మ్‌ఈజీ "డయాబెటిస్: ది సైలెంట్ కిల్లర్ స్వీపింగ్ అక్రాస్ ఇండియా" పేరుతో ఈ నివేదికను విడుదల చేసింది. 2021 నుంచి 2025 మధ్యకాలంలో సేకరించిన 40 లక్షలకు పైగా డయాగ్నస్టిక్ రిపోర్టులు, 1.9 కోట్ల మెడిసిన్ ఆర్డర్లను విశ్లేషించి దీన్ని రూపొందించారు. పరీక్ష చేయించుకున్న వారిలో ప్రతి ముగ్గురిలో ఒకరు డయాబెటిస్ బారిన పడగా, ప్రతి నలుగురిలో ఒకరికి ప్రీడయాబెటిస్ లక్షణాలు ఉన్నట్లు తేలింది. ఒకప్పుడు వృద్ధుల వ్యాధిగా పరిగణించిన డయాబెటిస్, ఇప్పుడు యువతను కూడా వేధిస్తోంది. 30 ఏళ్లలోపు వారిలోనూ అధిక రక్తంలో చక్కెర స్థాయిలు కనిపిస్తుండగా, 30 ఏళ్లు దాటిన తర్వాత ఈ ముప్పు గణనీయంగా పెరుగుతోందని నివేదిక హెచ్చరించింది. 60 ఏళ్లు పైబడిన వారిలో అయితే, ప్రతి 10 మందిలో 8 మంది డయాబెటిస్ లేదా ప్రీడయాబెటిస్‌తో బాధపడుతున్నారు.

పురుషుల్లో (51.9 శాతం) మహిళలల్లో (45.43 శాతం) కంటే ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ముఖ్యంగా పుదుచ్చేరి (63 శాతం), ఒడిశా (61 శాతం), తమిళనాడు (56 శాతం) వంటి దక్షిణాది, తీర ప్రాంత రాష్ట్రాల్లో కేసులు అధికంగా నమోదయ్యాయి. డయాబెటిస్ కేవలం రక్తంలో చక్కెర స్థాయిలకే పరిమితం కాదని, ఇది ఇతర అవయవాలపైనా తీవ్ర ప్రభావం చూపుతోందని నివేదిక స్పష్టం చేసింది. డయాబెటిస్ ఉన్నవారిలో ప్రతి ముగ్గురిలో ఒకరికి కాలేయ సమస్యలు, దాదాపు సగం మందికి కిడ్నీ సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. అయితే, సరైన జీవనశైలి, మందులతో దీన్ని నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆరు నెలల్లోపు మళ్లీ పరీక్షలు చేయించుకున్న వారిలో 22 శాతం మంది సాధారణ స్థాయికి రావడం ఇందుకు నిదర్శనం. ప్రజలు అప్రమత్తంగా ఉండి, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# యుఎస్‌ను మరింత ధనికదేశంగా మార్చిన టారిఫ్‌లు

### తన విధానాలను సమర్థించుకున్న డొనాల్డ్‌ట్రంప్

**న్యూయార్కు, నవంబరు 13:** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సుంకాల విధానాన్ని మరోసారి తీవ్రంగా సమర్థించుకున్నారు. టారిఫ్‌లు అమెరికాను అత్యంత ధనికమైన, ఎక్కువగా గౌరవించబడే దేశంగా మార్చాయని ఆయన ప్రకటించారు. తన విధానాలను వ్యతిరేకించేవారిని మూర్ఖులుగా అభివర్ణించిన ట్రంప్ తన పాలనా యంత్రాంగం సేకరించిన టారిఫ్ ఆదాయం నుంచి ధనవంతులు మినహా ప్రతి అమెరికన్‌కు త్వరలోనే కనీసం 2,000 డాలర్ల (భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ.1.77 లక్షలు) డివిడెండ్‌గా ఇస్తానని హామీ ఇచ్చారు. ట్రంప్ చేసిన ఈ ప్రకటన.. ఆయన విస్తృత టారిఫ్‌ల చట్టబద్ధతపై యూఎస్ సుప్రీంకోర్టు అనుమానాలు వ్యక్తం చేసిన కొద్ది రోజులకే రావడం గమనార్హం.

తమ విధానాల వల్లే అమెరికాలో ద్రవ్యోల్బణం దాదాపు లేదని, స్టాక్ మార్కెట్ ధరలు రికార్డు స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. మేము ట్రిలియన్ల డాలర్లు వసూలు చేస్తున్నాము. త్వరలోనే భారీ స్థాయిలో ఉన్న మా రుణం 37 ట్రిలియన్ డాలర్లను చెల్లించడం ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. టారిఫ్‌ల కారణంగానే అమెరికాలో రికార్డు స్థాయిలో పెట్టుబడులు, ప్లాంట్లు, కర్మాగారాలు వెలుస్తున్నాయని.. అందుకే ప్రతి ఒక్కరికీ 2,000 డాలర్ల డివిడెండ్ చెల్లిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మరోవైపు ట్రంప్ టారిఫ్ విధానం ప్రస్తుతం చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. జాతీయ అత్యవసర పరిస్థితుల్లో వినియోగించేందుకు ఉద్దేశించిన 1977 చట్టం కింద టారిఫ్‌లను విధించడంలో అధ్యక్షుడు కాంగ్రెస్ అధికార పరిధిని అతిక్రమించారంటూ సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ఇటీవలే తెలిపారు. దీనిపై ట్రంప్ తరఫు న్యాయవాదిని న్యాయమూర్తులు ప్రశ్నిస్తూ అనధికారిక కాల పరిమితితో టారిఫ్‌లను విధించడానికి అధ్యక్షుడు ఈ చట్టాన్ని ఉపయోగించడం కాంగ్రెస్ అధికార పరిధిని అతిక్రమించడమే అవుతుందా అని ప్రశ్నించారు. ఈ చట్టాన్ని ఉపయోగించడం ద్వారా ట్రంప్ తన అధికారాన్ని అతిక్రమించారని దిగువ కోర్టులు ఇప్పటికే తీర్పును ఇచ్చాయి. ట్రంప్ తన వ్యాఖ్యల్లో ఈ న్యాయపరమైన సవాళ్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ భద్రత కోసం కూడా సుంకం విధించడానికి అధ్యక్షుడికి అధికారం లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఈ టారిఫ్‌లు రాబోయే దశాబ్దంలో అమెరికాకు ట్రిలియన్ల డాలర్ల ఆదాయాన్ని అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కేసుపై సుప్రీం కోర్టు ఇచ్చే తీర్పు, ట్రంప్ అధికార పరిధికి ఒక ప్రధాన పరీక్షగా నిలవనుంది.

# విశ్వవిద్యాలయం వంటి ఎఆర్ కృష్ణ

### డా. ఎస్.జె.భిక్షుకు ఎఆర్ కృష్ణ దుగ్గిరాల స్మారక పురస్కారం ప్రదానం కార్యక్రమంలో డా. కె.వి.రమణాచారి

**హైదరాబాద్ (నాంపల్లి), నవంబరు 13, ప్రభాతవార్త :** ఎ.ఆర్.కృష్ణ ఎంతో నిక్కచ్చిగా, ముక్కుసూటిగా ఎవ్వరికీ తలవంచని కల్మషంలేని శ్వేతపత్రం వంటి కారణజన్ముడు, దయార్ధహృదయుడని, ఆయనే ఒక విశ్వవిద్యాలయం వంటి వాడని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. ఎఆర్. కృష్ణకు పద్మభూషణ్ రావడం నాటక రంగం లో వచ్చిన ఒకేఒక్కటని, ఆయన గొప్పదనానికిదే నిదర్శనమన్నారు. కిన్నెర సంస్థ, కార్యదర్శి ఎం.రఘురామ్ సంస్థ 48వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తలపెట్టిన మాయావినోదం, నాటకోత్సవాలు పవిత్రమైన యజ్ఞతుల్య కార్యక్రమం అన్నారు. ఈ నాటక ప్రదర్శనలకు ఆర్థిక సహాయంతో సహకరించిన వై.కె కళాపరిషత్ బొప్పన నరసింహారావు (బుజ్జి), బిఎన్ఎస్. కుమార్, కె.రాధాకృష్ణ, సుబ్బరాయశర్మ, ఎఆర్.కృష్ణ మెమోరియల్ ట్రస్ట్‌ల కళాసేవ స్పందన కలకాలం నిలవాలని ఆకాంక్షించి వారి సౌజన్యాన్ని అభినందించారు.

కిన్నెర 48వ వార్షికోత్సవాన్ని వారం రోజులపాటు మాయా వినోదం, నాటకోత్సవాలు పేర్లతో నిర్వహిస్తున్న వేడుకల చివరిరోజు గురువారం రాత్రి ముగింపు సభకు రమణాచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ 4రోజుల నాటకోత్సవాల ముగింపు సందర్భంగా యు. సుబ్బరాయశర్మ సౌజన్యంతో శ్రీజయా ఆర్ట్స్, హైదరా బాద్ వారిచే డా. మద్దాళి ఉషాగాయత్రి మూలకథ, జె.శశిమోహన్ నాటకీ కరణ, డా. శ్రీజ సాదినేని దర్శకత్వంలో రూపొందిన డస్ట్‌బిన్స్ నాటిక; ఎఆర్.కృష్ణ మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంతో మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్, చిలకలూరి పేట వారిచే మద్దుకూరి రవీంద్రబాబు రచన, దర్శకత్వంలో రూపొందిన మా ఇంట్లో మహా భారతం హాస్యనాటికలు అద్భుతంగా ప్రదర్శింపబడి అశేష నాటకప్రియుల ప్రశంసలందుకున్నాయి. చివరిగా ముఖ్యఅతిథి డా. కె.వి. రమణా చారి విశిష్ట అతిథులు జి.గోపాలకృష్ణ, యు. సుబ్బరాయశర్మ, డా. డిజిపి.శాస్త్రి, నీలం తదితరులతో కలిసి ముందుగా ఎఆర్.కృష్ణ, దుగ్గిరాల చిత్రపటాలకు పూల మాలవేసి ఘన నివాళులర్పించి ఎఆర్. కృష్ణ జయంతిని పురస్కరించుకుని డా. ఎస్.జె.భిక్షు దంపతులను ఘనంగా సత్కరించి ఎ.ఆర్.కృష్ణ దుగ్గిరాల స్మారక పురస్కారం బహూకరించారు.



ఎస్.జె.భిక్షు దంపతులకు పురస్కారం బహూకరిస్తున్న రమణాచారి, గోపాలకృష్ణ, సుబ్బరాయశర్మ, శాస్త్రి తదితరులు



కోటి దీపోత్సవంలో పాల్గొన్న కంచికామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్రసరస్వతి మహాస్వామికి అభివాదం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

# ముగిసిన కోటి దీపోత్సవం

**హైదరాబాద్ (ముషీరాబాద్), నవంబరు 13, ప్రభాతవార్త:** ఈనెల 1వ తేదీ ప్రారంభమయిన కోటి దీపోత్సవం గురువారంతో ఘనంగా ముగిసింది. ఎన్టీఆర్ స్టేడియంలో గత 13రోజులుగా ఎంతో వైభవంగా, భక్తి శ్రద్ధలతో కొనసాగిన కోటి దీపోత్సవం ముగింపు సందర్భంగా కంచికామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి భక్తులనుద్దేసించి ప్రసంగించగా, ముఖ్య అతిధులుగా రాష్ట్ర సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటి వెంకటరెడ్డి, ఎం.ఈ.ఐ.ఎల్ కృష్ణారెడ్డి, జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంత వైభవంగా నిరాటంకంగా గత 14 సంవత్సరాలుగా కోటి దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తి టీవీ యాజమాన్యం, సిబ్బందిని అభినందించారు. ముగింపురోజు కార్యక్రమాలలో భాగంగా మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి ప్రవచనం, శ్రీపురం వైభవలక్ష్మి పూజ, కంచి కామాక్షి, మధుర మీనాక్షి, కాశీ విశాలాక్షి అమ్మవార్లకు కోటి గాజుల అర్చన నిర్వహించారు. అనంతరం కంచి ఏకామ్రేశ్వర స్వామి కళ్యాణక్షత్సవం, మధురై మీనాక్షి కళ్యాణోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్తీక దీపారాధన, మహానీరాజనం, కళాకారులచే నృత్య కార్యక్రమం, మహామంగళహారతితో కోటి దీపోత్సవం ముగిసింది.

# 419 రోడ్లకు మహర్దశ

### రూ.11,399.33 కోట్లతో పనులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 13:** రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధిని వేగవంతం చేసేందుకు హైబ్రిడ్ అన్యుటీ మోడ్ (హ్యామ్) ద్వారా చేపట్టే రోడ్డుల నిర్మాణం, విస్తరణకు సంబంధించి ప్రభుత్వం సవరిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్ అండ్ బీ శాఖ ఫేజ్1 పరిధిలో మొత్తం 419 రోడ్ల పనులను 32 ప్యాకేజీల్లో రూ.11,399.33 కోట్ల వ్యయంతో ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకుముందు ప్రకటించిన హ్యామ్ ప్రతిపాదనల్లో మార్పులు చేస్తూ నూతన ప్రతిపదానలను ఆమోదించారు. ఇందులో కొత్తగా 30 రోడ్ల పనులకు ఆమోదం తెలిపారు. వీటి అంచనా వ్యయం సుమారు రూ.850.73 కోట్లుగా పేర్కొన్నారు. ఇప్పటికే మంజూరైన 7 పనులను విస్తరిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే ఆమోదించిన కొన్ని రోడ్లకు కేవలం వైడెనింగ్ కూడా చేయాలనే నూతన ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. వీటి వ్యయం రూ.299.20 కోట్లు కానుంది. కాగా గతంలో ప్రతిపాదించిన 11 రోడ్ల పనులు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. వీటితో పాటు ముందు ఆమోదించిన 11 పనులను వివిధ కారణాల వల్ల ప్రభుత్వం రద్దు చేసింది. వీటి మొత్తం పొడవు 101.38 కిమీ, అంచనా వ్యయం రూ.132.34 కోట్లు. కాగా సవరించిన ప్రణాళిక ప్రకారం మొత్తం రోడ్ల సంఖ్య 419గా మారగా... మొత్తం పొడవు: 5824.27 కి.మీ. అంచనా వేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కవర్ చేస్తూ రోడ్ల కనెక్టివిటీ, రోడ్ల నాణ్యత మెరుగుపరచడంపైనే ప్రధాన దృష్టి పెట్టనున్నామని ప్రభుత్వం తెలిపింది.

# కౌంటింగ్ సెంటర్ పరిసరాల్లో 144

### సెక్షన్ అమలు: సిఇఓ సుదర్శన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 13:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ముఖ్య ఎన్నికల అధికారి సీ. సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం(నవంబర్ 14) ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌ల పరిశీలనతో కౌంటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ఉపఎన్నికలో 59 మంది అభ్యర్థులు (నోటాతో కలిపి) పోటీలో ఉన్నందున, 42 కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు కోసం ఈసీఐ ప్రత్యేక అనుమతి ఇచ్చిందని సిఇఓ వివరించారు. మొత్తం ప్రక్రియ గరిష్టంగా 10 రౌండ్లలో పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. లెక్కింపు పనులను ఈసీఐ సాధారణ పరిశీలకులు పర్యవేక్షించనున్నారని, మొత్తం 186 మంది సిబ్బందిని సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు నియమించామని చెప్పారు. అప్‌డేట్స్‌ను ఎల్ఈడీ స్క్రీన్లు, ఈసీ యాప్ ద్వారా అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ సెంటర్‌లోకి అభ్యర్థులు, వారి ఎన్నికల ప్రతినిధులు, అనుమతిచ్చిన కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే ప్రవేశం ఉంటుందని స్పష్టం చేశారు. ఇతరులెవరికీ అనుమతి ఉండదని చెప్పారు. కౌంటింగ్ రోజున భద్రతకు పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసినట్టు, కౌంటింగ్ సెంటర్ పరిసరాల్లో సెక్షన్ 144 అమల్లో ఉంటుందని, ఉల్లంఘనలపై చర్యలు తప్పవని సీఈఓ హెచ్చరించారు.

# గేటు మీదపడి బాలుడి మృతి

**హైదరాబాద్ (దుండిగల్), నవంబరు 13, ప్రభాతవార్త:** నిర్మాణంలో ఉన్న భవనం గేటు మీద పడి ఓ బాలుడు మృతిచెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం, కుకునూర్ గ్రామానికి చెందిన దంపాల ఆకాష్ దంపతులు జీవనోపాధి కోసం నగరానికి వచ్చి భౌరంపేటలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. దంపతులు ఇరువురు రోజువారి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించు కుంటున్నారు. కాగా గురువారం ఆకాష్ పెద్దకుమారుడు నవీన్(7) అదే ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న తన తాతయ్య దగ్గరకు వెళ్లాడు. ఆడు కుంటున్న క్రమంలో సదరు భవనానికి చెందిన గేటు ప్రమాదవశాత్తు నవీన్‌పై పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



నవీన్(ఫైల్)

# ఉత్తర తెలంగాణపై చలి పంజా..

### అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 13:** తెలంగాణలో చలి వణికిస్తోంది. ఈ ఏడాది శీతాకాలం ప్రారంభం నుంచే చలి తీవ్రత ప్రారంభమైంది. గత వారం రోజులుగా రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. కొన్ని చోట్ల సింగిల్ డిజిట్, చాలా ప్రాం తాల్లో 12 డిగ్రీల కంటే తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కరీంనగర్, రాజన్న సిరిసిల్లలో అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణీలో అత్యంత కనిష్టంగా 8.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 8.2 నుంచి 15.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాబోయే రెండు రోజులు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-3 డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ నవంబర్‌లో గతం కంటే ఎక్కువ చలి తీవ్రత ఉంటుందని తెలిపింది. హైదరాబాద్ నగరంలో శుక్రవారం కొన్ని చోట్ల 10-11 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది.

# గతేడాది భారత్ బొగ్గు రంగం గణనీయమైన ప్రగతి

### కోల్ పిఎస్‌యుల అర్థ వార్షిక సమీక్షలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 13:** గతేడాది భారత బొగ్గు రంగం గణనీయమైన ప్రగతిని నమోదు చేసింది. ఈసారి కూడా ఆ రికార్డులను అందుకోవడమే కాకుండా అంతకు మించిన ప్రగతిని ఈ ఆర్థిక సంవత్సరంలోనూ చేధించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 5 నెలల సమయం మిగిలి ఉంది కాబట్టి.. ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలి. మరీ ముఖ్యంగా ఉత్పత్తి విషయంలో ఉన్న సమస్యలను అధిగమించి ముందుకెళ్లాలని సూచించారు. గురువారం ఢిల్లీలో కోల్ పీఎస్‌యూల అర్థవార్షిక సమీక్ష సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రసంగించారు ఈసారి వర్షాల కారణంగా ఉత్పత్తికి అంతరాయం కలిగింది. దీన్ని అర్థం చేసుకోగలం. కానీ తర్వాత పుంజుకుని ఉత్పత్తిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై అన్ని సబ్సిడరీల సీఎండీలు చొరవతీసుకోవాలి. పరిస్థితిలో మార్పులు తీసుకురావాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. ఏడాదికేడాది ఉత్పత్తి, రెవెన్యూ విషయంలో పురోగతి సాధించాలని చెప్పారు. ఈ విషయంలో రాజీ పడొద్దు. వచ్చే మూడున్నరేళ్లపాటు కేంద్ర ప్రభుత్వం సంస్కరణల ఆధారంగానే నడవాలి. అందుకోసం అన్ని మంత్రిత్వ శాఖలు ప్రత్యేక వ్యూహంతో పనిచేస్తున్నాయన్నారు. మనం కూడా వీలైనన్ని సంస్కరణలు తీసుకొచ్చి బొగ్గు రంగాన్ని మరింత ప్రగతి పథంలోకి తీసుకెళ్లాలి. మన వద్ద ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్.. వంటి అత్యాధునిక వ్యవస్థ ఉంది. కానీ మనం దీన్ని సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు.. సాంకేతికతను వాడుకుంటూ.. వ్యవస్థను మరింత సరళంగా, ఫలితాలు సాధించేలా మార్చుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. ప్రతి సబ్సిడరీ కూడా.. ఇతర సబ్సిడరీలో అమలవుతున్న ఉత్తమ పద్ధతులను తెలుసుకుని అమలు చేయాలి. అంతర్జాతీయంగా ఉన్న ఉత్తమ పద్ధతులను పాటించాలని చెప్పారు. మనం తీసుకున్న చిన్న నిర్ణయం కారణంగా.. ఇవాళ కోటి రూపాయల ఇన్సూరెన్స్ పథకాన్ని మన ఉద్యోగులకు, మన కార్మికులకు అందిస్తున్నాం. ఇదే విధంగా మరిన్ని కొత్త నిర్ణయాలతో.. మంచి మార్పులు తీసుకొచ్చే దిశగా కృషిచేయాలని చెప్పారు. సిఎంపిడి(సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇనిస్టిట్యూట్ లిమిటెడ్) ఓవర్ బర్డన్ టెస్టింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నిరంతరం శాంపిల్ టెస్టింగ్ చేస్తూ.. రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉత్పత్తిపై పనిచేయాలని చెప్పారు. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ సానుకూలంగా స్పందిస్తూ.. మనకు వెంటవెంటనే అనుమతులు ఇస్తోందని, ఈ విషయంలో మరేమైనా సమస్యలున్నా వెనువెంటనే పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. కోల్ వాషరీస్ విషయంలో మనం అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలి. వాషరీస్‌తో క్వాలిటీ పెరుగుతుంది. బొగ్గు దిగుమతులు తగ్గుతాయి. అందుకే దీనిపై ప్రత్యేకమైన దృష్టి సారించాలని చెప్పారు. సబ్సిడరీ లెవల్లో.. సబ్ కమిటీలను ఏర్పాటుచేసి కార్యాచరణ ప్రారంభించాలి. కార్మికుల సంక్షేమం, వారి ఆరోగ్య సంరక్షణ విషయంలో.. రాజీపడొద్దు. దీంతోపాటుగా..యుపిఎస్‌సి విద్యార్థు లకు ప్రోత్సాహాన్ని అందించే విషయంలో.. ప్రత్యేక చొరవ తీసుకోవాలి. మైన్ క్లోజర్ విషయంలో.. ప్రత్యేక సెల్ ఏర్పాటుచేయాలి. మైన్ క్లోజర్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. మూడేళ్లలో 141 డీకోల్డ్ మైన్స్‌ను మూసేస్తామని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ విషయంలో రాజీ పడకుండా సీఎండీలు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్ చంద్ర దూబే, బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, కోలిండియా చైర్మన్, బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి సనోజ్ కుమార్ ఝా, అదనపు కార్యదర్శి రూపిందర్ బ్రార్, మంత్రిత్వ శాఖ అధికారులు, సబ్సిడరీల సీఎండీలు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక ఒత్తిడిలో ఖజానా

### రూ.45,139 కోట్లకు చేరిన లోటు

### అంచనాల కంటే తగ్గిన ఆదాయం

### జీతాలు, సబ్సిడీల ఖర్చు రూ.89,394 కోట్లు

**హైదరాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్ర ఖజానాపై ఆర్థిక ఒత్తిడి ఆందోళన స్థాయికి చేరుకుంది. ప్రస్తుత 2025-26 సంవత్సరంలోని అర్థ కాలానికి గాను ఆర్థిక లోటు భారీగా నమో దైంది. రాష్ట్ర ఆదాయానికి, వ్యయానికి మధ్య అంతరం క్రమేపీ పెరుగుతోంది. ఈ విధంగా సెప్టెంబర్ నాటికి రూ.45,139 కోట్లకు చేరుకుంది. ఈ లోటు ఇప్పటికే వార్షిక లక్ష్యంలో 83.58 శాతంగా రికార్డయింది. ఆర్థిక శాఖ అధికారవర్గాల వివరాల ప్రకారం ఇదే కాలానికి ఆదాయ వసూళ్లు రూ.76,940 కోట్లుగా ఉన్నాయి. ఇది అంచనాల కంటే చాలా తక్కువ కావడం గమనార్హం. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లతో పాటు, ప్రభుత్వం ఇస్తున్న వివిధ సబ్సిడీలకు గాను రూ.89,394 కోట్లకు వ్యయం చేరుకుంది. ఈ 2025-26 ఆర్థిక సంవత్సరానికి మొత్తం ఆర్థిక లోటు రూ.54,009.74 కోట్లుగా వార్షిక అంచనా బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. అయితే ఈ ఆర్థిక లోటు కేవలం అర్థ సంవత్సరానికే 45,139.12 కోట్లుగా ఉండటం పట్ల ఆందోళన కలిగిస్తోంది. అంటే ఆర్థిక సంవత్సరం సగం చివరి నాటికి సర్కార్ అంచనా వేసిన సంఖ్యలో దాదాపు 83.58 శాతం చేరినట్లు వెల్లడవుతోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఇదే కాలానికి గాను రూ.76,940 కోట్ల ఆదాయాన్ని సమకూరింది. అయితే ఇది వార్షిక అంచనా బడ్జెట్‌లో పేర్కొన్న దానిలో మూడింట ఒక వంతు మాత్రమే. ఎక్కువ డబ్బు పన్నుల నుండి వస్తుంది. గ్రాంట్లు లేదా ఫీజులు వంటి ఇతర వనరుల నుండి వచ్చే ఆదాయం ఊహించిన దానికంటే చాలా తక్కువగా ఉంది. ప్రభుత్వం ఖర్చు ఎక్కువగా ఉంది. జీతాలు, పెన్షన్లు మరియు సబ్సిడీలు వంటి సాధారణ ఖర్చుల కోసం రూ. 89,394 కోట్లు ఖర్చు చేసింది.

ఈ ఖర్చులు వేగంగా పెరుగుతూ బడ్జెట్‌లో ఎక్కువ భాగాన్ని ఆక్రమించాయి. దీనికి తగినట్లుగా మూలధన వ్యయం ఇప్పటికే ఆర్థిక సంవత్సరం లక్ష్యంలో 60 శాతంగా ఉంది. బడ్జెట్‌లో పేర్కొన్న మూలధన వ్యయం రూ.36,504.45 కోట్లు ఉండగా, ఇప్పటివరకు మూలధన వ్యయం రూ.22,209.20 కోట్లుగా తేలింది. ఈ నేపథ్యంలో వార్షిక అంచనా ప్రణాళికలో పేర్కొన్న రూ.54,009.74 కోట్లు రుణంలో సెప్టెంబర్ నాటికి 83.58 శాతం మేర రూ.45,139.12 కోట్లు సేకరించింది.

ఈ విధంగా సేకరించిన రుణంలో ఎక్కువ భాగం కొత్త ప్రాజెక్టుల కోసం కాకుండా సాధారణ ఖర్చులకే ఉపయోగించబడుతున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. దీంతో రూ.12,452.89 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడి రోజువారీ ఖర్చులను కూడా సాధారణ ఆదాయంతో తీర్చడం పరిస్థితికి దారి తీస్తోందనే ఆందోళన వ్యక్తమవుతోది. అయితే 2025-26 బడ్జెట్ అంచనాల్లో మాత్రం రూ. 2,738.33 కోట్ల రెవెన్యూ మిగులును అంచనా వేసింది. ఈ లెక్కన ఆర్థిక సంవత్సరం అర్థ సంవత్సరం ముగిసే సమయానికి రాష్ట్రం రెవెన్యూ లోటు రూ.12,452.89 కోట్లతో కూరుకుపోయినట్లు వెల్లడవుతోంది. ఆదాయం కంటే వ్యయం భారీగా పెరుగుతుండగా, ముఖ్యంగా జీతాలు, పెన్షన్లు మరియు సబ్సిడీలు, రుణాలకు అయ్యే కిస్తీలు తదితర వాటికి అధికంగా ఖర్చు చేయక తప్పనిసరి ఏర్పడింది.

# కుమామోటో మాస్టర్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు లక్ష్య




**న్యూఢిల్లీ:** కుమామోటో మాస్టర్స్ 2025లో లక్ష్య సేన్ ప్రిక్వార్టర్ ఫైనల్స్ లో ప్రత్యర్థిని చిత్తు చేసి క్వార్టర్ ఫైనల్స్ కు చేరుకున్నాడు. లక్ష్య సింగపూర్‌కు చెందిన జాసన్ టెహ్‌ను వరుస గేమ్‌లలో ఓడించాడు. పాన్‌లోని కుమామోటో నగరంలో గురువారం జరిగిన కుమామోటో మాస్టర్స్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత ఏస్ లక్ష్యసేన్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. అతను సింగపూర్‌కు చెందిన జియా హెంగ్ జాస్న్ టెహ్‌ను కేవలం 39 నిమిషాల వరుస గేమ్‌లో 21-13, 21-11 తేడాతో ఓడించి, బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్‌లో వరుసగా రెండో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఆట మధ్యలో విరామం రాకముందే స్కోర్లు 10-10తో సమంగా ఉండటంతో మ్యాచ్ చాలా దగ్గరగా ప్రారంభమైంది, కానీ తర్వాత లక్ష్య తదుపరి 14 పాయింట్లలో 11 పాయింట్లను గెలుచుకుని ఆటను తన ఖాతాలో వేసుకున్నాడు. రెండవ గేమ్‌లో భారత షట్లర్ ప్రారంభం నుండే తన దూకుడు ఆటతో ర్యాలీలపై ఆధిపత్యం చెలాయించడం ప్రారంభించాడు. మరియు హాఫ్ టైం ముగిసే సమయానికి 11-4తో భారీ ఆధిక్యాన్ని సాధించాడు. ఈ నెల 14న జరిగే చివరి 8వ రౌండ్‌లో అతను మాజీ ప్రపంచ ఛాంపియన్ సింగపూర్‌కు చెందిన లోహ్ కీన్ యూతో తలపడతాడు.

# న్యూజిలాండ్‌దే టి20 సిరీస్

## వెస్టిండీస్ 3-1 తేడాతో చిత్తు




**న్యూఢిల్లీ:** ఐదు టి20 సిరీస్‌లో వెస్టిండీస్ పై న్యూజిలాండ్ పై చేయి సాధించింది. దునెడిన్ వేదికగా చివరి ఐదో టి20 మ్యాచ్ గురువారం జరిగింది. ఇందులో 8 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ గ్రాండ్ విక్టరీతో 1-3 తేడాతో న్యూజిలాండ్ సిరీస్ కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 18.4 ఓవర్లలో 140 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అద్భుతంగా రాణించిన న్యూజిలాండ్ దుమ్ము లేపింది. కేవలం 15.4 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే నష్టపోయి 141 పరుగులకు ఆలౌట్ అయింది. జేకబ్ డఫీ 4 వికెట్లు తీసి విండీస్‌ను దెబ్బకొట్టాడు. మరో పేసర్ జిమ్మి నీషమ్ 2, జేమిసన్, బ్రేస్‌వెల్, సోధి, సాంట్నర్ తలో వికెట్ తీశారు. విండీస్ ఇన్నింగ్స్‌లో రోస్టన్ ఛేజ్ (38) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. చివర్లో రొమారియో షెపర్డ్ (36) బ్యాట్ ఝుళిపించలేకపోయి ఉంటే విండీస్ ఈ మాత్రం స్కోర్ కూడా చేయలేకపోయేది. వీరితో పాటు జేసన్ హోల్డర్ (20), రోవ్‌మన్ పావెల్ (11), షాయ్ హోప్ (11) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఛేధించేందుకు బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఆడుతూపాడుతూ విజయతీరాలకు చేరింది. ఓపెనర్లు టిమ్ రాబిన్సన్ (45), డెవాన్ కాన్వే (47 నాటౌట్) రాణించడంతో 15.4 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. కివిస్ గెలుపులో రచిన్ రవీంద్ర (2), చాప్‌మన్ 21 నాటౌట్) కూడా తలో చేయి వేశారు. షెపర్డ్, స్ప్రింగర్‌కు తలో వికెట్ దక్కింది. ఈ సిరీస్‌లో విండీత్ తొలి మ్యాచ్‌లో గెలవగా, న్యూజిలాండ్ 2, 3, 5 టీ20లు గెలిచింది. వర్షం కారణంగా నాలుగో టీ20 రద్దయింది.

ఆట






# దక్షిణాఫ్రికాతో నేడే కీలక సమరం

## అమీ తుమీకి సిద్ధం.. రూట్ మార్చిన టీమిండియా

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. కోల్‌కతా వేదికగా ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్న తొలి టెస్ట్‌లో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) 2025-27 సైకిల్‌లో భాగంగా జరుగుతున్న ఈ సిరీస్‌లో విజయమే లక్ష్యంగా ఇరు జట్లు సన్నద్ధమవుతున్నాయి. ఈ సిరీస్‌లో గెలిచిన జట్లకు డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు మెరుగవనున్నాయి. అయితే తొలి మ్యాచ్‌కు ర్యాంక్ టర్నర్ వద్దని టీమిండియా మేనేజ్‌మెంట్ కోరినట్లు తెలుస్తోంది. గతేడాది సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన మూడు టెస్ట్‌ల సిరీస్‌లో టీమిండియా క్లీన్ స్వీప్‌అయ్యింది. భారత టెస్ట్‌క్రికెట్ చరిత్రలోనే సొంత గడ్డపై క్లీన్‌స్వీప్ కావడం ఇదే తొలిసారి. ఈమూడు టెస్ట్‌ల సిరీస్‌లో టీమిండియా ర్యాంక్ టర్నర్ పిచ్‌లపై ఆడలేకమూల్యం చెల్లించుకుంది. ఈ పరాజయంతో టీమిండియా డబ్ల్యూటీసీ 2025 ఫైనల్‌చేరే అవకాశాలను దెబ్బ తిన్నాయి. గతంలో స్పిన్‌తోనే టీమిండియా విజయాలు సాధించేది. కానీ గత రెండేళ్లుగా భారతబ్యాటర్లు స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కో లేకపోతున్నారు. న్యూజిలాండ్ చేతిలో ఎదురైన పరాజయం నేపథ్యంలో టీమిండియా రూటు మార్చింది. పేస్‌తో పాటు కాస్త స్పిన్, బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే వికెట్లపై ఆడాలనుకుంటుంది. ఈ క్రమంలోనే తొలి టెస్ట్‌కుసమతూకమైన పిచ్‌ను సిద్ధంచేశారు. సాధారణంగా ఈడెన్ గార్డెన్స్‌లో ఆరంభంలో పిచ్ పేసర్లకు సహకరిస్తోంది. ఆ తర్వాత బ్యాటర్లకు అనుకూలంగా మారుతుంది. మ్యాచ్ సాగుతున్నా కొద్దీ స్పిన్నర్లు ప్రభావం చూపిస్తారు. స్పిన్‌పిచ్‌లు సిద్ధం చేసినా తమకే అడ్వాంటేజ్‌గా మారుతుందని సౌతాఫ్రికా భావిస్తోంది. ఇటీవలే పాకిస్థాన్ పర్యటనలో ఆజట్టు 1-1తో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను సమం చేసుకుంది. ఆ జట్టు స్పిన్ విభాగం బలంగా ఉంది. ఈ క్రమంలోనే సమతూకమైన పిచ్‌లను సిద్ధం చేసింది. ఇక భారత్ జట్టులో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), పంత్ (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), యశస్వి జైశ్వాల్, కేఎల్ రాహుల్, సాయిసుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి, సిరాజ్, కుల్‌దీప్ యాదవ్, ఆకాశ్ దీప్ ఉండే ఛాన్స్ ఉంది.

# చైనా ఓపెన్‌లో.. అనహత్ ఓటమి




**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్ స్క్వాష్, పిఎస్ఎ గోల్డ్ ఈవెంట్‌లో మహిళల జాతీయ ఛాంపియన్ భారత్ యువ క్రీడాకారిణి అనాహత్ సింగ్ ఓటమిపాలైంది. ఈజిప్ట ఎనిమిదో సీడ్, ప్రపంచ 15వ ర్యాంకర్ సనా ఇబ్రహీం చేతిలో 11-5, 6-11, 4-11, 7-11 తేడాతో పరాజయం చెంది. సిడ్నీలో గురువారం జరిగిన బోండి ఓపెన్ పిఎస్ఎ ఛాలెంజర్ ఈవెంట్‌లో, టాప్ సీడ్ రతికా సుతంథిర సీలన్ మొదటి రౌండ్‌లో ఆరాధన కస్తూరిరాజను 11-8, 11-3, 11-5తో, క్వార్టర్ ఫైనల్స్ లో అనంతనా ప్రసెర్ట్రాటనకుల్ (థాయిలాండ్)ను 11-7, 11-3, 11-3తో ఓడించి సెమీఫైనల్‌కు చేరుకుంది. అంతకు ముందు జరిగిన ఈవెంట్‌లో అనాహత్ విజయంతో శుభారంభం చేయగా, స్వదేశీయులైన వేలవన్ సెంథిల్‌కుమార్, అభయ్ సింగ్ పురుషుల ప్రారంభ రౌండ్‌లో ఓడిపోయారు. ప్రపంచ ర్యాంక్‌లో 38వ స్థానంలో ఉన్న ఢిల్లీ టీనేజర్ అనహత్, పిఎస్ఎ గోల్డ్ ఈవెంట్ రౌండ్ ఆఫ్32లో ఈజిప్ట్‌కు చెందిన మెన్నా హామీద్‌ను 11-6, 11-8, 11-3 తేడాతో ఓడించింది. అభయ్ ఫ్రెంచ్ ప్రపంచ 17వ ర్యాంక్ బాప్టిస్ట్ మసోట్టి చేతిలో 11-8, 11-7, 11-4 తేడాతో ఓడిపోగా, సెంథిల్‌కుమార్ ఉన్నత ర్యాంక్‌లో ఉన్న ఈజిప్షియన్ మొహమ్మద్ అబౌల్‌ఘర్ చేతిలో 8-11, 12-14, 6-11 తేడాతో ఓడిపోయాడు. అంతకుముందు, అనహత్ కెనడియన్ ఓపెన్‌లో బాగా రాణించి, ఈ ఈవెంట్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది.

## ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో

# ఛాంపియన్‌గా సురేఖ

## మూడు టైటిళ్లతో తొలి ఆర్చర్‌గా రికార్డు

## దీపి-అభిషేక్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో స్వర్ణం




**న్యూఢిల్లీ:** భారత్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో టైటిల్ సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. అలాగే దీపిశిఖ-అభిషేక్ వర్మ ద్వయం మిక్స్‌డ్ ఈవెంట్‌లో స్వర్ణంతో కిరీటాన్ని కైవసం చేసుకుంది. ఇక జ్యోతి ఈ ఈవెంట్‌లో మూడు వ్యక్తిగత టైటిళ్లను గెలుచుకున్న మొదటి ఆర్చర్‌గా ఆమె నిలిచింది. ఇప్పటికే 2015, 2021లో రెండుసార్లు టైటిళ్లను దక్కించుకుంది. బంగ్లాదేశ్‌లోని ఢాకాలో గురువారం జరిగిన భారత మహిళల కాంపౌండ్ వ్యక్తిగత ఫైనల్లో జ్యోతి ప్రితికా ప్రదీప్‌ను 147-145 తేడాతో ఓడించి బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఇది 2015 మరియు 2021లో విజయాల తర్వాత ఆసియా ఛాంపియన్‌షిప్‌లో జ్యోతికి ఇది మూడవ వ్యక్తిగత స్వర్ణం. అంతకుముందు ఆమె చైనీస్ తైపీకి చెందిన సియు చెన్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది.నఇక ఉదయం సెషన్‌లో, భారత కాంపౌండ్ ఆర్చర్లు కూడా తమ మహిళల, మిక్స్‌డ్ టీమ్ టైటిళ్లను నిలబెట్టుకున్నారు. దీపిశిఖ, ప్రితికా ప్రదీప్, జ్యోతి త్రయం మహిళల జట్టు బంగారు పతకంతో రోజును ప్రారంభించి, దక్షిణ కొరియాను 236-234 తేడాతో ఓడించి తమ 2023 కిరీటాన్ని నిలుపుకుంది. ఆ తర్వాత దీపిశిఖ ఖాతాలో మరో స్వర్ణం చేరింది. దీపి అభిషేక్ వర్మతో కలిసి బంగ్లాదేశ్‌పై 153-150 తేడాతో విజయం సాధించి కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ స్వర్ణాన్ని సాధించింది. అయితే పురుషుల జట్టు ఫైనల్‌లో కజకిస్తాన్ చేతిలో 229-230 తేడాతో ఓడిపోయి, ఒక్క పాయింట్ తేడాతో స్వర్ణ పతకం సాధించకపోవడంతో భారతదేశం హ్యాట్రిక్ పూర్తి చేయలేకపోయింది.

# ఒక్కరోజులోనే రూ.2290 పెరిగిన బంగారం!

## కిలో వెండి రూ.1.73 లక్షలు!



**న్యూఢిల్లీ, నవంబరు 13:** అమెరికాలో షట్‌డౌన్‌కు తెరపడటం, ఫండ్‌రేట్లు తగ్గుతున్న క్రమంలో డాలరుతో రూపాయి క్షీణత వంటివి బంగారం రేట్లపై ప్రభావం చూపిస్తున్నాయి. గురువారం బులియన్ మార్కెట్‌లో పదిగ్రాముల 24 కేరట్ల బంగారం 1,27,800కు చేరింది. 2290 రూపాయలు పెరిగినట్లు కనిపిస్తోంది. అలాగే 22 క్యారెట్ల బంగారం 2100 పెరిగి 1,17,150కి చేరుకుంటే 18 క్యారెట్ల బంగారం 1720 రూపాయలు పెరిగి 95,850కి చేరింది. ఇక అంతర్జాతీయ మార్కెట్లలో అయితే ఔన్స్ బంగారం ధరలు 4200 నుంచి 4210కి చేరింది. రానున్న కాలంలో 4800కి సైతం పెరిగే అవకాశం ఉందని బులియన్ ట్రేడర్లు చెపుతున్నారు. బంగారం తరహాలోనే వెండి ధరలు కూడా రికార్డుస్థాయికి చేరాయి. గురువారం వెండిధరలు కిలో ఒక్కింటికి పదివేలు పెరిగి 1.72 లక్షలకు చేరుకుంది. పదిగ్రాముల వెండిధరలు వెయ్యిరూపాయలు పెరిగి 17,200కి చేరింది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.1.73 లక్షలుగా కొనసాగింది. ఇప్పటికే బంగారం ఔన్స్ ఒక్కింటికి 4150 డాలర్లుక్రాస్ అయిందని, అలాగే వెండి కూడా ఔన్స్ ఒక్కింటికి 52 డాలర్లను క్రాస్‌చేసినట్లు నిపుణులు చెపుతున్నారు. గడచిన మూడురోజులుగా వెండి మార్కెట్‌లో ధరలు పెరుగుతూనే ఉన్నాయి. దక్షిణాదిమార్కెట్‌లోనే 1.73 లక్షలకు చేరింది.

# డాలర్ వర్సెస్ రూపాయి 88.68

**న్యూఢిల్లీ,నవంబరు 13:** డాలరుతో రూపాయి మారకం విలువలు ఆరు పైసలు క్షీణించి రూ.88.68గా నిలిచాయి. ఫండ్ మార్కెట్లనుంచి ఎక్కువ విత్‌డ్రాచేసుకోవడం వల్ల క్షీణత మరింతపెరిగిందని నిపుణుల అంచనా. అలాగే స్థానిక దిగుమతిదారులు, చమురు కంపెనీలు, ఎగుమతి దారులకు ఎక్కువ డాలర్లు అవసరం పడటం చెల్లింపులు డాలర్లలోనే చేయడంతో అమెరికా కరెన్సీ శక్తివంతం అయింది. విదేశీ ట్రేడర్లు అంచనాలప్రకారం ముడిచమురుధరలు తగ్గడంతో దిగుమతులు పెరిగి చెల్లింపులు డాలర్లలోనే చేయాల్సి వచ్చిందని చెపుతున్నారు. అలాగే భారత్ అమెరికాలమధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు కూడా రూపాయి క్షీణతపై ప్రభావం చూపిస్తున్నాయి. ఇంటర్‌బ్యాంకు విదేశీ కరెన్సీ ఎక్స్చేంజి కౌంటర్లలో రూపాయి డాలరుకు 88.66గా నడిచింది. ఇంట్రాడేలో 88.63వరకూ వెళ్లి ఒకదశలో 88.73 రూపాయలకు పడిపోయింది. చివరకు ట్రేడింగ్ ముగిసేనాటికి 88.68 రూపాయలుగా కనిపించింది. ముందు రోజు రూపాయి 12 పాసలు క్షీణించి 88.62గా కొనసాగినసంగతి తెలిసిందే. రానున్న కాలంలో రూపాయి 88.40 నుంచి 89వరకూ కొనసాగవచ్చని షేర్‌ఖాన్ మిరాయ్ అసెట్ పరిశోధకులు అనూజ్‌చైదరి తెలిపారు. ఇక బ్రెంట్ ముడిచమురు కూడా 0.29శాతం క్షీణించి 99.20 రూపాయలుగా ఉంది. 43 రోజుల షట్‌డౌన్‌కు తెరపడటంతో కొంతమేర ముడిచమురుధరలు పెరిగాయి. అదే ఫ్యూచర్‌ట్రేడింగ్‌లో బ్యారెల్‌కు 62.58 డాలర్లుగా నమోదయింది.

# ఎగుమతిదారుల కోసం 500 కోట్ల డాలర్ల రిలీఫ్ ప్యాకేజి!

**న్యూఢిల్లీ, నవంబరు 13:** అమెరికా సుంకాల భారం పడుతున్న ఎగుమతి దారులను ఆదుకునేందుకుగాను భారత్ 500 కోట్ల డాలర్ల రిలీఫ్ ప్యాకేజిని కేటాయించింది. ప్రస్తుతం నడుస్తున్న వాణిజ్య ఆంక్షలు, ఒప్పందం కొలిక్కి రాకపోవడం వంటి వాటితో అమెరికా ఎగుమతులపై ఎక్కువ ఒత్తిడిని ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఇందుకోసం ఎలాంటి సెక్యూరిటీ లేని రుణాలను 2.3 బిలియన్ డాలర్లవరకూ కేటాయించాల నిర్ణయించింది. అదనంగా మరో మూడు బిలియన్ డాలర్లు ఆరేళ్ల పాటు ఎగుమతిదారులకు అందిస్తుంది. వారికి ఆర్థికసాయం, ఎగుమతులు క్రమ బద్ధీకరించడం, లాజిస్టిక్ నెట్‌వర్క్ పటిష్టం చేయడానికి ఈ నిధులు ఉపయోగించు కుంటాయి.

భారత్ ఎగుమతులు లక్షకోట్ల డాలర్ల లక్ష్యానికి అనుగుణంగానే ఎగుమ తులను మరింతగా ప్రోత్సహించేందుకు ఈచర్యలు చేపట్టింది. సుంకాలు విధించిన తర్వాత భారత్‌నుంచి అమెరికాకు ఎగుమ తులు 12శాతం తగ్గిపోయాయి. టెక్స్ టైల్స్, తోళ్లు,పాదరక్షలు, జెమ్స్ జ్యూయె లరీ వంటివి మరింతగా ఒత్తిడికి లోన య్యాయి. ఈ దశాబ్దం చివరినాటికి లక్ష కోట్ల డాలర్ల ఎగుమతులుచేయాలన్న లక్ష్యం భారత్ వాణిజ్యశాఖపై ఉంది.







## ఎంట్రీ లెవెల్‌ప్లాన్‌ను నిలిపివేసిన ఎయిర్‌టెల్!

**ముంబయి, నవంబరు 13:** దేశీయంగా రెండో అతిపెద్ద టెల్కో ఎయిర్‌టెల్ తన ప్రీపెయిడ్ టారిఫ్ ప్లాన్లలో మార్పులు చేసింది. సంస్థ రూ.189ప్లాను పూర్తిగా నిలిపివేసి షాక్ ఇచ్చింది. ఈప్లాన్ స్థానంలో రూ.199 విలువైన కొత్త ప్లాన్‌ని ఎంట్రీ లెవల్ ఆఫర్‌గా ప్రకటించింది. ఈ ప్యాక్‌లో వినియోగదారులకు అపరిమిత వాయిస్ కాలింగ్ సౌకర్యంతో పాటు ఎస్ఎంఎస్ బెనిఫిట్స్‌కూడా లభిస్తాయి. మునుపటి రూ.189 ప్లాన్ 21 రోజుల వ్యాలిడిటీతో అందించేది. అందులో వన్ జీబీ మొబైల్‌డేటా, 300 ఎస్ఎంఎస్‌లు, అపరిమిత లోకల్, ఎస్‌టీడీ, రోమింగ్ కాల్స్ సౌకర్యం ఉండేది. ఇక కొత్త రూ.199 ప్లాన్‌లో 28 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది.ఈ ప్లాన్ ప్రధానంగా తక్కువగా ఇంటర్‌నెట్ ఉపయోగించే కస్టమర్లను దృష్టిలో ఉంచుకుని రూపొందించింది.

ఇందులో రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, అపరిమిత కాలింగ్ సౌకర్యం, మొత్తం 2 జీబీ మొబైల్ డేటా అందివ్వనున్నది. డేటా లిమిట్ పూర్తయిన తర్వాత ప్రతీ ఎంబీకి రూ.0.5 చొప్పున అదనంగా ఛార్జ్‌వర్తిస్తుంది. ఆతర్వాత అందుబాటులో ఉన్న ప్లాన్ ధర రూ.219. ఇటీవలి కాలంలో టెలికాం రంగంలో ధరల పెరుగుదల నేపథ్యంలో ఎయిర్‌టెల్ ఈ మార్పులను తీసుకువచ్చింది.

# లాభాల్లోనే ముగిసిన స్టాక్ మార్కెట్లు!

## మెటల్, రియాల్టీ, ఫార్మాల షేర్ల ర్యాలీ



**ముంబయి, నవంబరు 13:** దేశీయ ఈక్విటీ సూచీలు గురువారం సానుకూల ధోరణుల్లోనే ముగిసాయి. వరుసగా నాలుగో రోజు కూడా లాభాల్లోనే ముగిసాయి. రిటైల్ ద్రవ్యోల్బణం 0.25 శాతానికి దిగిరావడం ట్రేడర్లకు కలిసొచ్చింది. అమెరికా భారత్‌ల మధ్య ట్రేడ్‌డీల్ కొలిక్కి వచ్చేస్తోందన్న వార్తలు ఇందుకు దోహదం చేసాయి. అలాగే బీహార్‌పై ఎన్డీయే ఎగ్జిట్‌పోల్స్ కూడా కొంతమార్కెట్లకు ఊతం ఇచ్చాయి. నిఫ్టీ 25,850 మార్కువద్ద సెటిల్ అయింది. మెటల్ రియాల్టీ,ఫార్మా షేర్లు మద్దతిస్తే పిఎస్‌యు బ్యాంకు, మీడియా, ఐటిరంగాలషేర్లు క్షీణించాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 12.16పాయింట్లుపెరిగి 84,478.67 పాయింట్లవద్ద స్థిరపడింది. నిఫ్టీ 50సూచీ 3.35 పాయింట్లు పెరిగి 25,870.15 పాయింట్లవద్ద స్థిరపడినట్లు గణాంకాలు చెపుతున్నాయి. నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1.51 శాతం,నిఫ్టీ 1.151 శాతం చొప్పున పెరిగామి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.34 శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.30శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఇలో 1844 కంపెనీల షేర్లు లాభాల్లో ర్యాలీతీస్తే 2382 షేర్లు క్షీణించాయి. 154 కంపెనీల షేర్లుస్థిరంగాఉన్నాయి. నిఫ్టీలో మెటల్‌సూచీ లాభపడింది. హిందూస్థాన్ జింక్ 2.8శాతం, హిందాల్కో 2.26శాం, వేదాంత 1.77శాతం, జిందాల్ స్టెయిన్‌లెస్ 1.61 శాతం, వెల్‌స్పన్ కార్ప్ 1,.6శాతం, జిందాల్ స్టీల్ 0.79శాతం, నేషనల్ అల్యూమినియం కంపెనీ 0.67శాతం సెయిల్ 0.56శాతం, జెఎస్‌డబ్ల్యుస్టీల్ 0.3శాతం, ఎన్ఎండిసి 0.3శాతం చొప్పున పెరిగాయి. ఇక పోగా ల్లాయిడ్స్ మెటల్స్ అండ్ ఎనర్జీ 3.37శాతం, ఎపిఎల్ అపోలో ట్యూబ్స్ 1.7శాతం, టాటా స్టీల్ 0.97శాతం దిగువన ముగిసాయి. యూరోపియన్ స్టాక్స్ లాభాల్లోనే ముగిసాయి. ఆసియా మార్కెట్లు కూడా ప్రభుత్వ షట్‌డౌన్ ముగియడంతో భారీ లాభాలతో కదలాడాయి. వాల్‌స్ట్రీట్‌లో డౌజోన్స్ పారిశ్రామిక సగటు రికార్డుస్థాయికి చేరింది. ఎస్అండ్‌పి 500 కూడా నిలకడగా ముగిస్తే నాస్‌డాక్ కాంపోజిట్ 0.26శాతం క్షీణించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.